Dwaraka

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

కరీంనగర్

సోమవారం 15•1•2018 • వెల.5 రూ. • సంపుటి 7 • సంచిక 199 • పేజీలు : 16 + (20/16)

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



నేడు సంక్రాంతి

శుభాకాంక్షలు పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు.
- దీవకొండ దామోదర్‌రావు, సీఎండీ, నమస్తే తెలంగాణ

సెలవు సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం 15-1-2018న మా కార్యాలయానికి సెలవు. కావున మంగళవారం (16-1-2018) సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.
- ఎడిటర్

కట్టుదిట్టంగా పట్టా

అత్యంత భద్రతాఫీచర్లతో పాస్ పుస్తకాల రూపకల్పన


ట్యాంపరింగ్ జరుగదు.. నకిలీ కుదురదు

యుద్ధప్రాతిపదికన ఐటీ సేవలు ▪ రికార్డుల నిర్వహణకు బ్లాక్‌చైన్ టెక్నాలజీ వినియోగం

అక్షరం మార్చినా అలర్ట్ మెసేజ్ ▪ ప్రతి ఎంట్రీ.. అందరికీ అందుబాటులో

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మార్చి 11న రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజున భూ యజమానులకు ఇవ్వనున్న పట్టాదార్ పాస్‌పుస్తకాలు పకడ్బందీగా తయారవుతున్నాయి. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఫీచర్లతో వీటిని రూపొందిస్తున్నారు. రాష్ట్రమంతటా ఒక్క రోజునే పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించడంతో.. వీటి తయారీలో ఎలాంటి ప్రమాణాల లోటుపాట్లు లేకుండా సిద్ధం చేస్తున్నారు. ఇందుకు తగినట్టుగా రెవెన్యూ అధికార యంత్రాంగం ఈ పనిలో నిమగ్నమైంది. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ ఏర్పాట్లు చేస్తున్నది. సలహాదారుగా సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారు. మామూలుగా కేంద్ర ప్రభుత్వం పౌరులకు ఇచ్చే పాస్‌పోర్ట్‌కంటే ఎక్కువ భద్రతా ప్రమాణాలను పాస్‌పుస్తకాల తయారీలో పాటిస్తున్నారు. మొత్తం 26 రకాల భద్రతా ఫీచర్లు ఈ పాస్‌పుస్తకంలో ఉండటంతో దీనికి నకిలీ పుట్టించడం ఎంతమాత్రం సాధ్యం కాదని సాంకేతిక నిపుణులు అంటున్నారు. సాంకేతిక సర్వీసులను అందించేందుకు ఐటీశాఖ యుద్ధ ప్రాతిపదికన అన్ని ఏర్పాట్లను చేస్తున్నది. రాష్ట్రస్థాయి సర్వర్‌ను నెలకొల్పడంతోపాటు, భూ వివరాలు అందరికీ అందుబాటులో ఉండేవిధంగా 'ధరణి' వెబ్‌సైట్‌ను, మొబైల్ యాప్‌ను సిద్ధం చేస్తున్నది. సీసీఎల్‌ఏ అధికారులు, సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్, తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ అధికారుల సమక్షంలో సీసీఎల్‌ఏ కార్యాలయంలో ఇప్పటికే ప్రీబిడ్డింగ్ మీటింగ్ జరిగింది. పేపర్ సరఫరా నుంచి

› మిగతా 2వ పేజీలో



కోస్తాలో కొక్కొరొకో!

- ఉభయగోదావరి జిల్లాల టూర్‌లో సర్పంచ్‌లు, వార్డుమెంబర్లు కూడా..
- పందేల్లో తెలంగాణ కోడి.. లక్షల్లో పందెం కాస్తున్న వైనం



కోడిపందేలకు హైదరాబాద్ శివారు రియల్టర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సంక్రాంతి వచ్చిందంటే చాలు.. హైదరాబాద్ రోడ్లన్నీ ఖాళీ అవుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాలవైపు వెళ్లే రోడ్లన్నీ జామ్ అయిపోతాయి. కేవలం ఆంధ్రప్రాంత ప్రజలే కాదు.. హైదరాబాద్, దాని చుట్టుపక్కల జిల్లాల్లో సంక్రాంతి వినోదానికి ప్రాధాన్యం ఇచ్చేవాళ్లంతా ఏపీలోని ఉభయగోదావరి జిల్లాలకు తరలివెళ్తున్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం విపరీతంగా ఎదిగిన నేపథ్యంలో ఆంధ్ర వ్యాపారులతో స్నేహబంధుత్వాన్ని పెంచుకొన్న పలువురు రియల్టర్లు గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఐదు రోజుల బస ఏర్పాటు చేసుకొన్నారు. వీరితో పాటు రాజకీయ నాయకులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు పెద్దఎత్తున తరలివెళ్లారు. కొందరు విందులు

› మిగతా 2వ పేజీలో



కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన లక్ష్మీపూర్ ప్యాకేజీ-8లోని పంప్ బెడ్

కాళేశ్వరం.. బాహుబలి

తెలంగాణను హరితనందనంగా మార్చాలనే సీఎం కేసీఆర్ ఉక్కు జలసంకల్పం.. హిమవన్నగ సమున్నత దీక్షాదక్షతలు.. ఆయన స్వప్నాలకు అనుగుణంగా కొండలను పిండి చేస్తూ పాతాళం లోతులు తీస్తున్న ఇంజినీర్ల ప్రజ్ఞాపాటవాలు.. అద్భుతాలను ఆవిష్కరిస్తున్నాయి. జలసిరులు తాండవమాడబోతున్న కాళేశ్వరం ప్రాజెక్టులో అపర మయులైన ఇంజినీర్లు అహోరాత్రాలు వేల ఏనుగుల బలమున్న లోహ బాహుబలులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నారు. పరమాద్భుతమైన ఆధునిక మోటర్లకు మీటలు కూరుస్తున్నారు. తెలంగాణ గొంతుతడిపే ఊటలకు బాటలు తీస్తున్నారు. కాళేశ్వరం భూగర్భంలో సాగుతున్న జలయాగంపై ప్రత్యేక కథనం **9వ పేజీలో**

పన్నులేని గ్రాట్యుటీ



రూ.20 లక్షల వరకు మినహాయింపు


పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఆమోదం పొందనున్న బిల్లు

దేశవ్యాప్తంగా లక్షల మంది కార్మికులకు లబ్ధి

5







శుభాకాంక్షలు తెలుపుతూ మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్

మంత్రి కేటీఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పాల్గొనేందుకు దావోస్‌కు, పెట్టుబడులను ఆకర్షించేందుకు దక్షిణ కొరియా, జపాన్ పర్యటనకు వెళ్లిన మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి, కనుమ పండుగలను కనువిందుగా చేసుకోవాలని ఆకాంక్షించారు.



ఐనవోలుకు పోటెత్తిన భక్తజనం

వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మల్లికార్జున స్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. జానపదుల జాతరగా పేరొందిన ఈ ఆలయానికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్దసంఖ్యలో తరలివచ్చారు. శనివారం రాత్రే ఆలయానికి చేరుకున్న భక్తులు ఆదివారం తెల్లవారుజాము నుంచి స్వామి వారి దర్శనం కోసం బారులుతీరారు. విడిది చేసిన చోటే ఒగ్గుపూజారులతో బోనాలు, పట్నాలు వేసి, స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి బోనం చెల్లించుకున్నారు.

- ఐనవోలు(వరంగల్)



ఆదివారం టర్కీలోని ట్రబ్‌జాన్ విమానాశ్రయం రన్‌వేపై అదుపుతప్పి నల్లసముద్రం ఒడ్డున నిలిచిపోయిన విమానం

రన్‌వే నుంచి.. సముద్రం ఒడ్డుకు..

- టర్కీ విమానానికి త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- 162 మంది ప్రయాణికులు సురక్షితం

అంకారా (టర్కీ), జనవరి 14: టర్కీకి చెందిన పెగాసస్ ఎయిర్‌లైన్స్ విమానానికి ఆదివారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విమానం ల్యాండింగ్ సమయంలో అదుపుతప్పి రన్‌వేపై నుంచి పక్కకు వెళ్లి సముద్రం అంచున ఆగింది. ఇంకొంచెం ముందుకు వెళ్లుంటే నల్లసముద్రంలో పడిపోయేది. టర్కీ రాజధాని అంకారా నుంచి ట్రబ్‌జాన్ పట్టణానికి 162 మంది ప్రయాణికులతో విమానం ఉదయం బయలుదేరింది. ట్రబ్‌జాన్ ఎయిర్‌పోర్ట్‌లో దిగే సమయంలో మంచుధాటికి విమానం అదుపుతప్పి పక్కకు దూసుకెళ్లింది. నల్ల సముద్రానికి కొన్ని ఫీట్ల దూరంలో ఒండులో విమాన చక్రాలు దిగబడటంతో నిలిచిపోయింది. ఈ సందర్భంలో విమానం నుంచి పెద్దఎత్తున పొగలు వ్యాపించాయి. అగ్నిమాపక దళాలు అక్కడికి చేరుకొని పొగను అదుపుచేశాయి. ప్రయాణికులతోపాటు విమాన సిబ్బంది అందరూ క్షేమంగా బయటపడ్డారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించినట్టు ట్రబ్‌జాన్ ప్రభుత్వం తెలిపింది. విమానం అదుపుతప్పిన దృశ్యాలను టర్కీ సీఎన్ఎన్ ప్రసారం చేసింది.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 5.58 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, త్రయోదశి, తదుపరి చతుర్దశి, నక్షత్రం: మూల సాయంత్రం 4.20 వరకు తదుపరి పూర్వాషాఢ, అమృతఘడియలు: ఉదయం 9.06 నుంచి 10.42 వరకు, రాహుకాలం: ఉదయం 8.16 నుంచి 9.39 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.03 నుంచి 12.48 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.01 నుంచి 3.45 వరకు, వర్జ్యం: లేదు

లోకం పోకడ




టీఆర్ఎస్‌కే దక్కనున్న మూడు రాజ్యసభ సీట్లు

ఫిబ్రవరి నెలాఖరులో ఎన్నికల నోటిఫికేషన్!

ఏప్రిల్ రెండుతో ముగియనున్న ముగ్గురు ఎంపీల పదవీకాలం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో భాగంగా మరో రెండు నెలల్లో తెలంగాణలో మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం సిట్టింగ్ సభ్యులుగా ఉన్న ముగ్గురి పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్ 2తో ముగియనుండటంతో 15 రోజుల ముందే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నది. ఎన్నికలకు సుమారు 40 రోజుల ముందే ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేస్తుంది. ప్రస్తుత రాజ్యసభ సభ్యులుగా ఉన్న రాపోలు ఆనంద భాస్కర్(కాంగ్రెస్), సీఎం రమేశ్ (టీడీపీ) రిటైర్ అవుతున్నారు. వీరిలో ఏపీకి చెందిన సీఎం రమేశ్‌ను రాష్ట్ర విభజన సమయంలో తీసిన లాటరీలో తెలంగాణకు కేటాయించారు. మరోసభ్యుడు పాల్వాయి గోవర్ధన్ రెడ్డి (కాంగ్రెస్) కొంతకాలం క్రితం మృతి చెందడంతో ఆయన పదవి ఖాళీ అయింది. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీలో ఉన్న పార్టీల బలాబలాల ఆధారంగా అధికార పక్షం టీఆర్ఎస్‌కే ఈ మూడు స్థానాలు దక్కే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ ఎన్నికల తరువాత రాజ్యసభలో టీఆర్ఎస్ బలం మరింత పెరుగనుండగా, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ బలం తగ్గుతుంది. తెలంగాణలో టీడీపీ ఖాళీకావడంతో, అసెంబ్లీలో ఐదుగురు సభ్యులు కలిగిన బీజేపీకి రాజ్యసభ సీటు గెలిచే అవకాశమే లేదు. ఏడుగురు సభ్యులు కలిగిన మజ్లిస్ పార్టీ టీఆర్ఎస్‌కే మద్దతు ఇవ్వనున్నది.

గుజరాత్‌లో 'పద్మావత్'పై నిషేధం



అహ్మదాబాద్/ ముంబై: సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో వహించిన హిందీ సినిమా 'పద్మావత్'ను గుజరాత్ ప్రభుత్వం నిషేధించింది. శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో ఆదివారం ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. గత ఏడాది నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా 'పద్మావతి' పేరుతో ఉన్న ఇదే సినిమాను గుజరాత్ ప్రభుత్వం నిషేధించింది. గుజరాత్ సినిమాల (నియంత్రణ) చట్టం, 2004లోని నిబంధనల ప్రకారం శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈ సినిమాను నిషేధిస్తూ నోటిఫికేషన్ జారీచేసినట్టు రాష్ట్ర హోం మంత్రి ప్రదీప్ సిన్హ్ జడేజా మీడియాకు తెలిపారు. ఇంతకుముందే మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు ఈ సినిమాను నిషేధించాయి. హిమాచల్‌ప్రదేశ్ సీఎం జైరాం ఠాకూర్ మాత్రం నిషేధించబోవడం లేదన్నారు. ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా 'పద్మావత్' సినిమాను విడుదల చేస్తున్నట్టు చిత్ర నిర్మాణ సంస్థ 'వయాకం18' సీఈవో సుధాంశు వాట్స్ తెలిపారు. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తున్నామన్నారు. అయితే సెన్సార్‌బోర్డు సూచన మేరకు సినిమాలో ఐదు మార్పులు చేశారు.

గౌడ్ల ఆర్థికమూలాలు దెబ్బతీసిన కాంగ్రెస్

ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం • హైదరాబాద్‌లో కల్లు డిపోలను నిషేధిస్తే.. మేము పునరుద్ధరించాం



ఆదివారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గీత కార్మికుల (గౌడ్ల) ఆర్థికమూలాలను కాంగ్రెస్ పార్టీ దెబ్బతీసిందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. ఆ పార్టీ హైదరాబాద్ నగరంలో కల్లు డిపోలను నిషేధిస్తే టీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పినట్టు కల్లు కాంపౌండ్లను పునరుద్ధరించిందని గుర్తుచేశారు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్ వారికి బీసీలు గుర్తుకొస్తారని, ఎక్కడలేని ప్రేమ పుట్టుకొస్తుందని విమర్శించారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏం చేశారో ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన హితవుపలికారు. ఆదివారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో ఒక్కరు కూడా బీసీ ఎమ్మెల్యే లేరని, పీసీసీ అధ్యక్ష పదవి రేసులోనూ ఒక్క బీసీ లేరని ఆరోపించారు. ఇలాంటి పార్టీ నాయకులు బీసీల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా తాటిచెట్లు ఉన్న నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ వర్గాలకు ఏం చేశారో చెప్పాలని శ్రీనివాస్‌గౌడ్ నిలదీశారు. తాటిచెట్లను కొట్టివేసి వారి ఉపాధిని కూడా దెబ్బతీశారని ఆవేదన వ్యక్తంచేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఐదు కోట్ల తాటి, ఈత మొక్కలు నాటిందన్నారు. నీరాను ఉత్పత్తి చేయాలని ఆలోచిస్తున్నదని తెలిపారు. కేరళ తరహా కల్లు విధానం రాష్ట్రంలో అమలుచేయడానికి అధ్యయనం కోసం త్వరలో ఆ రాష్ట్రానికి వెళ్లనున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి చనిపోయినవారికి ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను రూ.6 లక్షలకు పెంచామని ఆయన వివరించారు.

కట్టుదిట్టంగా పట్టా

మొదటిపేజీ తరువాయి...

ప్రింటింగ్, డిస్ట్రిబ్యూషన్ వరకు బిడ్డర్‌కే బాధ్యత అప్పగించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. భూ యజమాన్య హక్కు పత్రంతో కూడిన పట్టాదార్ పాస్‌పుస్తకం ముద్రణలో హైసెక్యూరిటీ ఫీచర్స్ ఉండాలని ప్రీబిడ్డింగ్ సమావేశంలో స్పష్టం చేశారు.

నకిలీలకు ఆస్కారం లేదు..


పాస్‌పుస్తకం తయారీలో మొత్తం 26 భద్రతా ఫీచర్లను అనుసరిస్తున్నారు. ఇందులో ప్రతి కాగితానికీ ప్రత్యేక ప్లాస్టిక్ కలిపి ఉంటుంది. దీంతో ఇది నీళ్లలో పడినా తడువదు, చింపినా చినుగదు, మడత పడదు. యుబీవీ పద్ధతిలో ఉండే పాస్‌పుస్తకం పేజీలు ఒక్కో వెలుతురులో ఒక్కో రంగులోకి మారుతాయని సమాచారం. ప్రతి పాస్‌పుస్తకానికి ఒక బార్‌కోడ్ ఉంటుంది. ఈ బార్‌కోడ్‌ను స్కాన్‌చేస్తే రైతు వివరాలు పూర్తిగా వచ్చేస్తాయి. నకిలీ పాస్‌పుస్తకం ఎవరైనా తీసుకొచ్చినా స్కానింగ్‌లోనే దొరికిపోతారు. ప్రతిపేజీకి అంతర్గతంగా తెలంగాణ ప్రభుత్వ చిహ్నం ఉంటుంది. దీనిపై తహసీల్దార్ సంతకం కూడా డిజిటల్ సంతకమే ఉంటుంది. ఎవరు పడితే వాళ్లు దీనిలో వివరాలను మార్చడానికి అవకాశం ఉండదు. నకిలీ తయారుచేసేందుకు ప్రయత్నించినా ఏదో ఒక ఫీచర్‌లో తేలిగ్గా దొరికిపోతుంది.

భూరికార్డుల నిర్వహణకు 'ధరణి' వెబ్‌సైట్

భూమి రికార్డుల నిర్వహణలో పారదర్శకతకోసం పక్కా ప్రణాళిక రచించారు. ఇప్పటికే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఏవిధంగా భూ మాఫియాకు కళ్లెంవేయాలో ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరిస్తూ.. ప్రపంచంలోనే అత్యంత భద్రతా ఫీచర్లు ఉన్న 'బ్లాక్ చైన్' టెక్నాలజీ సహాయంతో 'ధరణి' వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నారు. ఈ టెక్నాలజీని క్రిప్టోగ్రఫీలో భద్రత కోసం వాడుతారు. దీన్ని హ్యాక్ చేయడం సాధ్యం కాదు. ఈ టెక్నాలజీ సాయంతో అభివృద్ధి చేసే ధరణి వెబ్‌సైట్‌లో భూ ప్రక్షాళన అనంతరం మాన్యువల్‌గా రూపొందించిన రికార్డులను, పహాణీలను అప్‌లోడ్‌చేస్తారు. ధరణి వెబ్‌సైట్‌ను రిజిస్ట్రేషన్ శాఖకు, బ్యాంకులకు అనుసంధానంచేస్తారు. ఈ వెబ్‌సైట్‌లో ఉన్న భూ రికార్డులను ఎవరైనా అనధికారికంగా ఒక్క అక్షరం మార్చే ప్రయత్నం చేసినా వెంటనే వెబ్‌సైట్ బ్లాక్ అవుతుంది. సంబంధిత అధికారులకు అలర్ట్ మెసేజ్ వస్తుంది. ఏ కంప్యూటర్‌పై అక్రమ మార్పులు చేసేందుకు ప్రయత్నాలు జరిగాయో తెలిసిపోతుంది. దీంతో భూ రికార్డులను మార్చడానికి ఎంత మాత్రం అవకాశం ఉండదు. అధికారికంగా భూ క్రయ విక్రయాలు జరిగితే బ్యాంకు పాస్‌పుస్తకంలో మాదిరిగా మార్పులు, చేర్పులు సంబంధిత తహసీల్దారే చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు తహసీల్దార్ డిజిటల్ సంతకం పాస్‌పుస్తకంపై ఉంటుంది. ధరణి వెబ్‌సైట్ ద్వారా తమ తమ భూముల వివరాలను తెలుసుకోవచ్చు.. మొబైల్ యాప్ ద్వారా కూడా ఈ వివరాలు చూసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసమే రెవెన్యూశాఖలో.. ప్రతి మండల కార్యాలయంలో ఐటీ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

త్వరలోనే మొబైల్ యాప్ సిద్ధం

పాస్‌పుస్తకాల రూపకల్పనతోపాటు వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల తయారీలో రాష్ట్ర ఐటీశాఖ తలమునకలైంది. ఇటు రాష్ట్ర స్థాయి సర్వర్, యాప్‌తో పాటుగా క్షేత్రస్థాయిలలో కీలకమైన మండల రెవెన్యూ కార్యాలయాలను పాస్‌పుస్తకాలు అందించేందుకు సిద్ధమవుతున్నది. నిరుడు సెప్టెంబర్ నుంచి ఐటీశాఖ తన ప్రయత్నాలను ప్రారంభించింది. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర మీసేవ కమిషనర్ జీటీ వెంకటేశ్వర్‌రావు ఈ పనులను సమన్వయం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆన్ స్మార్ట్ గవర్నమెంట్ సంస్థతో కలిసి సంబంధిత సాంకేతిక సేవలు అందిస్తున్నారు. యాప్ రూపకల్పనకు టెండర్ల ప్రక్రియ పూర్తయినట్టు సమాచారం. వచ్చే నెలలో యాప్ సిద్ధమవుతుందని ఐటీ అధికారులు చెప్తున్నారు. దీంతోపాటు రాష్ట్రస్థాయిలో పాస్‌పుస్తకాల ప్రక్రియ నిర్వహణకు సంబంధించి సెంట్రల్ సర్వర్ కూడా సిద్ధమవుతున్నది. పాస్‌పుస్తకాల జారీ విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందుజాగ్రత్తలు తీసుకొంటున్నారు. రాష్ట్రంలోని 584 ఎమ్మార్వో కార్యాలయాల్లో కొత్త పాస్‌పుస్తకాలకు సంబంధించిన మౌలిక సదుపాయాలను సిద్ధం చేస్తున్నారు. ప్రతి ఎమ్మార్వో కార్యాలయంలో కంప్యూటర్, పట్టాదార్ పాస్‌బుక్ ప్రింటర్, స్కానర్, బయోమెట్రిక్ మెషిన్, ఐరిస్ స్కానర్ అందుబాటులో ఉంచుతున్నారు. పటిష్ఠమైన ఇంటర్నెట్ సదుపాయం కలిగించేందుకు బీఎస్ఎన్ఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. కనీసం 12 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఇంటర్నెట్ స్పీడ్ ఉండేలా చర్యలు తీసుకొంటున్నారు.



కృష్ణా జిల్లా కంకిపాడులో కోడిపందేల జోరు



భీమవరంలో పందేలకు సిద్ధమైన హైదరాబాద్ శివారుప్రాంతవాసులు

కోస్తాలో కొక్కొరొకో!

మొదటిపేజీ తరువాయి...

వినోదాల కోసం వెళ్తే.. మరికొందరు కోళ్ల పందేలలో ప్రత్యక్షంగా పాల్గొనడానికి ఆత్రంగా వెళ్లారు. అక్కడ సుమారు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ పందేలు కాస్తున్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్, గండిపేట, బాలాపూర్, శంషాబాద్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్, శేరిలింగంపల్లి.. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, మేడ్చల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్ మండలాలకు చెందిన రియల్టర్లు, రాజకీయ నాయకులు, కొందరు సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు ఆంధ్రాకు వెళ్లారు. శామీర్‌పేట మండలం తూంకుంట, ఆలియాబాద్, మలక్‌పేట, మజీద్‌పూర్, మేడ్చల్ మండలం పూడూరు, యాడారం, మురహరిపల్లి, కొంపల్లి, దూలపల్లి, నిజాంపేట, బాచుపల్లి, వట్టినాగులపల్లి, మణికొండ, కోకాపేట, అల్మాస్‌గూడ, బాలాపూర్ గ్రామాల నుంచి అత్యధికంగా వెళ్లినట్లు సమాచారం. వీరంతా ప్రధానంగా ఏలూరు, భీమవరం, పాలకొల్లు, అమలాపురం, ముమ్మిడివరం ప్రాంతాల్లో బస చేశారు. శనివారం ఉదయానికే వీరు ఆంధ్రాకు చేరుకున్నారు. కోడి పందేలు జరుగుతున్న సుమారు 500 గ్రామాల్లో వీరి సందడి కనిపిస్తున్నదని వెళ్లినవారు చెప్తున్నారు.

అతిథి గృహాలు ఫుల్

ఉభయ గోదావరి జిల్లాల్లో నెలరోజుల ముందే అతిథి గృహాలు, లాడ్జీల్లో అన్ని గదులనూ ముందస్తుగానే రిజర్వ్ చేసుకొన్నారు. సాధారణ సమయంలో రూ.500, రూ. 1000 చొప్పున ఉండే కిరాయి, ఇప్పుడు రెట్టింపయింది. ఏటా వెళ్లేవారు ముందుగానే ప్లాన్ చేసుకోవడం వల్ల పెద్దగా ఇబ్బందులు తలెత్తకపోయినా, అప్పటికప్పుడు వెళ్లినవారికి వసతి దొరకడం దుర్లభమే అవుతున్నది. మూడు నుంచి ఐదు రోజుల పాటు ఉండే వారికి కనీసంగా రూ.30 వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చవుతున్నది. పందెంరాయుళ్లు లక్షల రూపాయలు పందెం కాస్తున్నారు. ఈ ఏడాది విజయవాడ పరిసరాల్లో కూడా కోడిపందేలు పెద్ద ఎత్తున ప్రారంభం కావడం విశేషం. కంకిపాడు, నూజివీడు పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున కోడిపందేలు నిర్వహిస్తున్నారు.

వ్యాపారానుబంధమే కారణం

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో వేలమంది ఆంధ్రాకు చెందిన వారు రియల్ ఎస్టేట్ రంగంలో స్థిరపడ్డారు. వీరిలో నిర్మాణరంగానికి చెందిన వారి సంఖ్య అధికం. ప్లాట్లను కొనడం, అమ్మడం.. అనుమతులు పొందడం వంటి వ్యవహారాల్లో స్థానిక వ్యాపారులు, రాజకీయ నాయకులతో సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ స్నేహబంధంతోనే ఈ ప్రాంతానికి చెందిన పలువురు రియల్టర్లు, నేతలు సంక్రాంతికి గోదావరి జిల్లాలకు వెళ్లారు. ఆంధ్ర ప్రజలు తమ తెలంగాణ మిత్రులను 'పండుగకు మా ఊరికి రారండోయ్' అంటూ ఆహ్వానించారు. ప్రధానంగా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, కౌన్సెలర్లు, వారి అనుచరగణమే అత్యధికంగా వెళ్లినవారిలో ఉన్నారు. పైగా వ్యాపార సంబంధాలు కలిగిన వారికి రాచమర్యాదల్లో ఏ లోటూ రానివ్వడం లేదు. ప్రత్యేకంగా విడిది ఇండ్లు కూడా కేటాయించారు. ఎన్ని రోజులు అక్కడ బసచేసినా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేశారు.

పందేలకు తెలంగాణ కోళ్లు

ఉభయగోదావరి జిల్లాల్లో ఈ ఏడాది పలుచోట్ల తెలంగాణ కోళ్లను పందేనికి దింపుతున్నట్టు సమాచారం. ఆంధ్రాలో కోళ్ల పందేలు, పెంపకం పట్ల న్యాయపరమైన చిక్కులు వస్తుండటంతో హైదరాబాద్ నగరంతోపాటు, శివార్లలో స్థిరపడిన గోదావరి జిల్లాలకు చెందినవారు ప్రత్యామ్నాయం ఆలోచించారు. పొలాలు, ఫాంహౌజుల్లో కోళ్లను పెంచి, ఆంధ్రాకు తీసుకెళ్లినట్టుగా తెలిసింది. ఇక్కడి మట్టిలో కోళ్లు బలంగా పెరుగుతాయని పందెంరాయుళ్ల అభిప్రాయం. అంతేకాదు.. పందేల నిర్వహణ కూడా భారీ ఖర్చుతో నిర్వహిస్తున్నారు. ఈ పందేలు అందరికీ కనిపించేలా ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లోనైతే డ్రోన్ కెమెరాలను కూడా వాడుతున్నారు.

జోరుగా కోళ్ల కొట్లాట..

కోర్టు ఆదేశాలు బేఖాతరు.. బరిలో కత్తుల కోలాటం..

తాడిపత్రిలో పందుల యుద్ధం.. కంకిపాడులో పొట్టేళ్ల పోరాటం

ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి సంబురాలు

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌లో కోళ్ల కొట్లాట జోరుగా జరుగుతున్నది. పందెం కోళ్ల కత్తుల కోలాటంపై లక్షల రూపాయల్లో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ రెండురోజులుగా ఏపీలోని ఉభయగోదావరి జిల్లాలతోపాటు కృష్ణా, గుంటూరు, నెల్లూరు, కడప, అనంతపురం జిల్లాల్లో చాలాచోట్ల పెద్ద ఎత్తున కోడిపందేలు జరుగుతున్నాయి. మురుముళ్లలో ఏకంగా మినీ స్టేడియంలో కోళ్ల యుద్ధం ఏర్పాటు చేశారు. ఇక్కడ మీడియాను కూడా లోనికి అనుమతించకుండా పాస్‌లున్న వారికి మాత్రమే ప్రవేశం కల్పిస్తున్నారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినప్పటికీ పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. భీమవరంలో కోడి పందెం నిర్వాహకులు ఏర్పాటు చేసే ప్రతీ స్టాల్‌కి వేలంపాట పెట్టారు. ఉభయగోదావరి జిల్లాలో దాదాపు రూ.200 కోట్ల మేర పందేలు జరిగినట్లు అంచనా. కనుమ, ముక్కనుమ నాటికి ఈ పందేల విలువ రూ. వెయ్యికోట్లు దాటుతుందని భావిస్తున్నారు. కృష్ణా జిల్లాలో రూ.వంద కోట్ల వరకూ పందేలు జరిగాయని చెప్తున్నారు. పందేలకు వెళ్లరాదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలను సైతం పెడచెవిన పెట్టి.. కృష్ణాలో టీడీపీ ఎమ్మెల్యేలు బాబూ రాజేంద్ర ప్రసాద్, బోడె ప్రసాద్, కైకలూరులో ఎంపీ మాగంటి బాబు, తూర్పు గోదావరిలో ఎంపీ తోటనరసింహం, పిఠాపురం ఎమ్మెల్యే వర్మలు పందేలను ప్రారంభించారు. కృష్ణాజిల్లా ఈడ్పుగల్లులో క్యాసినో కూడా ఏర్పాటుచేశారు. విదేశీ యువతులను ఇక్కడికి రప్పించినట్టు సమాచారం. భీమవరం వద్ద ఆశ్రమం సమీపంలో ఏర్పాటు చేసిన బరిలో కనీసం పదివేల మంది కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు. మందు, మాంసాహార స్టాళ్లను, వీఐపీ లాంజ్‌లను కూడా ఇక్కడ ఏర్పాటు చేశారు.

తాడిపత్రిలో పందుల పందెం..కంకిపాడులో పొట్టేళ్ల పోరు..

కాగా రాయలసీమలోని అనంతపురం జిల్లా తాడిపత్రిలో వినూత్న తరహాలో పందుల పందెం జరిగింది. పందుల హోరాహోరీపై కూడా పందెం రాయుళ్లు కాసుల పంట పండించుకొన్నారు.. కర్నూలు, మహబూబ్‌నగర్, గద్వాల్, హిందూపురం, కల్యాణ దుర్గం, కడప, బేతంచర్ల తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో పందులు పాల్గొన్నాయి. కృష్ణాజిల్లా కంకిపాడు మండలం ఈడ్పుగల్లులో పొటేళ్ల పందేలు జోరుగా జరుగుతున్నాయి.



అనంతపురం జిల్లా తాడిపత్రిలో పందుల పందేలను తిలకిస్తున్న ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి



కురవిలో కిక్కిరిసిన భక్తులు

భోగి పండుగను పురస్కరించుకొని ఆదివారం మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని వీరభద్రస్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఎదుట వాహన పూజలు కూడా పెద్ద ఎత్తున కొనసాగాయి.

- కురవి

త్వరలో కలెక్టర్ల కాన్ఫరెన్స్?

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వీలైనంత త్వరలో జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించినట్టు తెలిసింది. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, ఇటీవల విజయవంతంగా పూర్తయిన భూరికార్డుల ప్రక్షాళన నేపథ్యంలో రైతులకు అందించాల్సిన సాగు పెట్టుబడిపై సమావేశంలో చర్చించనున్నట్టు తెలిసింది. భూ రికార్డుల నిర్వహణపై సీఎం జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నట్టు సమాచారం. సాగునీటి ప్రాజెక్టులకు కావాల్సిన భూసేకరణతోపాటు మిషన్ భగీరథ అమలు తీరుపై కలెక్టర్లకు తగుసూచనలు చేయనున్నట్టు తెలిసింది. పంచాయతీరాజ్ చట్టానికి భారీ సవరణలు తీసుకొస్తున్న నేపథ్యంలో ఈ సవరణ బిల్లుతోపాటు ఇతర అంశాలపై చర్చించడానికి త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గం ప్రగతిభవన్‌లో సమావేశం కానున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ సమావేశంలో కీలకమైన పంచాయతీరాజ్‌చట్టం సవరణ బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలుపనున్నట్టు సమాచారం. వెంటనే ఈ బిల్లు ఆమోదం కోసం అసెంబ్లీని సమావేశపర్చాలని ప్రభుత్వం భావిస్తున్నది. అసెంబ్లీ సమావేశంలో బిల్లుపై చర్చించి సభ ఆమోదం పొందిన తరువాత వెంటనే అమల్లోకి తీసుకురానున్నారు. నూతన చట్టం ప్రకారమే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నది.



తహసీల్దార్ విచక్షణే కీలకం

- అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలి
- శాఖల మధ్య సమన్వయం సాధించాలి
- రెవెన్యూ అధికారులకు రిజిస్ట్రేషన్ అధికారంపై నిపుణులు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: స్థిర, చరాస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో మార్చి నుంచి కొత్త శకం ప్రారంభంకానున్నది. రిజిస్ట్రేషన్లలో అవినీతి, అక్రమాలకు ఆస్కారంలేకుండా పారదర్శకతను మరింత పెంచాలన్న సదాశయంతో ప్రభుత్వం తహసీల్దార్లకు కూడా రిజిస్ట్రేషన్ అధికారం ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో తహసీల్దార్లు బాధ్యతతో వ్యవహరించాలని, రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో వారి విచక్షణే కీలకమని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌ను సబ్‌రిజిస్ట్రార్లు చేస్తే, తహసీల్దార్లు దానిని మ్యుటేషన్ చేస్తారు. ఒకవేళ సబ్‌రిజిస్ట్రార్లు ప్రభుత్వ భూమికానీ, వివాదాస్పద భూమిని కానీ రిజిస్ట్రేషన్ చేస్తే దానిని మ్యుటేషన్ కాకుండా తహసీల్దార్లు నిలిపివేయవచ్చు. కానీ, కొత్త విధానంలో రిజిస్ట్రేషన్‌తోపాటు మ్యుటేషన్ చేసే అధికారం తహసీల్దార్లకే ఉంటుంది. ఒకవేళ రిజిస్ట్రేషన్ సమయంలో వారు తప్పుచేస్తే దానిని సరిచూసి, నిలిపేసే అవకాశం ఉండదు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో వందల ఎకరాల అటవీభూముల్లో రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చిన సమస్యలను ఈ సందర్భంగా నిపుణులు ఉదహరిస్తున్నారు. విచక్షణాధికారాలను ఉపయోగించడంలో సమతుల్యతలోపిస్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, భూ రికార్డుల నిర్వహణలో వందశాతం పారదర్శకత, అవినీతిని నిరోధించడం, నకిలీ పాస్‌పుస్తకాలను అరికట్టడం వంటివి తహసీల్దార్ల బాధ్యతపైనే ఆధారపడి ఉంటాయన్నారు.

రికార్డుల అనుసంధానంలో సమన్వయం సాధ్యమయ్యేనా!

ప్రస్తుతం రిజిస్ట్రేషన్‌శాఖకు, రెవెన్యూ, వక్ఫ్, దేవాదాయశాఖలకు మధ్య సమన్వయ లోపం శాపంగా మారింది. వాస్తవానికి దేవాదాయ, వక్ఫ్, యూఎల్‌సీ, రెవెన్యూశాఖలు తమ ఆధీనంలోని భూముల వివరాలను సర్వేనంబర్‌తో సహా తమశాఖ వెబ్‌సైట్లలో పొందుపరచాలి. ఎంత భూమి తమ ఆధీనంలో ఉంది? ఎంత భూమి ప్రైవేట్‌ది అనేది ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ 'కార్డు'కు అనుసంధానం చేయాలి. ఏ శాఖ తమ ఆధీనంలోని భూములపై సక్రమైన లెక్కలు సమర్పించిన దాఖలాలు లేవు. కొన్నేండ్లుగా నిషేధిత భూములపై గెజిట్ నోటిఫికేషన్ జారీకాలేదని ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వానికి నివేదించారు. రెవెన్యూ, వక్ఫ్, దేవాదాయశాఖల అధికారులు తాజా వివరాలను అప్‌డేట్ చేసి వెబ్‌సైట్‌కు అనుసంధానం చేస్తే తగాదాలకు ఆస్కారం ఉండదని వారు పేర్కొంటున్నారు.

రేపు రిజిస్ట్రేషన్ ఉద్యోగుల అత్యవసర సమావేశం

తహసీల్దార్లకు కూడా రిజిస్ట్రేషన్ అధికారాలనివ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మంగళవారం స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఉద్యోగుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు తెలంగాణ రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్థితప్రజ్ఞ తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ఎదురయ్యే అనుకూల, ప్రతికూల పరిణామాలపై చర్చిస్తామని చెప్పారు.

మినీ ఇండియా.. పరేడ్ గ్రౌండ్స్

రెండోరోజూ కళకళ.. ఘుమఘుమలు ■ తరలివచ్చిన దేశ, విదేశీయులు ■ స్వీట్స్, కైట్స్ ఫెస్టివల్స్‌కు భారీ స్పందన





ఆదివారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో కైట్ ఫెస్టివల్‌ను తిలకించేందుకు తరలివచ్చిన జనం.. మిఠాయి ప్రియులతో కళకళలాడుతున్న స్వీట్స్ ఫెస్టివల్ (ఇన్‌సెట్) ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మూడురంగులతో తయారుచేసిన క్యారట్ హల్వా

హైదరాబాద్/ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

హైదరాబాద్ నగరం మినీ ఇండియాగా వెల్లివిరిసింది. పరేడ్ గ్రౌండ్స్ నుంచి నేతిమిఠాయిల వాసనలు నలుదిక్కులా వ్యాపించాయి. తెలంగాణ సంక్రాంతి శోభ వెలుగులు విరజిమ్మింది. రాష్ట్ర పర్యాటక, భాషా సాంస్కృతికశాఖ సారథ్యంలో సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో లక్షా 50వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన స్వీట్స్ ఫెస్టివల్ మైదానం రెండోరోజైన ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. 80 వేల మంది పరేడ్ గ్రౌండ్స్ చుట్టూ చేరి విభిన్న రాష్ట్రాల సాంస్కృతిక మేళవింపులను ఆస్వాదించారు. కరతాళ ధ్వనులతో ప్రశంసల వర్షం కురిపించారు. దేశ విదేశీయులు ఆకర్షణీయమైన పతంగులను ఎగురవేయగా, 25 రాష్ట్రాల సంప్రదాయ తీపి వంటకాలు, 15 దేశాల స్వీట్స్‌ను ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. ఆదివారం రాత్రి 8 గంటల సమయానికి లక్షా 50వేల ప్రజలు కుటుంబసమేతంగా వచ్చి మిఠాయిల రుచులవిందును, పతంగుల కనులవిందును, సాంస్కృతిక కదంబాలను చూసి మురిసిపోయారు. అహ్మదాబాద్ నుంచి వచ్చిన పతంగుల నిపుణులు, బ్రెజిల్ నిపుణులతో పోటీపడ్డారు. హైదరాబాద్‌లో దశాబ్దాలుగా జీవిస్తున్న గుజరాతీలు, సింధీలు, ముంబై, పుణె, సూరత్, కేరళ, చెన్నై, ఒడిశా, బీహార్, మైసూర్, కర్ణాటక, చండీగఢ్, రాజస్థాన్ వాసులు పరేడ్‌గ్రౌండ్స్‌కు కుటుంబసమేతంగా తరలివచ్చారు. తమ ఇండ్ల రుచులను మోసుకొచ్చారు. కర్ణాటకకు చెందిన జోషి కుటుంబసభ్యులు 'చంద్రపురి' వంటకాన్ని అందరికీ పంచారు. పంజాబ్‌కు చెందిన కథాప్రసాద్, గాజర్‌హల్వా, మాల్‌పూరి, పంజాబీ పిన్నీ, ఒరిస్సా అరిశపిథా చెన్నపొడ, చెన్న ఖీర్, కేరళీయులు తెచ్చిన సేమ్యా పాయసం, క్యారట్‌హల్వా, గుజరాతీల తిలక్‌చిక్కీ వంటి మిఠాయిలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆప్యాయంగా వడ్డించడం 'కైసాహై' స్వీట్ అంటూ పలుకరించడం చిన్నపిల్లలను సంతోషపెట్టింది. భాష తెలియకున్నా, సంతోషానికి భాష ఉండదని బ్రెజిల్, ఆఫ్ఘనిస్థాన్, తైవాన్, థాయ్‌లాండ్‌కు చెందినవారు నిరూపించారు. హైదరాబాద్ సమైక్య జీవన సౌందర్యానికి వారు మురిసిపోయారు. రాత్రివేళ చీకటిలో వెలుగుల రవ్వలతో ఎగిరిన పతంగులు బహుళపక్షంలో వెన్నెల వెలుగులు కురిపించాయి. శనివారం ప్రారంభమైన ఈ తెలంగాణ సంక్రాంతి సంబురాలు సోమవారంతో ముగియనున్నాయి.

దళితులకు దన్ను

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దళితులకు భూపంపిణీ కార్యక్రమం సత్ఫలితాలిస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో 1983 నుంచి 31 ఏండ్లు దళితులకు భూ పంపిణీ చేపట్టినప్పటికీ పథకం సమర్థంగా అమలుకాలేదు. గత ప్రభుత్వాలు దళితులకు సాగుయోగ్యం కాని ఎకరా, రెండెకరాల భూములను పంపిణీ చేశాయి. దీంతో రాష్ట్రంలో దళితులు ఆర్థికంగా, సామాజికంగా పురోభివృద్ధి సాధించలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర ప్రభుత్వం పేద దళిత కుటుంబాలకు మూడెకరాల చొప్పున భూమి పంపిణీ చేస్తున్నది. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.514 కోట్లు వెచ్చించి 12వేల ఎకరాల భూములను కొనుగోలు చేసింది. వ్యవసాయ భూముల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ, పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టింది. దళితులకు భూపంపిణీ సమర్థంగా అమలు చేసే బాధ్యతను ఐఏఎస్ అధికారి బుద్ధ ప్రకాశ్‌కు అప్పగించింది. ఆయన భూ కొనుగోళ్లు, పంపిణీలో అక్రమాలకు తావులేకుండా చేశారు. భూపంపిణీలో భాగస్వాములయ్యే సర్పంచులు, ఇతర ధనిక వర్గాల వాళ్లు ఈ పథకంలో తమ చేతివాటం చూపకుండా చర్యలు తీసుకున్నారు. గతంలో గ్రామాల్లోని కొందరు దళారులు తక్కువ ధరకు భూమిని కొనుగోలు చేసి, ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రస్తుతం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నది.

ఎస్సీ భూపంపిణీలో పురోగతి

- లక్ష్యసాధన దిశగా సర్కారు చర్యలు
- రూ.514 కోట్లతో 12వేల ఎకరాల కొనుగోలు
- ప్రత్యేక అధికారికి భూ పంపిణీ అమలు బాధ్యత

జిల్లాల ఏర్పాటుతో పెరిగిన ధరలు

ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు భూమి దొరుకడం లేదు. ఒకవేళ అందుబాటులో ఉన్నా ధరలు ఎక్కువగా ఉండటం ఇబ్బందికరంగా మారింది. 3 నుంచి 7 లక్షలకు ఎకరా చొప్పున దొరికే భూమి వ్యవసాయ సాగుకు యోగ్యంగా ఉండటం లేదు. కొత్త జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పడటంతో భూముల ధరలు అమాంతంగా పెరిగాయి. దళితులకు భూమి కొనుగోలు వ్యవహారంలో దళారులు ప్రవేశించారు. దళారులు ఇబ్బడి ముబ్బడిగా భూముల ధరలు పెంచుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ఆదేశించారు. ఆయన ఆదేశాలతో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా భూ పంపిణీ పథకానికి భూ సేకరణకు తమ వంతు సహకారం అందిస్తున్నారు.

ఎస్సీ భూ పంపిణీ పథకం కింద కొనుగోలు చేసిన భూమి, లబ్ధిదారుల సంఖ్య

ఆర్థికసంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	కొనుగోలు చేసిన భూమి (ఎకరాల్లో)
2014-15	797	2120.24
2015-16	1,997	5255.24
2016-17	877	2,288.18
2017-18	ఎంపిక చేయాలి	2400.02
మొత్తం	3671	12,063.68

భూముల సాగుకు చర్యలు

భూ పంపిణీ చేయడంతోపాటు వాటిని సాగులోకి తెచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. భూముల స్థితిగతులను అంచనావేసి వాటిని అనుకూలంగా మార్చేందుకు ఆయా ప్రభుత్వ శాఖలను సంసిద్ధం చేశారు. నిరుపేద వ్యవసాయాధారిత కుటుంబాల కోసం నిర్వహిస్తున్న భూ పంపిణీ కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు న్యాయం జరిగేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పది ఎకరాలను ఒక యూనిట్‌గా బ్లాక్ ఏరియాలుగా విభజించి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రాళ్లు తొలిగించడం, చదును చేయడం, నేలను బాగు చేయడం వంటి పనులు చేపట్టారు. ఇందిర జలప్రభ పథకం కింద ఎస్సీ లబ్ధిదారులకు అందించిన భూములకు నీటి సౌకర్యంపై దృష్టి పెట్టారు.

రూ. 514 కోట్లతో 12వేల ఎకరాలు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.514కోట్లు వెచ్చించి 12వేల ఎకరాలు కొనుగోలు చేసింది. సీఎం కేసీఆర్ సర్కారు బాధ్యతలు చేపట్టాక ఎస్సీ భూ పంపిణీ పథకం కింద మొదటి ఆరు నెలల్లోనే 2043 ఎకరాలు కొనుగోలు చేసి పేద దళిత కుటుంబాలకు పంపిణీ చేశారు. 2016-17లో 2,288 ఎకరాలు పంపిణీ చేశారు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

తిరుమల: సంక్రాంతి నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. శ్రీవారి దర్శనానికి 31 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. సర్వదర్శనానికి 12 గంటలు, కాలినడక దర్శనానికి నాలుగు గంటలు పడుతున్నది. తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు.



రూ.15 వేల కోట్లతో వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్!


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2018-19 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో తొలిసారిగా వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌కు కసరత్తు చేస్తున్నది. సుమారు రూ.15 వేల కోట్ల వరకు కేటాయించే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. రైతుల పెట్టుబడి (విత్తనాలు, ఎరువులు, కొంత మొత్తం కూలీలకు) కోసం ఎకరాకు రూ.4వేల చొప్పున వానకాలం, యాసంగిలో అందజేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ పథకానికి ఏడాదికి రూ.11,370.26 కోట్లు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ ప్రాథమికంగా నిర్ధారించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపినట్టు సమాచారం. వ్యవసాయానికి పెట్టుబడి మద్దతు పథకాన్ని మే 15 నుంచి అమలుచేయనున్నారు. రైతు సమగ్ర సర్వే ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1.23 కోట్ల సాగుభూమి ఉన్నట్టు గుర్తించారు. పాత అంచనాల ప్రకారం 1.55 కోట్ల ఎకరాల సాగుభూమి ఉన్నది. వ్యత్యాసం రావడంతో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో భూప్రక్షాళన చేపట్టగా, 1,42,12,816 ఎకరాలు సాగు భూమి ఉందని వెల్లడైంది. దీని ప్రకారం పెట్టుబడి పథకానికి రూ.11, 370.26 కోట్లు అవసరమవుతాయని, ఒకవేళ మొత్తం 1.55 కోట్ల ఎకరాల సాగుభూమిని పరిగణనలోకి తీసుకుంటే రూ.12,400 కోట్లు అవసరమని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. వివాదాల్లేని భూముల లెక్కలు తేలితే కొంత మొత్తం పెరుగుతుందని భావిస్తున్నాయి.

మరింత పకడ్బందీగా బీసీ సంక్షేమం

- పథకాల అమలును పరిశీలించిన అసెంబ్లీ బీసీ సంక్షేమ కమిటీ
- అభివృద్ధికి కీలక సూచనలు
- ప్రభుత్వానికి 14పేజీల నివేదిక అందజేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వెనుకబడిన తరగతులపై ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధపెట్టిన సర్కారు.. సంక్షేమఫలాలను వారికి మరింత చేరువచేయడంపై దృష్టి సారించింది. ఇందుకోసం నెలకొల్పిన తెలంగాణ అసెంబ్లీ బీసీ సంక్షేమ కమిటీ తాజాగా పలు సూచనలతో ప్రభుత్వానికి 14 పేజీల నివేదికను అందజేసింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు బీసీవర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రకటించారు. ఈ పథకాలను పకడ్బందీగా అమలుచేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలని పేర్కొంటూ ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్ చైర్మన్‌గా ప్రభుత్వం అసెంబ్లీ కమిటీని ఏర్పాటుచేసింది. కమిటీలో ఎమ్మెల్యేలు జీ విఠల్‌రెడ్డి, పుట్ట మధుకర్, చింత ప్రభాకర్, టీ ప్రకాశ్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, కొండాసురేఖ, దొంతి మాధవరెడ్డి, ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీలు పూల రవీందర్, కొండామురళీధర్‌రావు సభ్యులుగా ఉన్నారు. ఇటీవల సమావేశమైన కమిటీ ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది.

- ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో 19 గురుకుల పాఠశాలలు ఉండగా, మూడేండ్లలో కేసీఆర్ సర్కారు 124 గురుకులాలను ప్రారంభించింది. వచ్చే విద్యాసంవత్సరం మరో 119 గురుకులాలను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. గురుకులాల నిర్వహణ కోసం ఇప్పటికే నగరాలు, పట్టణాల సమీపంలో మూతపడి ఉన్న ఇంజినీరింగ్ కళాశాల భవనాలను తీసుకోవాలని కమిటీ సూచించింది. ఇప్పటికే కళాశాలల్లో ఉన్న సదుపాయాలను వినియోగించుకోవడం ద్వారా త్వరగా గురుకులాలను ఏర్పాటుచేయొచ్చని పేర్కొన్నది.
- పాత జిల్లాకేంద్రాల ప్రాతిపదికన రాష్ట్రంలో పది బీసీ స్టడీ సర్కిళ్లు ఉన్నాయి. కొత్త జిల్లాల నేపథ్యంలో ప్రతి జిల్లాకు బీసీ స్టడీ సర్కిల్ ఉండేలా మరో 21 కొత్త స్టడీ సర్కిళ్లను ఏర్పాటుచేయాలని నివేదించింది.
- బీసీ విద్యావంతులు కోచింగ్ కోసం అధిక ఫీజులు చెల్లించలేక సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలు రాయలేకపోతున్నారని, దీంతో తెలంగాణ బీసీల నుంచి సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలు సాధించినవారు అతి కొద్ది మందే ఉన్నారని స్పష్టంచేసింది. ఎక్కువమందిని సివిల్స్ వైపు మళ్లించేందుకు హైదరాబాద్‌లో బీసీ విద్యార్థుల కోసమే సివిల్స్ కోచింగ్ సెంటర్ ఏర్పాటుచేసి, నిపుణులతో బోధించేలా చర్యలు తీసుకోవాలని నివేదించింది.
- మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఫిలిప్పీన్స్, చైనా వంటి దేశాల్లో ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు కూడా స్కాలర్‌షిప్ వర్తింపజేయాలని కమిటీ సూచించింది.
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఆడపిల్లల పెండ్లికి ఇప్పటివరకు రూ.60 కోట్లు ఇచ్చారు. ఈ పథకం కింద ఇచ్చే ఆర్థికసాయం కొంతమంది అధికారుల కారణంగా ఆలస్యంగా అందుతున్నది. కల్యాణలక్ష్మి చెక్కును పెండ్లి రోజే అందిస్తే అమ్మాయి తల్లిదండ్రులను ఆదుకున్నవాళ్లమవుతామని తెలిపింది.
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బెస్ట్ అవేలబుల్ స్కూళ్ల మాదిరిగానే బీసీ విద్యార్థుల కోసం కూడా ఏర్పాటు చేయాలని నివేదించింది.
- బీసీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం బ్యాంకులతో సంబంధంలేకుండా 100 శాతం సబ్సిడీ రుణాలు ఇవ్వాలని సూచించింది. రుణాలన్నీ మార్చిలోపు గ్రౌండింగ్ అయ్యేలా అధికారులకు నిర్దేశం చేయాలని కమిటీ తెలిపింది.
- ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాల ఆర్థికప్రగతికి తీసుకోవాల్సిన చర్యలను ప్రతిపాదించింది. కార్పొరేషన్‌కు ఇచ్చిన బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగించాలని సిఫారసు చేసింది.



మనిషి బానిసత్వం మతంలోనే ఉన్నది.
నిజమే మనిషిని స్వేచ్ఛామానవునిగా
తీర్చిదిద్దుతుంది.

మాగ్జిమ్ గోర్కి

సంకురాతిరి సంబురం

గొబ్బిపాటల పదాలల్ల.. పాడి పంటల పెదాలల్ల
పచ్చని నవ్వులు కురిసి మెరిసింది
పిల్లపాపలు ఇంటికొచ్చిరని
పలకరింపులు చిలకరించిరని
మదిల పువ్వులు మురిసి విరిసింది
బేగిబేగని భోగి మంటలు
ఏపుగ ఎదిగిన చెరకుతోటలు
పొద్దుటెండను లేపుకొచ్చింది
గంగిరెద్దుల మెడల గంటలు
గుమ్మం ముంగట హరిదాసు కీర్తనలు
పల్లె తలుపును తట్టి పిలిసింది
పోరగాండ్ల చేతిల పతంగులు
సోపతిగాళ్ళ పాత ముచ్చట్లు
రంగుల కలలై నింగికెగిసింది..గాది నిండిన రైతు కళ్ళు
పొంగిపొరిలిన పాలపొంగళ్ళు
సల్లగుండమని మందికి దీవెనలిచ్చింది

– దేగల అనితాసూరి, 9247500819

మెలికల ముగ్గు!

ప్రతి పండక్కీ
ఆకాశంలోని నక్షత్రాలను తెచ్చి
చుక్కలుగా పెట్టాలని చూస్తాను
నేల మీది ఆకు పచ్చని తీగలతో
బతుకు చుట్టూ
తెల్లని గీతలు గీయాలని చూస్తాను
సూర్యచంద్రులను
పువ్వులుగా కత్తిరించి
ఆశల గొబ్బెమ్మల నెత్తిమీద
కిరీటాలుగా అలంకరించాలని
ఆలోచిస్తాను
సమస్త కాలుష్యాల
కసవు ఊడ్చి
దిగులు పొక్కిళ్లను
చదును చేసి
చెమటతో కళ్లాపి చల్లి
గుండె వాకిట్లో ఎప్పటికప్పుడు



ఓ కొత్త ముగ్గేయాలని
చూస్తూనే వుంటాను
నా కాడెద్దుల శ్రమను దోచి
గంగిరెద్దులా వేషాలేస్తున్న
దోపిడీ పశువులను
ఊరి పొలిమేర దాకా
తరిమేయాలని
తలపోస్తూనే వుంటాను
భోగి మంటల్లో కాలిపోతున్న
దేశ ప్రగతిని ప్రశ్నించని
డూడూ బసవన్నలకు
కొత్త సన్నాయి వినిపించాలని
ప్రయత్నిస్తూనే వుంటాను
నాతోపాటే నా దేశం రథం ముగ్గులా
మునుముందుకు సాగిపోవాలని
నిత్యం అలుపెరుగని
యుద్ధ సైనికుడిలా
పనిచేస్తూనే వుంటాను
నా ఇంట అడుగుపెట్టని లక్ష్మి కోసం
ఎప్పుడూ గుండె తలుపులు
బార్లా తెరిచే వుంచుతాను
అయినా సామాన్యుడిగా
నా జీవితమెప్పుడూ
తప్పుపోయిన మెలికల ముగ్గే
అవుతుంది
చాలాసార్లు
చుక్కలు పెట్టి ఇంకా ముగ్గేయని
చీకటి ఆకాశంలానే
మిగిలిపోతుంది!

– 'చిత్తలూరి', 8247432521

రెండు పోరాటాల మధ్య నేను!




'ఇంటివైపు' ఓ సంజ్ఞ, ఓ సంతకం. ప్రవాసీ హృదయపు బెంగటిల్లిన అక్షరం. కాలూనిన ప్రతి మట్టి రేణువులో తన పుట్టినూరును తలుచుకునే ఓ సగటు మనిషి పలవరింత అఫ్సర్‌ది. కవిత్వంలో ఎప్పుడూ నూతనత్వాన్ని నిలుపుకొంటూ ఐదు కవిత్వ సంపుటుల మేరా విస్తరించిన కవి అతడు. మామూలు విషయాలనే భిన్నమైన అనుభవిక స్పర్శతో చూడాలన్న తపనలోంచి ఉద్భవించిందే.. ఆయన ఇటీవలి 'ఇంటివైపు' కవితాసంపుటి. సూఫీ భావనల ఆవరింపులోంచి వైవిధ్యంగా పలికిన కవిత్వమది. కవి పరిశోధకుడు అఫ్సర్‌తో కవి యాకూబ్ ఆత్మీయ సంభాషణ..

'ఊరి చివర' వెలువడిన ఎనిమిదేండ్ల తరువాత మీరు 'ఇంటివైపు' అనే శీర్షికతో మళ్లీ కవిగా ముందుకువచ్చారు. రెండు కవిత్వ సంపుటాల మధ్య ఇంత దీర్ఘ కాలం ఎందుకు పట్టింది?

అఫ్సర్: అవున్నిజమే. నేను ఒక్కో సంపుటి మధ్యా చాలా వ్యవధి తీసుకుంటున్నా. మొదటి నుంచీ అంతే! అనుకోకుండానే ప్రతి సంపుటికీ మధ్యా ఆ ఆలస్యం జరుగుతూ వస్తున్నది. బహుశా, సీతారాం, ప్రసేన్‌లతో కలిసి ప్రచురించిన 'రక్తస్పర్శ' (1986) కూడా కలుపుకొని, మధ్యలో వచ్చిన నాలుగు కవిత్వ సంపుటాల కన్నా ఎక్కువ పేజీలున్న కవిత్వ సంపుటి ఇప్పటి ఈ 'ఇంటి వైపు'.

ఈసారి ఆలస్యానికి సరైన కారణాలున్నాయని అనుకుంటున్నా. ముఖ్యంగా ఈ ఎనిమిదేండ్లు నా సాహిత్య ప్రయాణంలో కీలకమైనవి. ఇంతకుముందు ఎన్నడూ అనుభవించి ఎరుగని సంఘర్షణ ఈ దశలో ఎదుర్కొన్నాను. ప్రత్యేక తెలంగాణ, సూఫీయిజం, గృహోన్ముఖీనత మొదలైనవి పూర్తిగా కొత్త లక్షణాలు కాకపోయినా వాటి తీవ్రతను అనుభవించీ పలవరించిన దశ ఇది. 'ఊరిచివర' (2009)లో ఈ ధోరణులు ఛాయామాత్రంగా కనిపిస్తే, 'ఇంటివైపు'లో వాటి తీవ్రరూపం కనిపిస్తుంది. ఒక్కో కవితను రాసిన తరువాత ఒకటికి పదిసార్లు సరిదిద్దుకొని, పునరాలోచించుకొని ప్రచురణకిచ్చాను. అయితే, వాటి తాజాదనం చెదిరిపోకుండా సరిదిద్దుకున్నా.



కవిత్వం మీకేమిటి? మీరు కవిత్వాన్ని ఎట్లా చూస్తారు?

కవిత్వం నాకు ఒక ఆంతరంగిక నిత్యావసరం అనవచ్చు. సాహిత్య ఊహ తెలిసిన తర్వాత నన్ను నిర్మొహమాటంగా వ్యక్తంచేసిన రూపం కవిత్వమే. అనేక విధా లుగా చెప్పాలంటే.. మిగిలిన సాహిత్య ప్రక్రియల మీద కూడా నాకు ఆసక్తి ఉన్నప్పటికీ నేను నేనుగా కనిపించే స్పష్టమైన అద్దం కవిత్వమే. మిగిలిన సాహిత్య రూపాలు అంటే– కథా, సాహిత్య విమర్శ, అనువాదాలు మొదలైన వాటిలో నా వైపునుంచి కొనసాగింపు అంతగా కనిపించదు. కవిత్వం ఒక్కటే నాలో నిరంతరంగా కనిపిస్తుంది. నేను ఎక్కువగా చదివేదీ కవిత్వమే. ఉద్యోగపరంగా ఎక్కువగా పాఠాలు చెప్పేదీ కవిత్వమే. అనుదిన జీవన వ్యాపకాల్లో నా తక్షణ ప్రతిఫలనం కవిత్వమే. ప్రతి జీవితంలోనూ, జీవికలోనూ ఒక ఖాళీ ఉంటుంది. ఒక్కొక్కరు ఒక్కో పద్ధతిలో ఆ ఖాళీని నింపుకుంటారు. నాకు అది కవిత్వం ద్వారా మాత్రమే సాధ్యమైంది.

మీ కవి సమయాలూ సందర్భాలూ ఏమిటి?

ప్రత్యేకంగా సమయాలూ సందర్భాలూ లేవు. కవిత్వ సృజనపరంగా నాది సరళమైన ప్రపంచం. కొత్త స్థల కాలాలతోపాటు కొత్త సందర్భాలకు కూడా తేలికగా ఒదిగి ఉంటాను. ముఖ్యంగా ఈ పదిహేనేండ్లలో వృత్తిపరంగానూ, దానికి సంబంధించిన పనుల ఒత్తిడి వల్ల ఎక్కువ సంఘర్షణకు లోనయ్యాను. ఉద్యోగరీత్యా అంతకుముందు అనుభవంలో లేని కొత్త కోర్సులు చెప్పాల్సి వచ్చింది, కొత్త బాధ్యతలు తలకెత్తుకోవాల్సి వచ్చింది. కాబట్టి, చాలా ఒత్తిళ్ళ మధ్య కవిత్వాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేయాల్సి వచ్చింది. కవిత్వం ఒక instinct అని చాలాసార్లు అనుకుంటాం కానీ, నిజానికి కాదు. కొన్నిసార్లు మనం మనంగా మిగులడానికి కూడా చాలా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. కొన్ని క్షణాలు మరీ పరాయీ అయిపోతాం. మనలో మనం మిగులం. అలా మిగుల్చుకునే సందర్భాల్లోనే కవిత్వం రాస్తాం. ఆ కారణంగా ఈ ఎనిమిదేండ్లలో నేను చాలా తక్కువ రాశాను, గతంతో పోలిస్తే!

మీ కవిత్వ పుస్తకాల శీర్షికలు 'ఇవాళ', 'వలస', 'ఊరిచివర' కొత్తగా 'ఇంటివైపు' చాలా భిన్నంగా, నిర్దిష్టంగా ఉంటాయి. మీరు ఉద్దేశపూర్వకంగా ఈ భిన్నత్వాన్ని, నిర్దిష్టతను లక్ష్యంగా పెట్టుకొని శీర్షికలు ఇచ్చారా?

చాలామటుకు యాదృచ్ఛికంగా పెట్టిన శీర్షికలే అవి. అయితే, గమ్మత్తుగా అవి నా జీవన సందర్భాలకు సరిపోయాయి. ఇవాళ శీర్షిక మొదటిసారి నేను మిత్రులతో చెప్పినప్పుడు అందులో నీ కవిత్వ గాఢత లేనేలేదు అని కొట్టిపడేసినవాళ్లు ఎక్కువే. 'వలస' 'ఊరిచివర' ఇప్పుడు 'ఇంటివైపు' కూడా అంతే. ముందే చెప్పినట్టు, నాది సరళమైన ప్రపంచం. నా కవిత్వ ప్రయాణం కూడా అంతే. 'రక్తస్పర్శ' నుంచి 'ఇంటివైపు' దాకా గమనిస్తే, నేను సంక్లిష్టత నుంచి సరళత్వం వైపు ప్రయాణించాను. సరళంగా మాట్లాడటం, కవిత్వం చెప్పడం చాలా కష్టమని అర్థమైంది. ఆ కోణంలోంచే నా కవిత్వ పుస్తకాల శీర్షికలు కూడా..

సమకాలీన కవులకు అఫ్సర్ కవిత్వం భిన్నంగా ఉంటుందన్నది సాధారణంగా ఏర్పడిపోయిన భావన. ఆ భిన్నత్వాన్ని మీరెలా చూస్తారు?

ప్రతి కవీ తనదైన వ్యక్తిత్వంతోనే వస్తాడు. అనుభవంతో మొదలుకొని భాషా, దృక్పథం దాకా ఆ భిన్నత్వం కనిపిస్తుంది. అనుభవంలోని మెరుపు పెరిగే కొద్దీ కవిత్వంలోనూ ఆ మెరుపులు కనిపిస్తాయి. వెంటనే భాషలో ఆ కాంతి కనిపిస్తుంది. మరీ ముఖ్యంగా కవికి భాష చాలా అవసరమైన సాధనం. కవి వ్యక్తిత్వాన్ని పట్టిచ్చే తొలి గుర్తు. అనుభవంలోని వైవిధ్యం లేదా మామూలు విషయాలనే భిన్నమైన అనుభవిక స్పర్శతో చూడాలన్న తపన మన వ్యక్తీకరణను కాస్త కొత్తగా వెలిగిస్తుంది. బహుశా, ప్రతి ఒక్కరూ ఆ వెలుగు కోసం వెతుక్కుంటూ ఉంటారు. సాహిత్యం ఆసరా దొరికిన వాళ్లు ఇంకాస్త ఉద్వేగంగా వెతుక్కుంటారు. నేనూ అంతే!

మీరు మైనార్టీ స్వరాన్ని వినిపిస్తూనే ఒక విశ్వజనీన దృక్పథాన్ని కవిత్వంలో వ్యక్తం చేస్తారు. ఈ సమన్వయం ఎలా సాధ్యపడింది?

నేను మైనార్టీని కాదు. అట్లాగని మెజార్టీని కాదు. నేను నేనుగానే ఉంటాను, అన్ని సామాజిక కొలమానాలు విఫలమయ్యేలా! నిర్దిష్టతను, స్థానికతనూ ఒక సైద్ధాంతిక భూమికగా బలంగా నమ్మే వ్యక్తిని నేను. ఆ రెండింటిలో ఉండే రంగూ రుచీ వాసనా నన్ను నిర్వచిస్తాయి. కొన్నిసార్లు కవి తను ఫలానా అని చెప్పుకున్నా, అతని కవిత్వం ఆ ఫలానాలో ఇమడదు. అలాంటి ఫలానా ముద్రలను ధ్వంసం చేసుకునే శక్తి కవిత్వంలోని మ్యాజిక్. పాల్కుర్కి సోమన నుంచి ఇప్పటి కొత్త కవి దాకా మనకు తెలిసిన ప్రతి కవీ ఈ మ్యాజిక్‌కు ఒక ఉదాహరణే.

దాదాపు మూడున్నర దశాబ్దాల మీ కవిత్వంలో ముఖ్యంగా ప్రాంతంగా చూస్తే నాలుగు దశలు కనిపిస్తాయి నాకు.. ఖమ్మం/ విజయవాడ/ అనంతపురం/ అమెరికా. ఇది కేవలం ప్రాంతానికి సంబంధించిన మార్పు కాదనీ, అంతకుమించిన మార్పు ఏదో మీ కవిత్వంలో కనిపిస్తుంది. మీకూ అలాగే అనిపిస్తున్నదా?

మంచి పరిశీలన! ఒక్క వాక్యంలో చెప్పాలంటే, ఖమ్మం మునేరులో మునిగాను, అమెరికాలోని ఫిలడెల్ఫియాలో తేలాను. మధ్యలో బెజవాడ, హైదరాబాద్, అనంతపురం లాంటి మజిలీలు ఉన్నాయి. ప్రాంతం కవి ఆనవాళ్లు. నా కవిత్వ సంపుటాల్లో.. 'రక్తస్పర్శ' ఖమ్మం, 'ఇవాళ' బెజవాడ,'వలస' అనంతపురం, 'ఊరి చివర' అమెరికాలోని టెక్సాస్, 'ఇంటివైపు' ఫిలడెల్ఫియాలో ఉండగా రాసినవి. ఆయా ప్రాంతాలకూ ఆ కవిత్వ సంపుటాలకూ తప్పనిసరిగా చుట్టరికం ఉంది. ఆయా ప్రాంతాల సాంస్కృతిక అంతస్సు వాటిల్లో ఎంతోకొంత మౌలికంగా కనిపిస్తూ ఉంటుంది. అయితే, నేను పెరిగిన, చదువుకున్న, నా తొలి ఆనవాళ్ళన్నీ తెలంగాణలో ఉన్నాయి. మా కుటుంబ చరిత్ర తెలంగాణ సాయుధ పోరాటంతో ముడిపడి ఉంది. వామపక్ష రాజకీయాలతో కలగలిసి ఉంది. ఎక్కడున్నా, ఎలా ఉన్నా, వాటిని నేను నా వ్యక్తిత్వంలోంచి దూరంగా పెట్టలేను. ప్రాంతానికి మించిన మార్పు అని మీరంటున్నది ఏదైతే ఉందో, అది నా నేపథ్యం, నన్ను పెంచి పెద్ద చేసిన చరిత్ర.. అందులోనే నేనున్నాను.

ఒక ముస్లింగా మీరు కవిత్వంలో బలంగా వ్యక్తమవ్వాల్సిన సందర్భం ఎప్పుడు వచ్చింది?

భారతదేశంలోని ఏ ముస్లిం కవికైనా అది డిసెంబర్ ఆరు 1992 అనే అనుకుంటాను. అయితే, అంతకంటే ముందే నేను మా ఖమ్మం గోడల మీద 'విప్లవం వర్ధిల్లాలి' అనే నినాదాలు మసకబారి, దానికి భిన్నంగా ఏబీవీపీ, మజ్లిస్ నినాదాలు కనిపించడం మొదలెట్టాయి. ఈ సందర్భాన్ని కవిత్వంలో కంటే ముందు ఒక కథలో వర్ణించాను. అది కవిత్వంలో ఎందుకు చెప్పలేదా అన్న ప్రశ్న ఇప్పటికీ ఉంది. మొదటి నుంచీ కవిత్వం నాకు ఒక మ్యాజికల్ మిర్రర్. నా లోపల సామాజికుడి ఘోష ఎంత ఉన్నా, నా కోసమే అన్నట్టు కవిత్వాన్ని అట్టిపెట్టుకున్నాను. మరీ ఒత్తిడి కలిగించిన బయటి సందర్భాలు కవిత్వం అయిన ఉదాహరణలు ఉన్నా, వాటిల్లో కూడా నాలోని పర్సనల్ కోణం స్ఫుటంగా వ్యక్తమవుతుంది. అంతర్గతంగా ఎంతో నలిగితే తప్ప బయటి సందర్భాలూ సంఘటనలూ కవిత్వం కాలేదు నాకు.

తెలంగాణ.. మీ కవిత్వంలోనూ, పరిశోధనలోనూ ప్రధానమైన భూమికగా ఎప్పుడు మారింది?

మొదటినుంచీ తెలంగాణ ప్రధానమైన భూ మికే. చింతకానిలో తెలంగాణ జానపద పాటలూ, కథలూ, పోరాట గాథలూ చిన్నప్పటినుంచే విన్నాను. మా కుటుంబానికి ఉన్న తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం వల్ల ఇంట్లో ఆ పోరాట జ్ఞాపకాలూ అనుభవాలూ తరచూ వినిపించేవి. ఇక నా ఉస్మానియా యూనివర్సిటీ పీఎచ్‌డీ ఆధునిక కవిత్వ వస్తురూపాలమీద. అయితే, తెలంగాణ సాయుధ పోరాటం ఆధునిక వచన కవిత్వానికి మౌలికతను ఇచ్చిందని అందులో వాదించాను. పీర్ల పండగ మీద ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రచురించిన పుస్తకం పునాది తెలంగాణలోని పీర్ల పండుగే. అట్లాగే.. ఇప్పుడు కొత్తగా రాస్తున్న పుస్తకం 'పోలీస్ చర్య'కు సంబంధించిన సాహిత్య సాంస్కృతిక కథనాల గురించి ప్రధానంగా తెలంగాణలో ఆధునిక సాహిత్యరూపాలు ఎట్లా వికసించాయో చెప్పే ప్రయత్నం.

ఇప్పుడు తెలంగాణ సాహిత్యం తిరిగిన మలుపులను మీరెలా అర్థం చేసుకుంటు న్నారు?

తెలంగాణ సాయుధ పోరాటం సాహిత్య చరిత్రలో పెద్ద మలుపు అనే తాత్త్విక భూమిక నుంచి నేను వచ్చాను. అప్పటి కోస్తా ఆంధ్ర కవులకు, రచయితలకు, ఉద్యమకారులకు కూడా తెలంగాణ ఒక దిక్సూచి. తెలంగాణ పాత్ర ఎప్పటికీ అట్లాగే ఉంటుంది. తెలంగాణ అప్పటి 'వజ్రాయుధం'.. ఇప్పుడు కూడా 'వజ్రాయుధమే'. కాని ఇటీవలి ఉద్యమ తీవ్రతలో ఉన్నప్పుడు పెంచి పోషించుకున్న ద్వేషాలు పక్కనబెట్టి, తెలంగాణ అసలుసిసలు పాత్రను అందరూ గుర్తించితీరాలి. మన చరిత్రలో అంతకంటే గొప్ప ఉద్యమాలను ఇప్పటిదాకా మనం చూడలేదు. అందుకు తెలంగాణ మాత్రమే కాదు, రెండు తెలుగు రాష్ట్రాలూ గర్వించాలి. ఇదే విషయం సాహిత్యానికి కూడా వర్తిస్తుంది. ఈ ఇరువయ్యేండ్లలో తెలంగాణ నుంచి వచ్చిన మౌఖిక, లిఖిత సాహిత్యాలూ రెండూ బలమైనవే. ఆ వారసత్వం మున్ముందు కొనసాగాలి. ఇందులో దళిత, ముస్లిం, స్త్రీ స్వరాలకు వాటికి తగిన స్థానం కూడా దక్కాలి.

భారతీయ కవిత్వాన్ని దగ్గరగా చదివిన అతికొద్ది మంది కవుల్లో మీరూ ఒకరు. భారతీయతా, కవిత్వం, ప్రాంతీయత.. ఈ మూడు అంశాల మధ్య పొంతన ఎలా సాధ్యం?

భిన్నత్వం లేకుండా భారతీయత లేదు. స్థానికతలోని బలమే భారతీయత బలం కూడా. ఇదే మాట భారతీయ కవిత్వం గురించి కూడా చెప్పుకోవాలి. స్థానికతలోని బహుళత్వం (pluralism) మన కవిత్వ సంస్కృతికి పునాది. మన దేశంలో ఎన్ని భాషలున్నాయో, అన్ని భాషల కవిత్వాలూ మనకు ముఖ్యమే. పలు భాషల్లో వస్తున్న కొత్తతరం కవులు అట్లాంటి భారతీయతనే వెతుక్కుంటున్నారు.

అట్లాగే.. అంతర్జాతీయ కవిత్వం చదువుతూ, విశ్వవిద్యాలయ స్థాయిలో బోధిస్తున్నారు. ఆ కోణాలు మీ కవిత్వ వ్యక్తిత్వంపై ఎలాంటి ప్రభావాన్ని కలిగిస్తున్నాయి?

టీచింగ్ నా రోజువారీ జీవితంలో పెద్ద భాగం. పాఠం చెప్పే సమయం తక్కువే అయినప్పటికీ ఎక్కువ సమయం పాఠం చుట్టూ ఆలోచనలతో గడుస్తుంది. పైగా, ప్రతీ సెమిస్టర్ కొత్త కోర్సులు చెప్పాల్సి రావడం వల్ల ఆలోచనలకు పెద్ద వ్యాయామం. ఈ సెమిస్టర్ 'ప్రతిఘటన ఉద్యమాలూ–సాహిత్యం' అనే కొత్త కోర్సు చెప్తున్నా. ఈ కోర్సు ప్రపంచవ్యాప్తంగా వామపక్ష ఉద్యమాలతో మొదలై, ఇప్పటి అస్తిత్వ చైతన్య ఉద్యమాలదాకా వస్తుంది. ఇలాంటి కోర్సులు చెప్తున్నప్పుడు అవి కేవలం తరగతి గదికే పరిమితం కావు. మన ఆలోచనల పరిధిని విస్తరిస్తాయి. కొత్త ప్రశ్నలు పుట్టుకొస్తాయి. అవి కవిత్వ రచనలో కూడా కొత్తదనం కోసం వెతుక్కుంటాయి. నా దృష్టిలో ఇదంతా మన సొంత అన్వేషణలో భాగమే!

ప్రభావాల మాటకు వస్తే.. ఇటు భారతీయ కవిత్వంలోనూ అటు అంతర్జాతీయ కవిత్వంలోనూ మిమ్మల్ని బాగా ప్రభావితం చేసిన వారున్నారా?

పేర్లు చెప్పడం కష్టం! ప్రభావాలు తప్పనిసరి. భారతీయ కవిత్వంలో దళిత కవిత్వం నన్ను బాగా ప్రభావితం చేసింది. అంతర్జాతీయ కవిత్వంలో బ్లాక్ పోయెట్స్ నాకు చాలా ఇష్టమైనవాళ్లు.

వర్తమాన కవిత్వం ప్రింట్ నుంచి సోషల్ మీడియాకు మళ్లుతున్న దశను మీరెలా అర్థం చేసుకుంటున్నారు?

సోషల్ మీడియాను సమర్థంగా ఉపయోగించుకుంటే కవిత్వానికి అది కొత్త శక్తి. ప్రింట్ మీడియాలో ఉండే పరిమితులను అది దాటి వెళ్తుంది. ఎంత కాదన్నా, ప్రింట్ మీడియా కొంత సంప్రదాయిక చట్రంలో ఉంటుంది. కొత్తదనాన్ని అంత తేలికగా ఆహ్వానించదు. 'ఫేస్‌బుక్'లో అట్లాంటి చట్రాలు పనిచేయవు. కాబట్టి, కొత్త స్వరాలకు మంచి అవకాశం. కొత్త ప్రయోగాలకు కూడా మంచి వేదిక.

అమెరికాలో కొత్తతరం కవిత్వం ఎలా ఉంటున్నది?

వస్తు వైవిధ్యం, అనుభవ విస్తృతి, విషయాన్ని తేలిక భాషలో చెప్పడం కొత్త అమెరికన్ కవిత్వంలో కనిపిస్తున్నాయి. ఇవి మన వర్తమాన తెలుగు కవిత్వంలోనూ ఉన్నాయి. కాని, భాషకు సంబంధించి ఇంకా మనకు కొన్ని సంప్రదాయికమైన ఆలోచనలున్నాయి. అవి తొలిగిపోవాలి. అమెరికన్ కవిత్వంలో ప్రోజ్ పోయెమ్ కొన్ని సంప్రదాయికమైన చట్రాలను బద్దలుకొట్టింది. ఆ ధోరణి మనకు కూడా అవసరమే.


మన దగ్గర 'కవిసంగమం'లాగా అమెరికాలో ఇంటర్నెట్/ సోషల్ మీడియా భూమికగా ధోరణులు ఏమైనా ఉన్నాయా?

'కవిసంగమం' లాంటి ప్రయోగం అమెరికన్ సాంస్కృతిక నేపథ్యంలో అంతగా ఫలించదు. ఎంతకాదన్నా, అమెరికన్ కవిత్వంలో ఒక హైరార్కీ ఉంది. కొన్ని బలమైన శక్తుల పెత్తనం ఇంకా ఉంది. అందువల్ల అమెరికన్ కవి సమూహాల్లో వెసులుబాటు తక్కువ. కవిసంగమం ప్రధానంగా సాధించిన విజయం హైరార్కీని సవాలు చేయడం, కొత్తతరాన్ని అందుకోవడం. ఇవి రెండూ అమెరికన్ సమాజంలో అంత తేలిక కాదు. అట్లాగే, ఇంటర్నెట్ సాహిత్యానికి కూడా ఇంకా రావాల్సినంత ప్రాముఖ్యం రాలేదు.

ముందుతరం కవిగా కొత్తతరం కవులకు మీరేమైనా చెప్పదలుచుకున్నారా?

సందేశాలివ్వడం నాకు నచ్చదు. నిత్య సంశయం వెంటాడుతున్న తరం మనది. కవి ఏ తరం వాడైనా మన సహ ప్రయాణికుడే! ఇప్పుడు మరీ ముఖ్యంగా అందరూ కలిసి ప్రయాణం చేయాల్సిన సందర్భం. చాలా సామాజిక ఒత్తిళ్ల మధ్య నడుస్తూ వెళ్తున్నాం. వ్యక్తిగత అస్తిత్వం కూడా ప్రమాదంలో ఉంది. మనకున్న ఒకే ఒక్క ఆసరా– కవిత్వం! అదృష్టం బాగుండి ఇప్పుడు కవులకు మంచి వేదికలున్నాయి. మంచి కవిత్వాన్ని అక్కున చేర్చుకునే చదువరుల సంఖ్య కూడా పెరిగింది. జీవితాన్ని వంచించుకోకుండా రాసే ప్రతి వాక్యం నిలుస్తుంది. ఆ నమ్మకం నా మటుకు నాకు గతంలోకన్నా ఇప్పుడే ఎక్కువగా ఉంది. మనం వచనం ఎక్కువ చదవాలి. విమర్శను తట్టుకోవాలి. ఒక అడుగు ముందుకే వేయాలి, కాని నిన్నటి రెండు అడుగులను కూడా గుండెకు హత్తుకోవాలి.

– కవి యాకుబ్, 9849156588



మిమ్మల్ని మీరు తెలంగాణ కవిగా చూసుకుంటారా?

రెండు తెలంగాణ పోరాటాల అట్టల మధ్య ఒదిగిన పుస్తకాన్ని నేను. ఒక పోరాటం నా కుటుంబ స్మృతి, రెండోది నా సొంత అనుభవం. నిజానికి తెలంగాణ కవి అనిపించుకోవడానికి అవి సరిపోకపోవచ్చు. ఆ ప్రాంతంలోని ఉద్విగ్నత నిండేలా ఇంకా పోరాటశీలత కావాలి. నేను ప్రధానంగా రచయితను కాబట్టి పోరాటానికి నా నిర్వచనం భిన్నంగానే ఉంటుంది. ఉద్యమాల్లో ప్రాణాలు కోల్పోయిన వాళ్లు ఉంటారు. వాళ్ల నిబద్ధత ముందు రచయిత నిబద్ధత సరిపోదు. రచయితది సాంస్కృతిక నిబద్ధత. నన్ను నేను ఆ పరిధిలో మాత్రమే చూసుకుంటాను.



హైదరాబాద్ బుక్‌ఫెయిర్

పుస్తకాలను అపురూపంగా ప్రేమించేవారు, ప్రపంచవ్యాప్తంగా కొత్తగా విడుదలైన పుస్తకాల కోసం ఎదురుచూసే వారికోసం పాత, కొత్త పుస్తకాల ప్రపంచంగా ఈ నెల 18 నుంచి 28 వరకు హైదరాబాద్ బుక్‌ఫెయిర్ మీ ముందుకువస్తుంది. దేశంలోనే రెండోస్థానం హైదరాబాద్ పుస్తక ప్రదర్శనకు ఉన్నది. ఇది హైదరాబాద్‌లో జరుగుతున్న 31వ జాతీయపుస్తక ప్రదర్శన. అన్నిరంగాలకు, అన్నిశాస్త్రాలకు సంబంధించిన పుస్తకాలు, అన్నిభాషల పుస్తకాలు దొరుకుతాయి. ముక్తి నుంచి విముక్తి ఉద్యమాల వరకు సాహిత్యం లభిస్తుంది. పుస్తక ప్రేమికులకు, సృజనకారులకూ ఇది పుస్తకాల పండుగ. ప్రపంచ విజ్ఞానాన్ని తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం, ఇందిరాపార్కు) దగ్గరకు తీసుకవచ్చి మీ చేతికందించే ప్రయత్నం చేస్తున్నాం. సమాజ మార్పునకు, సమాజాల పునర్నిర్మాణాలకు ప్రధాన పనిముట్టయిన పుస్తకాన్ని దర్శించండి. ఆరోగ్యవంతమైన సమాజానికి పుస్తకమే ప్రాణం. మంచి పుస్తకాలు ఉత్తమ సమాజ నిర్మాతలు. నవతకు, సమతకు దారి పుస్తకమే. ఈ 11 రోజుల పుస్తకాల పండుగకు సాదరస్వాగతం. రండి.. పుస్తక విశ్వదర్శనంలో పాల్గొనండి.

– జూలూరు గౌరీశంకర్
హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు
–బుర్రా వెంకటేశం
భాషా సాంస్కృతిక, టూరిజం శాఖ ముఖ్యకార్యదర్శి

మూడుతరాల కవిసంగమం

కవిసంగమం సిరీస్‌లో భాగంగా 2018, జనవరి 21న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ గోల్డెన్ త్రెషోల్డ్, అబిడ్స్‌లో కవిసంగమం జరుగుతుంది.ప్రొఫెసర్ ఎండ్లూరి సుధాకర్, నాగిళ్ల రమేష్, వేణుగోపాల్ జ్జూరి, సిరసిజ పెనుగొండ, రమేష్ కార్తీక్ నాయక్ పాల్గొంటారు. మెర్సీ మార్గరెట్‌కు అభినందన ఉంటుంది.

– కవి సంగమం

కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం-2018

కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం కోసం ఈ ఏడాది గ్రంథరూపంలో ముద్రిత నాటక/నాటిక సంపుటులకు పురస్కారం ఉంటుంది. 2015–17 మధ్య మూడేండ్లలో ముద్రితమైనవి పరిశీలించబడతాయి. రచయితలు మూడేసి ప్రతులు ఈ జనవరి 18లోపు పంపాలి. చిరునామా–డాక్టర్ కొలకలూరి సుమకిరణ్, ప్రొఫెసర్ ఆంగ్లశాఖ, వెంటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి–517.

– డాక్టర్ కొలకలూరి సుమకిరణ్, 9963564664

డాక్టర్ ఎం.మోహన్‌బాబుకు 'విశ్వనట సార్వభౌమ'తో సత్కారం

టీఎస్‌ఆర్ కాకతీయ లలిత కళా పరిషత్, నమస్తే తెలంగాణ, టీవీ9 వారి ఆధ్వర్యంలో ప్రఖ్యాత నటుడు డాక్టర్ ఎం. మోహన్‌బాబుకు 'విశ్వనట సార్వభౌమ'తో సత్కారం. 2018, జనవరి 17న సాయంత్రం 5 గంటలకు, మాదాపూర్‌లోని శిల్పకళా వేదిక, హైదారాబాద్‌లో ఉంటుంది. డాక్టర్ టి.సుబ్బిరామిరెడ్డి నిర్వహణలో జరిగే ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీ, డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్ రావు, ఎస్. మధుసూధనాచారి, కె.స్వామి గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ, ఇంకా పలువురు ప్రముఖ ప్రజాప్రతినిధులు, పెద్దలు హాజరవుతారు.

– టీఎస్‌ఆర్ కాకతీయ లలిత కళా పరిషత్

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.


గంగాసాగర్‌లో ఆదివారం పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

సాగరద్వీపంలో 20 లక్షల మంది పుణ్యస్నానాలు

మకర సంక్రాంతి సందర్భంగా కపిలముని ఆలయంలో ప్రత్యేక పూజలు

సాగర్‌ద్వీపం (పశ్చిమబెంగాల్), జనవరి 14: మకర సంక్రాంతిని పురస్కరించుకొని సుమారు 20 లక్షల మంది భక్తులు ఆదివారం బంగాళాఖాతం తోపాటు గంగానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. పశ్చిమబెంగాల్‌లోని 24 పరగణాల జిల్లాలో గంగాడెల్టా ప్రాంతమైన సాగర్‌ద్వీపంలో వివిధ రాష్ట్రాల నుంచి, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ నుంచి భక్తులు పుణ్య స్నానాలు చేశారు. అనంతరం వారు కపిలముని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతియేటా మకర సంక్రాంతిని పురస్కరించుకొని లక్షల మంది భక్తులు బంగాళాఖాతం, గంగానదిలో స్నానాలు ఆచరించి కపిలముని దేవాలయంలో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తున్నది

విరాళంతో 'అవినీతి' కేసుకు సరి

■ జైలుపాలైన సౌదీ యువరాజు ప్రతిపాదన



దుబాయి/ జెడ్డా, జనవరి 14: అవినీతి ఆరోపణలతో గతేడాది నవంబర్‌లో జైలుపాలైన సౌదీ అరేబియా యువ రాజు అల్వాలీద్ బిన్ తలాల్ ఆ కేసు నుంచి బయటపడేందుకు ప్రభుత్వానికి 'విరాళం' ఇచ్చేందుకు ముందుకు వచ్చారని సమాచారం. అయితే ఆయన ప్రతిపాదనను సౌదీ సర్కార్ ఆమోదించలేదని తెలిసింది. ఫోర్బ్స్ మ్యాగజైన్ అంచనా ప్రకారం అల్వాలీద్ బిన్ తలాల్ ఆస్తులు 1700 కోట్ల డాలర్లు. తానే తప్పు చేసినా.. తన ఆస్తుల్లో ఏదైనా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చునని అల్వాలీద్ ప్రతిపాదించారని వినికిడి. రాజు మహ్మద్ బిన్ సల్మాన్ గత నవంబర్‌లో పలువురు సౌదీ రాజ కుటుంబానికి చెందిన రాజకీయ, వ్యాపారవేత్తలను వివిధ కేసుల్లో అరెస్ట్ చేయించారు. సల్మాన్‌తోపాటు మితేబ్ బిన్ అబ్దుల్లా కూడా రాజ కిరీటం కోసం పోటీపడ్డారు. అయితే 100 కోట్ల డాలర్లకు పైగా చెల్లించి మితేబ్ బయటపడ్డారని అధికార వర్గాలు తెలిపాయి.



రూ.20 లక్షల గ్రాట్యుటీ వరకు పన్ను మినహాయింపు

■ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఆమోదం పొందనున్న బిల్లు
■ దేశవ్యాప్తంగా లక్షల మంది కార్మికులకు లబ్ధి

న్యూఢిల్లీ, జనవరి 14: సంఘటిత రంగ కార్మికులకు శుభవార్త. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకూ రూ.20 లక్షల గ్రాట్యుటీ వరకు పన్ను మినహాయింపు ఇవ్వాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. గతంలో కార్మికులకు పన్ను మినహాయింపు రూ.10 లక్షల వరకు ఉండేది. అయితే ప్రభుత్వ నిర్ణయంతో ఈ పన్ను మినహాయింపు రెట్టింపు కానుంది. ఇందుకు సంబంధించిన 'గ్రాట్యుటీ చెల్లింపుల సవరణ బిల్లు-2017' త్వరలో జరుగనున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఆమోదం పొందే అవకాశముంది. ఈ సవరణ బిల్లు ఆమోదం పొందితే దేశవ్యాప్తంగా లక్షల మంది కార్మికులకు లబ్ధి చేకూరనుంది. గత నెలలో జరిగిన శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును లోక్‌సభలో కేంద్రమంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ ప్రవేశపెట్టారు. ఈ బిల్లు చట్టంగా మారిన తర్వాత గ్రాట్యుటీపై పన్ను మినహాయింపు పెంచాలన్నా, తగ్గించాలన్నా ప్రభుత్వం మరో బిల్లును ప్రవేశపెట్టాల్సిన అవసరం లేదని తెలిపాయి.

గుజరాత్‌లో మాంజా తెగి ఇద్దరు మృతి

అహ్మదాబాద్, జనవరి 14: గుజరాత్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో పతంగుల మాంజా గొంతుకు చుట్టుకొని ఇద్దరు వ్యక్తులు మరణించారు. మెహ్సానా జిల్లా గోజారియా గ్రామంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న కల్పేశ్ పటేల్ (33)ని తీగ చుట్టుకోవడంతో రక్తమోడి మరణించాడు. ఆనంద్ జిల్లా ఖంభాట్ తాలూకా నవాపురా గ్రామంలో ఇదే తరహాలో తీగ చుట్టుకోవడంతో గొంతు తెగి అశ్విన్ ప్రజాపతి అనే వ్యక్తి మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భారత్ ప్రపంచ శక్తి

ఇజ్రాయెల్ ప్రధాని కితాబు

■ ఆరు రోజుల పర్యటన నిమిత్తం భారత్ వచ్చిన బెంజమిన్ నెతన్యాహు
■ ప్రొటోకాల్‌ను కాదని వెళ్లి స్వయంగా స్వాగతం పలికిన ప్రధాని మోదీ


ఢిల్లీ విమానాశ్రయంలో నెతన్యాహును ఆలింగనం చేసుకున్న ప్రధాని మోదీ

జెరూసలేం, జనవరి 14: భారత్ ప్రపంచ శక్తి అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కితాబునిచ్చారు. వ్యాపార, భద్రత, సాంకేతిక, పర్యాటక రంగాల్లో భారత్‌తో కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. ఆరు రోజుల పర్యటన నిమిత్తం ఆయన ఆదివారం భారత్‌కు చేరుకున్నారు. ఆయన వెంట భార్య సారా, ముంబై ఉగ్రదాడి(26/11)లో తల్లిదండ్రులను కోల్పోయిన యూదు బాలుడు 11 ఏండ్ల మోషె హోల్ట్స్‌బర్గ్, ఇజ్రాయెల్ వ్యాపారులు ఉన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని భారత్ పర్యటనకు రావడం పదిహేనేండ్ల తర్వాత ఇదే మొదటిసారి. 2003లో అప్పటి ప్రధాని ఏరియల్ షరోన్ భారత్‌లో పర్యటించారు.

ప్రొటోకాల్‌ను పక్కన పెట్టిన మోదీ

ప్రధానమంత్రి మోదీ ప్రొటోకాల్‌కు విరుద్ధంగా ఢిల్లీలోని విమానాశ్రయానికి స్వయంగా వెళ్లి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన భార్య సారాకు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనతో చేతులు కలిపారు. ఆలింగనం చేసుకున్నారు. అనంతరం చేతులు పట్టుకొని అభివాదం చేశారు. గత ఏడాది మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించిన తర్వాత వీరి మధ్య సత్సంబంధాలు మరింత మెరుగయ్యాయి. నెతన్యాహు 130 మంది వాణిజ్య ప్రతినిధులతో కలిసి భారత్ పర్యటనకు వచ్చారు. నెతన్యాహు ఆదివారం రాత్రికి మోదీ ఇచ్చిన విందులో పాల్గొన్నారు.

మిత్రమా.. నీ రాక మమ్మల్ని ఆనందంలో ముంచెత్తింది

'మిత్రమా.. భారత్ గడ్డపై కాలు మోపినందుకు శుభాకాంక్షలు. మీ చారిత్రక పర్యటన మమ్మల్ని ఆనందంలో ముంచెత్తింది. ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత బలపడటానికి మీ పర్యటన ఎంతగానో ఉపయోగపడుతుంది' అని మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అంతకు ముందు ఇజ్రాయెల్ నుంచి బయలుదేరేముందు నెతన్యాహు జెరూసలేంలో విలేకరులతో మాట్లాడుతూ 'భారత్ పర్యటనలో భాగంగా పలు అంశాలపై చర్చించడం తోపాటు పలు ఒప్పందాలపై ఇరుదేశాలు సంతకాలు చేస్తాయి' అని చెప్పారు. తన పర్యటన వల్ల ఇరుదేశాల సంబంధాలు మరింత బలపడతాయని, ఇజ్రాయెల్ భవిష్యత్తుకు కూడా ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. భారత్ పర్యటన సందర్భంగా నెతన్యాహు ఢిల్లీ, ఆగ్రా, గుజరాత్, ముంబై ప్రాంతాల్లో పర్యటించనున్నారు. గుజరాత్ పర్యటన సందర్భంగా మోదీ, నెతన్యాహు రోడ్ షో నిర్వహించనున్నారు. ముంబైలో 26/11 ఉగ్రదాడి ప్రాంతాన్ని కూడా నెతన్యాహు సందర్శిస్తారు. ఇజ్రాయెల్ అధికార వర్గాలు మాట్లాడుతూ భారత్‌తో భాగస్వామ్యంలో భాగంగా రానున్న నాలుగేండ్లలో ఇజ్రాయెల్ 68.6 మిలియన్ డాలర్ల పెట్టుబడులను పెట్టనుందని వివరించాయి.

హైఫా చౌక్‌గా తీన్‌మూర్తి చౌక్

ఢిల్లీలోని తీన్‌మూర్తి చౌక్ పేరు.. ఇజ్రాయెల్‌లోని హైఫా నగరం పేరును కలుపుకొని తీన్‌మూర్తి హైఫా చౌక్‌గా మారింది. ఆదివారం ప్రధాని మోదీ, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఈ మేరకు తీన్‌మూర్తి సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని పేరు మార్పునకు శ్రీకారం చుట్టారు. అనంతరం అక్కడే ఉన్న సందర్శక పుస్తకంలో సంతకాలు చేశారు. శతాబ్దం కిందట ఇజ్రాయెల్‌లోని హైఫా నగరంలో జరిగిన యుద్ధంలో అద్భుతంగా పోరాడిన భారత్‌లోని హైదరాబాద్, జోధ్‌పూర్, మైసూర్‌లకు చెందిన ముగ్గురు అశ్విక దళ సభ్యుల విగ్రహాలను ఢిల్లీలో ఏర్పాటుచేశారు. ఈ ప్రదేశాన్నే తీన్‌మూర్తి చౌక్‌గా పిలుస్తారు.

నేడు ఫుల్ బెంచ్ ముందుకు 'జడ్జీల' వివాదం?

సీజేఐతో ఎస్‌సీబీఏ అధ్యక్షుడి భేటీ

త్వరలోనే సంక్షోభ పరిష్కారం: దీపక్ మిశ్రా

సీజేఐకి నలుగురు మాజీ న్యాయమూర్తుల బహిరంగ లేఖ

న్యూఢిల్లీ, జనవరి 14: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాపై తిరుగుబాటు చేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలపై చర్చించి వివాదాన్ని పరిష్కరించేందుకు సోమవారం పూర్తిస్థాయి ధర్మాసనం సమావేశం కానున్నట్లు తెలుస్తున్నది. అంతర్గతంగా జరిగే ఈ ధర్మాసనం భేటీలో తిరుగుబాటు న్యాయమూర్తులు ఇతర న్యాయమూర్తుల మద్దతు లభించే అవకాశాలు తక్కువేనని తెలిసింది. నలుగురు న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలు, వివాదాలపై పూర్తిస్థాయి ధర్మాసనం సమావేశం కావడం తప్పనిసరని సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్‌తోపాటు 25 మంది న్యాయమూర్తులు పనిచేస్తున్నారు. కాగా, ఈ వివాద పరిష్కారానికి ఇతర న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ప్రతినిధి బృందం ఆదివారం వేర్వేరుగా చర్చలు నిర్వహించారు. ఇదిలా ఉంటే సీజేఐ దీపక్ మిశ్రాతో బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ సమావేశమయ్యారు. అంతకుముందు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రాతో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్ సమావేశమై.. 'ఎస్‌సీబీఏ' తీర్మాన ప్రతిని అందజేశారు. త్వరలోనే సంక్షోభం పరిష్కారం అవుతుందని, న్యాయమూర్తుల మధ్య అన్యోన్యత కొనసాగుతుందని సీజేఐ దీపక్ మిశ్రా హామీ ఇచ్చారని వికాస్ సింగ్ చెప్పారు. అంతకుముందు జస్టిస్ జే చలమేశ్వర్‌తో ఆయన నివాసంలో జస్టిస్ ఎస్ఏ బొబ్డే, జస్టిస్ ఎల్ నాగేశ్వర్ రావు.. ఆ వెంటనే బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా సారథ్యంలోని ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందం మాట్లాడారు. ముంబైలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి బీహెచ్ లోయా మృతి కేసును విచారిస్తున్న జస్టిస్ అరుణ్ మిశ్రాతోనూ బీసీఐ ప్రతినిధులు సమావేశమయ్యారు. కాగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మీడియా ముందుకు రావడం దురదృష్టకరం అని ఢిల్లీ బార్ అసోసియేషన్ వ్యాఖ్యానించింది. జస్టిస్ చలమేశ్వర్‌తోపాటు జస్టిస్ రంజన్ గగోయ్, జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్ ఈ నెల 12న మీడియా ముందుకు వచ్చి సీజేఐ దీపక్ మిశ్రా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, సుప్రీంకోర్టులో పాలన సరిగ్గా లేదని ఆరోపించిన సంగతి తెలిసిందే.

వ్యవస్థ పరిధిలోనే పరిష్కారం కావాలి

సుప్రీంకోర్టులో తలెత్తిన వివాదం న్యాయవ్యవస్థ పరిధిలోనే పరిష్కారం కావాలని నలుగురు రిటైర్డ్ న్యాయమూర్తులు స్పష్టం చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రాకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పీబీ సావంత్,



ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏపీ షా, మద్రాస్ హైకోర్టు మాజీ జస్టిస్ కే చంద్రు, బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి హెచ్ సురేశ్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఈ విషయాన్ని జస్టిస్ షా ధ్రువీకరించారు. పారదర్శకంగా సుప్రీంకోర్టు పాలన సాగాలంటే కేసుల కేటాయింపునకు స్పష్టమైన నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించుకోవాలన్నారు. ముఖ్యమైన అంశాలన్నీ ఐదుగురు సీనియర్ న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముందుకు తీసుకెళ్లాలని ఆ లేఖలో సూచించారు. తరచూగా జూనియర్ న్యాయమూర్తుల సారథ్యంలోని ధర్మాసనాలకు మధ్యవర్తిత్వ పద్ధతుల్లో కేసుల కేటాయింపువల్ల సుప్రీంకోర్టు పాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

సీజేఐకి పరిష్కారాలు సూచించాలి: మాజీ జడ్జీలు

తిరుగుబాటు చేసిన నలుగురు న్యాయమూర్తులు సమస్యల పరిష్కారానికి మార్గాలు తెలియజేస్తూ సీజేఐ దీపక్ మిశ్రాకు నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జ్ఞాన్‌సుధా మిశ్రా సూచించారు. నలుగురు న్యాయమూర్తులు బహిరంగంగా వారి వాణిని వినిపించినందుకు అభినందిస్తున్నానని తెలిపారు. నలుగురు న్యాయమూర్తులకు ధిక్కార నోటీసులు జారీ చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రభాత్ చంద్ర అగర్వాల్ సూచించారు. మీడియా ముందుకు రాకముందే సీజేఐతో సంప్రదించాల్సిందన్నారు. ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ సోధీ స్పందిస్తూ సీజేఐ చేతిలో పూర్తి అధికారాలు ఉండటం సరి కాదన్నారు.

నా తండ్రిది సహజ మరణమే

■ అనూజ్‌లోయా

తన తండ్రి సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం జడ్జీ బీహెచ్ లోయాది సహజమరణమేనని ఆయన కొడుకు అనూజ్‌లోయా (21) స్పష్టం చేశారు. తన తండ్రి మరణించినప్పుడు భావోద్వేగంతో అనుమానాలు వ్యక్తం చేసిన మాట నిజమేనని ఆదివారం మీడియాతో అన్నారు. 'నా తండ్రి మరణం గురించి నాతోత, అత్త కొన్ని సందేహాలు వ్యక్తం చేశారు. కానీ వారెవ్వరికీ అనుమానాలు లేవు' అని అన్నారు. కన్నీటిపర్యంతమైన అనూజ్ లోయా రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు తమ కుటుంబాన్ని వేధించడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ కుటుంబానికి సమస్యలు సృష్టించొద్దని అభ్యర్థించారు.

ఏకైక మహిళా న్యాయమూర్తికి దక్కని ప్రాధాన్యం



సుప్రీంకోర్టులోని ఏకైక మహిళా న్యాయమూర్తి జస్టిస్ భానుమతికి వివిధ కేసుల కేటాయింపులో ముఖ్యంగా మహిళలకు సంబంధించిన వాటిల్లో సైతం సరైన ప్రాధాన్యం లభించలేదని తెలుస్తున్నది. సుప్రీంకోర్టులో కేసుల కేటాయింపుపై నలుగురు న్యాయమూర్తులు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ అంశం కూడా ముందుకు వచ్చింది. ఈ నెల 17న విచారణకు రానున్న ఎనిమిది కేసుల కోసం ఏర్పాటు చేసిన రాజ్యాంగ ధర్మాసనాల్లోనూ జస్టిస్ భానుమతికి చోటు లభించలేదు. ఈ కేసుల్లో మహిళలకు సంబంధించినవి కూడా ఉన్నాయి. శబరిమల దేవాలయం, పార్సీల ఆలయాల్లోకి మహిళలకు ప్రవేశం నిరాకరణ, వ్యభిచారం, స్వలింగ సంపర్కం తదితర కేసులు ఉన్నాయి. గతనెల 15న ఆధార్‌పై విచారించిన రాజ్యాంగ ధర్మాసనంలోనూ ఆమెకు చోటు లభించలేదు. ట్రిపుల్ తలాక్, వ్యక్తిగత గోప్యత హక్కు కేసు విచారణలోనూ జస్టిస్ భానుమతికి ప్రాతినిధ్యం లభించలేదు.



మకరజ్యోతిని దర్శించుకున్న అయ్యప్ప భక్తులు

శబరిమల, జనవరి 14: కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి మకరజ్యోతిని ఆదివారం వేలాదిమంది భక్తులు దర్శించుకున్నారు. జ్యోతి దర్శనం సందర్భంగా ఆలయ సన్నిధానం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తుల శరణఘోషల మధ్య అయ్యప్పస్వామి జ్యోతి రూపంలో దర్శనమిచ్చారు. జ్యోతి దర్శనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆలయ కమిటీ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

పెరూలో 7.3 తీవ్రతతో భూకంపం

■ ఇద్దరి మృతి.. సునామీ హెచ్చరికలు జారీ

లిమా, జనవరి 14: పెరూ తీరంలో ఆదివారం ఉదయం 4.18 గంటలకు 7.3 తీవ్రతతో భూకంపం వచ్చింది. దీంతో పలు భవనాలు కూలి ఇద్దరు మృతి చెందగా, 65 మంది గాయపడ్డారని పోర్ట్ రక్షణ సంస్థ తెలిపింది. దక్షిణ ప్రైవతి లిమాలో 42 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంపం వల్ల సునామీ ముప్పు కూడా ఉన్నదని అధికారులు హెచ్చరించారు. 12.1 కిలోమీటర్ల లోతువరకు భూకంపం ప్రభావం చూపింది. పెరూతోపాటు చిలీ దేశానికి సునామీ ముప్పు ఉందని అమెరికా జియోలాజికల్ అధికారులు హెచ్చరించారు.


లాలూ కోసం జైలుకు 'దహీ చుర్రా'

రాంచీ, జనవరి 14: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్‌యాదవ్‌కు ఇష్టమైన 'దహీ చుర్రా'ను ఆయన అనుచరులు ఆదివారం బిర్సా ముండాలోని జైలుకు తీసుకొచ్చారు. పశుగ్రాసం కేసులో అరెస్టై ఇక్కడ మూడున్నరేండ్ల జైలుశిక్షను లాలూ అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. సంక్రాంతి సందర్భంగా ప్రత్యేకంగా తయారుచేసిన 'దహీ చుర్రా' అంటే లాలూకు ఇష్టం. తమ అధినేతకు ఇష్టమైన స్వీట్‌ను అనుచరులు జాగ్రత్తగా ప్యాక్ చేసి జైలుకు తెచ్చారు. ఈ కేసు విచారణ సందర్భంగా సంక్రాంతి పండుగకు చేసే 'దహీ చుర్రా' అంటే తనకు ఇష్టమని.. తనను కలిసేందుకు ముగ్గురు కంటే ఎక్కువ మందిని అనుమతించాలని లాలూ కోరారు. ఇందుకు జడ్జి స్పందిస్తూ.. ఆ స్వీట్ మీకు చేరేలా చూస్తా.. కానీ ముగ్గురి కంటే ఎక్కువమందిని మాత్రం అనుమతించబోమని స్పష్టంచేశారు.

హిందూ సంస్కృతిని కలుపుకొనిపోయే

ముస్లింలే ఇక్కడ ఉంటారు

■ యూపీకి చెందిన బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్య



బలియా, జనవరి 14: ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. హిందుత్వంపై ఇప్పటికే పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు పలురకాల వ్యాఖ్యలు చేసి వార్తల్లోకెక్కగా.. ఇప్పుడు ఉత్తర్‌ప్రదేశ్‌లోని బల్లియా జిల్లాలోని ఓ ఎమ్మెల్యే.. భారత్ హిందూదేశంగా మారితే.. హిందూ సంస్కృతిని కలుపుకొని వెళ్లే ముస్లింలే ఇక్కడ నివసిస్తారని వ్యాఖ్యానించారు. 'అలా చేయని వారు వేరే దేశంలో ఆశ్రయం పొందవచ్చు' అని ఎమ్మెల్యే సురేంద్రసింగ్ మీడియాతో పేర్కొన్నారు. '2025లో ఆరెస్సెస్ వందేండ్లు పూర్తిచేసుకోనున్నది. అయితే 2024 నాటికే దేశం హిందూరాజ్యంగా మారనున్నది' అని సురేంద్రసింగ్ చెప్పారు.

జార్ఖండ్, గుజరాత్‌ల్లో రోడ్డు ప్రమాదాలు

■ 20 మంది మృతి, పలువురికి గాయాలు

గుమ్లా/ కచ్, జనవరి 14: జార్ఖండ్, గుజరాత్ రాష్ట్రాల్లో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 20 మంది మృతి చెందారు. జార్ఖండ్ రాష్ట్రం గుమ్లా జిల్లాలోని బెరోలో మకర సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొని ట్రాక్టర్‌పై వెళుతుండగా పాల్కరియా గ్రామం వద్ద ఆటోరిక్షాను ఎదురుగా వస్తున్న ట్రక్ ఢీ కొట్టడంతో 11 మంది మరణించగా, ఐదుగురికి గాయాలయ్యాయని జిల్లా ఎస్పీ అన్షుమన్ కుమార్ చెప్పారు. గాయపడిన వారిని చికిత్స కోసం దవాఖానకు తరలించామన్నారు. గుజరాత్‌లోని కచ్ వద్ద వెళుతున్న పర్యాటక బృందం వ్యాన్‌ను లారీయా వద్ద ఒక బస్సు ఢీ కొట్టడంతో ఐదుగురు మృతి చెందగా, మరో నలుగురు దవాఖానలో చికిత్స పొందుతూ మరణించారని పోలీసులు తెలిపారు.


సుడాన్‌లో రోడ్డు నిర్మిస్తున్న భారత శాంతి దళం సైనికులు

దక్షిణ సుడాన్‌లో రికార్డు సమయంలో బ్రిడ్జి నిర్మాణం

■ ఘనత సాధించిన భారత సైనికులు

వాషింగ్టన్: ఐక్యరాజ్యసమితిలో పనిచేస్తున్న భారత శాంతిదళం సైనికులు తూర్పు మధ్య ఆఫ్రికాలోని దక్షిణ సుడాన్ గ్రామంలో పది రోజుల్లో బ్రిడ్జిని నిర్మించి రికార్డు సృష్టించారు. బ్రిడ్జి నిర్మాణంతో అక్కడి ప్రజల కష్టాలు తొలగిపోయాయి. మలకాల్-మెల్ట్ నగరాల మధ్య ఉన్న ఆకోకా బ్రిడ్జి గతజూన్‌లో కురిసిన భారీవర్షాల కారణంగా ధ్వంసమైంది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ బ్రిడ్జి పునర్నిర్మాణం వల్ల సుడాన్ ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయని ఐక్యరాజ్యసమితి మిషన్ అధికారి రాట్‌మిర్ పెట్రోవిక్ తెలిపారు. రానున్న వర్షాకాలంలోగా బ్రిడ్జిని మరింత పటిష్టపరుస్తామని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ఈ ప్రాంతంలో మరిన్ని రోడ్డుమార్గాలను మరమ్మతు చేసేందుకు అవకాశం కలిగిందని ఇండియన్ ఇంజినీరింగ్ కంపెనీ ఇన్‌చార్జి లెఫ్టినెంట్ కల్నల్ స్కాప్‌మ్ పూరీ తెలిపారు. బ్రిడ్జిని పునర్నిర్మించే క్రమంలో నాలుగుమీటర్ల లోతుకు తవ్వేందుకు చాలా శ్రమించవలసి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. 1948లో ప్రారంభమైన ఐక్యరాజ్యసమితి శాంతిదళం వివిధదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాలను చేయిస్తూ.. వివిధ దేశాల మధ్య నెలకొన్న దౌత్యపరమైన సమస్యలను పరిష్కరిస్తున్నది. ప్రపంచ దేశాల్లో శాంతిని నెలకొల్పేందుకు కృషి చేస్తున్నది.

పుణెలో బిల్డర్ దారుణ హత్య

కుమారుడి ఎదుటే అతిసమీపం నుంచి కాల్చిచంపిన దుండగులు

పుణె, జనవరి 14: మహారాష్ట్ర పుణె నగరంలోని దక్కన్ జింఖానా ప్రాంతంలో ఓ బిల్డర్‌ను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపినట్టు పోలీసులు ఆదివారం చెప్పారు. శనివారం అర్ధరాత్రి ఫ్లష్ ప్రభాత్ రోడ్డులో కుమారుడి కండ్ల ముందటే దేవేంద్ర షా (56) అనే బిల్డర్‌పై దుండగులు ఐదు రౌండ్ల కాల్పులు జరిపినట్టు తెలిపారు. ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తున్న సీసీటీవీ ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'షా నివాసముండే లేన్ నంబర్ 7 వద్దకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు అక్కడి లాండ్రీ షాపు వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. వారిలో ఒకడు షాను పిలవాలని లాండ్రీ షాపు నిర్వాహకుడిని హెచ్చరించాడు. లాండ్రీ షాపు వ్యక్తి పిలవడంతో తన కుమారుడితో కలిసి బయటకు వచ్చిన షాపై దుండగులు ఐదురౌండ్ల కాల్పులు జరిపారు. అందులో రెండు బుల్లెట్లు షాకు తగిలాయి. అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు' అని అడిషనల్ కమిషనర్ రవీంద్ర సెంగాంకర్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన బిల్డర్‌ను స్థానిక ప్రైవేటు దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ చనిపోయారని పేర్కొన్నారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

అత్యంత సుదూర గెలాక్సీని గుర్తించిన నాసా

వాషింగ్టన్, జనవరి 14: ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీ చూడగలిగే అత్యంత సుదూర గెలాక్సీని నాసా శాస్త్రవేత్తలు గుర్తించారు. నాసాకు చెందిన హబుల్, స్పిట్జర్ టెలిస్కోప్‌ల సహాయంతో దీన్ని గుర్తించారు. హబుల్ టెలిస్కోప్ ద్వారా చూడగలిగే చివరి ప్రాంతంలో ఈ గెలాక్సీ ఉన్నదని చెప్పారు. ఈ నక్షత్ర మండలానికి 'ఎస్‌పీటీ0615-జేడీ' అని పేరుపెట్టారు. దీని వయసు చాలా తక్కువగా అంటే దాదాపు 50 కోట్ల ఏండ్లు మాత్రమే ఉంటొచ్చన్నారు. హబుల్, స్పిట్జర్ టెలిస్కోప్‌లు విశ్వంలోని సుదూర ప్రాంతాల ఫొటోలను పంపుతుండగా, శాస్త్రవేత్తలు గ్రావిటేషనల్ లెన్సింగ్ ప్రక్రియ ద్వారా వాటిని అధ్యయనం చేస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా ఇప్పటికే పలు కొత్త గెలాక్సీలను గుర్తించారు. తాజాగా గుర్తించిన 'ఎస్‌పీటీ0615-జేడీ' గెలాక్సీ అన్నింటికంటే


నాసా శాస్త్రవేత్తలు గ్రావిటేషనల్ లెన్సింగ్ ప్రక్రియ ద్వారా కనుగొన్న కొత్త గెలాక్సీ

దూరంగా ఉన్నదని, ప్రకాశవంతంగా ఉన్నదని పరిశోధక బృంద సభ్యుడు బ్రెట్ సాల్మన్ తెలిపారు. టెలిస్కోప్ ద్వారా వచ్చే ఫొటోల్లో సుదూర గెలాక్సీలు ఎరుపురంగు చుక్కల మాదిరిగా కనిపిస్తాయని వాటిని గ్రావిటేషనల్ లెన్సింగ్ ప్రక్రియ ద్వారా అధ్యయనం చేసి వాటి విస్తీర్ణం, బరువు తదితర లక్షణాలను అంచనా వేస్తామని చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లో ఓ జంటపై వీహెచ్‌పీ దాడి

లఖ్నో, జనవరి 14: ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పట్ జిల్లాలో వీహెచ్‌పీ కార్యకర్తలు ఓ జంటపై దాడిచేశారు. పంజాబ్‌లోని లూథియానాలో ఉండే ఓ జంట నాలుగురోజుల క్రితం యువతి యువకుడు పారిపోయి వచ్చారు. బాగ్‌పట్‌లోని తహశీల్ కోర్టులో వారు పెండ్లి చేసుకునేందుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న వీహెచ్‌పీ కార్యకర్తలు న్యాయవాది చాంబర్‌లో ఉన్న వారిపై దాడిచేశారు. అక్కడికి పోలీసులు వచ్చినా.. వీహెచ్‌పీ కార్యకర్తలు దాడిని మాత్రం ఆపలేదు. తర్వాత ఆ ఇద్దరితోపాటు వీహెచ్‌పీ కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలీస్‌స్టేషన్ బయట హిందూ యువవాహిని కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. వీహెచ్‌పీ కార్యకర్తలను విడుదలచేయాలని డిమాండ్‌చేశారు. యువతీ, యువకుడు వేర్వేరు మతాలకు చెందినవారని తెలుస్తున్నది. ఇది లవ్ జిహాద్ కావొచ్చని, దీనిపై విచారణ జరుపుతున్నామని బాగ్‌పట్ ఎస్పీ జైప్రకాశ్ తెలిపారు.





సంక్రాంతి పండుగకు నగరవాసులు పల్లెలకు బయలుదేరడంతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిక్కిరిసిపోతున్నాయి. రద్దీకి అనుగుణంగా రైళ్లు లేకపోవడంతో ఆదివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కేందుకు ప్రయాణికులు కుస్తీలు పట్టారు. మరోవైపు జనం లేక నగర రోడ్లన్నీ బోసిపోతున్నాయి. బేగంపేట గ్రీన్‌ల్యాండ్స్ వద్ద నిత్యం రద్దీగా ఉండే రోడ్డు ఇలా ఖాళీగా కనిపించింది.



శరవేగంగా రవాణా ఆధునీకరణ

■ ఎస్ఆర్‌డీపీ పనుల్లో పెరిగిన వేగం ■ అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్ రూపంలో తొలిఫలాలు
■ దశలవారీగా అందుబాటులోకి రానున్న రహదారులు ■ సిగ్నల్ ఫ్రీ రవాణే లక్ష్యంగా అడుగులు

ఎస్ఆర్‌డీపీలో చేపట్టనున్న నిర్మాణాలు

గ్రేడ్ సపరేటర్లు, జంక్షన్లు:	54
ఎలివేటర్ కారిడార్లు, స్కైవేలు:	111 కి.మీలు
మేజర్ కారిడార్ల అభివృద్ధి:	166 కి.మీలు
ప్రధాన రోడ్ల అభివృద్ధి:	348 కి.మీలు



మైండ్ స్పేస్ వద్ద తుదిదశకు చేరుకున్న అండర్‌పాస్ పనులు

2019లో పూర్తయ్యే ప్రాజెక్టులు

ప్రాజెక్టు	గడువు	అంచనావ్యయం
దుర్గంచెరువు కేబుల్‌బ్రిడ్జి	మార్చి	రూ.184కోట్లు
జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-45 ఎలివేటెడ్ కారిడార్	మార్చి	రూ.150కోట్లు
షేక్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్	మార్చి	రూ.333కోట్లు
కొత్తగూడ గ్రేడ్ సెపరేటర్	జూన్	రూ.265 కోట్లు
బాలానగర్ గ్రేడ్ సెపరేటర్	సెప్టెంబర్	రూ.387కోట్లు
ఓవైసీ హాస్పిటల్-బహదూర్‌పుర కారిడార్	జూన్	రూ.132కోట్లు
ఇందిరా పార్క్-వీఎస్‌టీ ఎలివేటెడ్ కారిడార్	సెప్టెంబర్	రూ.426కోట్లు
సైబర్ టవర్ వద్ద ఎలివేటెడ్ రోటరీ	సెప్టెంబర్	రూ.225కోట్లు
రేతిబౌలి-నానల్‌నగర్ ఫ్లైఓవర్	డిసెంబర్	రూ.175కోట్లు
శిల్పా లేఅవుట్-గచ్చిబౌలి ఫ్లైఓవర్	డిసెంబర్	రూ.330 కోట్లు
చే నంబర్- అంబర్‌పేట్ ఫ్లైఓవర్	సెప్టెంబర్	రూ.270 కోట్లు
ఖాజాగూడ టన్నెల్ ఎలివేటెడ్ కారిడార్	డిసెంబర్	రూ.1500కోట్లు
బయోడైవర్సిటీ ఫ్లైఓవర్	మార్చి	ప్రతిపాదన దశలో ఉన్నాయి
బైరామల్‌గూడ ఎడమవైపు ఫ్లైఓవర్	మార్చి	
ఎల్బీనగర్ కుడివైపు ఫ్లైఓవర్	మార్చి	
కామినేని కుడివైపు ఫ్లైఓవర్	మార్చి	

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపడం తోపాటు, రాజధానిలో సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థ తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్ఆర్‌డీపీ) పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 400 ఏండ్ల పురాతన నగరమైన హైదరాబాద్‌లో రవాణా వ్యవస్థ అభివృద్ధిపై గత ప్రభుత్వాలు పెద్దగా దృష్టి పెట్టలేదు. దీంతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ చిక్కులతో అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరవాసుల ఇబ్బందులు తీరుస్తూ అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో రూ.25 వేల కోట్ల వ్యయంతో కొత్త రహదారులను నిర్మిస్తున్నారు. ఎస్ఆర్‌డీపీలో భాగంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, కారిడార్ల నిర్మాణం, స్కైవేలు, మేజర్ కారిడార్లు, మేజర్ రోడ్ల నిర్మాణం, గ్రేడ్ సెపరేటర్లను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాలు పూర్తయితే మరో 10 ఏండ్ల వరకు నగరవాసులకు రహదారి ఇబ్బందులు తప్పనున్నాయి. ఈ మేరకు పక్కా ప్రణాళికతో జీహెచ్ఎంసీ పనులు చేపట్టింది. ప్రాజెక్టు పూర్తయితే సులభమైన ప్రయాణంతో పాటు రవాణా వ్యయం 28-30 శాతం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రూ.25వేల కోట్లతో చేపట్టే ఎస్ఆర్‌డీపీ పనుల్లో రూ.3,200 కోట్ల విలువైన పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది చివరినాటికి దశలవారీగా పనులు కానున్నాయి. ఇప్పటికే ఎస్ఆర్‌డీపీ తొలిదశ ఫలాలు ప్రజల చెంతకు చేరాయి. ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్‌ను ఈ నెల 3వ తేదిన ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు ప్రారంభించారు. ఈ ఏడాదిలో మరో 6 నిర్మాణాలు పూర్తి కానున్నాయి.

ఈ ఏడాది పూర్తయ్యే పనులు

మార్చి:	మైండ్ స్పేస్ అండర్ పాస్
మార్చి:	చింతల్‌కుంట అండర్‌పాస్
జూన్:	మైండ్ స్పేస్ ఫ్లైవర్
సెప్టెంబర్:	కామినేని ఎడమవైపు గల ఫ్లైఓవర్
డిసెంబర్:	రాజీవ్ గాంధీ ఫ్లైఓవర్
డిసెంబర్:	ఎల్బీనగర్ ఎడమవైపు అడర్‌పాస్



బయోడైవర్సిటీ పార్క్ వద్ద కొనసాగుతున్న ఫ్లైఓవర్ పనులు

● 'స్వచ్ఛ' ముగ్గులు



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నగరంలోని పబ్లిక్ టాయిలెట్లు, ఓపెన్ గార్బేజ్ పాయింట్ల వద్ద జీహెచ్ఎంసీ కార్మికులు అందమైన ముగ్గులు వేసి అలంకరించారు. చెత్తను ఇండ్లలోనే తడి, పొడిగా వేరుచేయాలని, కుండీల్లోనే వేయాలని, బహిరంగ మల, మూత్ర విసర్జన చేయొద్దని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాన్ని జోనల్ డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షించగా, అధికారులు, కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎల్బీనగర్‌లో కార్మికులు ముగ్గులు వేసి స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగస్వాములు కావాలని ప్రజలను కోరుతున్న దృశ్యమిది.

చిరుద్యోగి పెద్ద మనసు

- భర్త పేరుతో ట్రస్ట్ ఏర్పాటు
- ఆపదలో ఉన్నవారికి సాయం
- పలు జాతీయ అవార్డులు సొంతం



అవార్డులతో బిట్ల సుజాత

సుల్తాన్‌బజార్: చేసేది చిరుద్యోగమైనా సేవా కార్యక్రమాల్లో ఆమెది పెద్ద చేయి. భర్త అకాల మరణంతో ఆయన పేరుతో సొంతగా ఓ ట్రస్ట్ ఏర్పాటు చేసి అపదలో ఉన్నవారికి చేయూతనందిస్తూ ఆయన ఆశయాలను కొనసాగిస్తున్నది. ఆమె హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బిట్ల సుజాత. ఆమె భర్త డాక్టర్ నర్సింగరావు వైద్యుడిగా పని చేసేవారు. తన క్లినిక్‌కు వచ్చే పేద రోగులకు ఉచిత వైద్యం అందించేవారు. ఆయన 2006లో గుండెపోటుతో మృతి చెందడంతో భర్త ఆశయాలను కొనసాగించాలని నిర్ణయించుకొని 'డాక్టర్ బిట్ల నర్సింగరావు ఫౌండేషన్'ను ఏర్పాటు చేశారు. తనకు వచ్చే జీతంలో అవసరాల మేరకు వాడుకొని మిగతా డబ్బును సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ఫౌండేషన్ రాష్ట్ర వ్యాప్తంగా సేవలు అందిస్తున్నది. పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆమెకు తోడుగా నిలుస్తున్నారు.

మహిళలకు వృత్తి శిక్షణ

మహిళా సాధికారత కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని శిక్షణ సంస్థలో హౌస్ కీపింగ్, కుకింగ్, టై అండ్ డై, హ్యాండ్ మేడ్ వర్క్స్, కంప్యూటర్ శిక్షణ వంటి రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. అంతేకాకుండా సుజాత ప్రతి శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పంజాగుట్ట ప్రాంతంలో ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. పేద ప్రజలకు సహాయపడటంలో తృప్తి ఉన్నదని, ఫౌండేషన్ సేవలను మరింత విస్తృత పరుస్తామని సుజాత తెలిపారు.

అనేక అవార్డులు

ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన భారతీయ దళిత సాహిత్య అకాడమీ గత ఏడాది డిసెంబర్ 9,10 తేదీల్లో ఢిల్లీలో జరిగిన 33వ సదస్సులో సుజాతకు 'నేషనల్ అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు'ను అందించింది. 2016లో కేంద్ర మంత్రి పాశ్వాన్ చేతుల మీదుగా 'సావిత్రిబాయిపూలే నేషనల్ ఫెలోషిప్'ను అందుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో భారతీయ దళిత సాహిత్య అకాడమీ రాష్ట్ర శాఖ 'బాబు జగ్జీవన్‌రామ్' అవార్డును అందించింది. టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖతో సహా పలు స్వచ్ఛంద సంస్థలు సుజాత సేవలను గుర్తించి సన్మానించాయి.

ఏడాదిలో యాచకులు లేని నగరంగా హైదరాబాద్

సమాచారం ఇస్తే రూ.వెయ్యి బహుమతి: జైళ్లశాఖ డీజీ వీకే సింగ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏడాదిలో యాచకులు, మానసిక స్థితి కోల్పోయి రహదారులపై జీవనం సాగిస్తున్న వారు లేని నగరంగా హైదరాబాద్‌ను మారుస్తామని జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ తెలిపారు. యాచకులు లేని నగరంగా మార్చే ప్రక్రియకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదన్నారు. ఆయా ప్రాంతాల్లో యాచక వృత్తిలో కొనసాగుతున్న వారి వివరాలను జైళ్లశాఖ అధికారులకు అందిస్తున్నారన్నారు. నగరంలో యాచక వృత్తి, మానసికస్థితి కోల్పోయి రహదారుల పక్కన జీవనం సాగిస్తున్నవారికి ఆశ్రయం కల్పించే లక్ష్యంతో జైళ్లశాఖ నవంబర్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించింది. నెల రోజుల్లోనే 1,500 మంది యాచకులను చేరదీసి ఆశ్రయం కల్పించారు. వెయ్యి మందిని వారి కుటుంబసభ్యులతో కలుపగా మిగతావారు ఆనందాశ్రమంలో ఉన్నారు. ఈ నెలలో ఇప్పటివరకు165 మందిని తీసుకొచ్చి ఆనందాశ్రమంలో ఉంచారు. గ్రేటర్ పరిధిలో ఉన్న యాచకులకు సంబంధించిన సమాచారం ఇచ్చినవారికి ప్రస్తుతం రూ.500 నగదు బహుమతిగా ఇస్తున్నామని, ఇప్పటివరకు ఏడుగురికి ఇచ్చామని డీజీ తెలిపారు. సంక్రాంతి నుంచి ఈ నగదు రూ.1,000కు పెంచుతున్నట్టు వివరించారు. చాలా మంది స్వచ్ఛందంగానే సమాచారం ఇస్తున్నారని బహుమతి తీసుకోవడం లేదని చెప్పారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్యాంకర్లు, కార్లు, బైకులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న జాయింట్ సీపీ తరుణ్‌జోషి

ఎగిసిపడిన అక్రమ దందా

- మేడిపల్లి ట్యాంకర్ల పేలుడు ఘటనలో ఇద్దరి అరెస్ట్
- చెంగిచెర్ల చౌరస్తా, కొర్రెములలో ఇంధనం చోరీ అడ్డాలు
- కోట్లకు పడగలెత్తిన నిర్వాహకులు
- సొంతంగా 13 ట్యాంకర్లు, ఉద్యోగులు

మేడిపల్లి: తండ్రి ప్రారంభించిన అక్రమ ఇంధన దందాను ఇద్దరు అన్నాతమ్ముళ్లు వారసత్వంగా పొంది ఏకంగా ఓ ముఠానే తయారు చేశారు. డీజిల్, పెట్రోల్ ట్యాంకర్ల ఓనర్లు, డ్రైవర్లను మచ్చికచేసుకుని రోజూ వందలలీటర్లు సేకరిస్తూ రూ.కోట్లకు పడుగలెత్తారు. సొంతంగా ట్యాంకర్లను కొనుగోలు చేసి, ఉద్యోగులను నియమించుకొనే స్థాయికి ఎదిగారు. శుక్రవారం హైదరాబాద్ శివారులోని మేడిపల్లి మండలం చెంగిచెర్ల చౌరస్తా వద్ద డీజిల్ దొంగిలిస్తుండగా రెండు ట్యాంకర్లు పేలిన ఘటనలో ప్రధాన నిందితులు కునాల్ రాజు, జగదీశ్ సృష్టించిన అక్రమ దందా స్వరూపమిది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఆదివారం ఇద్దరిని అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 10 పెట్రోల్ ట్యాంకర్లు, 2 కార్లు, 2 బైకులు, 2 సెల్‌ఫోన్లు, రూ.7.49 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో రాచకొండ జాయింట్ సీపీ తరుణ్‌జోషి వివరాలు వెల్లడించారు. కర్ణాటకకు చెందిన సోదరులు కునాల్ రాజు(37), జగదీశ్(34) తమ కుటుంబంతో సహా వలసవచ్చి చెంగిచర్లలో నివాసం ఉంటున్నారు. వారి తండ్రి బాబూరావు మేడిపల్లి-చెంగిచర్ల దారిలో పదేండ్ల కిందట ట్యాంకర్ల నుంచి అక్రమంగా ఇంధనం సేకరించి, విక్రయించే దందాను ప్రారంభించారు. తండ్రి బాటలోనే నడిచిన ఇద్దరు కొడుకులు దందాను పెద్ద ఎత్తున విస్తరించారు. నగరంలోని ఐవోసీ, హెచ్‌పీసీఎల్ కేంద్రాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్‌బంక్‌లకు వెళ్లే ట్యాంకర్ల యజమానులు, డ్రైవర్లను మచ్చికచేసుకుని ఇంధనాన్ని దొంగిలించేవారు. వారికి కొంత ముట్టజెప్పి ఆ ఇంధనాన్ని పరిసర గ్రామాల్లో చిరువ్యాపారులకు ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ముచేసుకునేవారు. చెంగిచెర్ల చౌరస్తా, ఘట్‌కేసర్ మండలం కొర్రెములలో ఖార్ఖానాలు ఏర్పాటు చేశారు. ట్యాంకర్లను నేరుగా అందులోకి పంపి డీజిల్‌ను దొంగిలిస్తున్నారు. ఒక్కోట్యాంకర్ నుంచి 300-400 లీటర్ల ఇంధనం తీసేవారు. అక్రమ దందాతో నిర్వాహకులు రాజు, జగదీశ్ కోట్లు కూడబెట్టుకున్నారు. సొంతంగా 13 ట్యాంకర్లను కొనుగోలు చేసి భారీస్థాయిలో పెట్రోల్, డీజిల్, కిరోసిన్‌ను నిల్వచేయడం ప్రారంభించారు. నిర్వహణ కోసం ఉద్యోగులను నియమించుకొని వారికి నెలకు రూ.వేల చొప్పున జీతం చెల్లిస్తున్నారు.

సీల్‌ను గ్యాస్ కట్టర్‌తో తొలిగిస్తుండగా...

నిందితులు మేడిపల్లి వద్ద ఏర్పాటుచేసిన అక్రమ కార్ఖానాలో శుక్రవారం కాకినాడ నుంచి ఎస్సార్‌నగర్‌లోని పెట్రోల్ బంక్‌కు వెళ్తున్న ట్యాంకర్ నుంచి డీజిల్‌ను తీసేందుకు యత్నించారు. సీల్ తెరుచుకోకపోవడంతో గ్యాస్ వెల్డింగ్ సహాయంతో తెరిచేందుకు యత్నించారు. వెల్డింగ్ చేస్తుండగా నిప్పురవ్వలు డీజిల్ ట్యాంకర్‌పై పడడంతో ఒక్కసారి పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. రహదారిపై డీజిల్ చిమ్మడంతో 15 మందికి గాయాలయ్యాయి. సమీపంలోని దుకాణాలు, నాలుగు బైక్‌లు కాలి బూడిదయ్యాయి. కార్ఖానాలో నిందితులకు సహకరిస్తున్న ఖాదీర్, షర్ఫొద్దీన్, నవీన్‌తోపాటు, మరికొందరు పరారీలో ఉన్నారు. కొర్రెములలోని అడ్డాలో నిల్వ ఉంచిన 300 లీటర్ల కిరోసిన్, 400 రబ్బర్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు జాయింట్ సీపీ తెలిపారు. ఇలాంటి సంఘటన జరుగడం దక్షిణ భారత దేశంలోనే మొదటిసారన్నారు. నిందితులకు చమురు సంస్థల సిబ్బంది, పెట్రోల్ బంకుల యజమానులతో సంబంధాలపై దర్యాప్తు చేస్తు న్నామన్నారు. కమిషనర్ మహేశ్ భగవత్ ఆదేశాల మేరకు మేడిపల్లి పోలీసులతో సంబంధాలపైనా ఆరా తీస్తున్నామన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వరశర్మ, ఏసీపీ గోనె సందీప్‌కుమార్, సీఐ జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

'టీఎస్ కాప్'పై జిల్లాల్లో శిక్షణ

- యాప్ ఫలితాల్లో ఆదర్శంగా నిలిచిన పంజాగుట్ట పీఎస్
- వచ్చే ఏడాది మూడు అవార్డులు లక్ష్యం: డీజీపీ మహేందర్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా ఉత్తమ రెండో పోలీసుస్టేషన్‌గా నిలిచిన పంజాగుట్ట పోలీసు స్టేషన్ రాష్ట్ర పోలీసుశాఖకు తలమానికంగా నిలిచింది. నిత్యం ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొంటూనే, టెక్నాలజీ సహాయంతో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నివారణ, ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం, క్షణాల్లో స్పందించడం, ఫలితాలపై అధ్యయనం చేసేందుకు దేశం మొత్తం పంజాగుట్ట పీఎస్ వైపు చూస్తున్నది. అత్యాధునిక పోలీసింగ్‌లో భాగంగా నిర్వహించిన ప్రయోగంలో ఇది సాధించిన విజయమని.. వచ్చే ఏడాది మూడు ఉత్తమ అవార్డులు రాష్ట్రానికే దక్కేలా డీజీపీ మహేందర్‌రెడ్డి కార్యాచరణ ప్రారంభించారు. పంజాగుట్టలో అమలుచేస్తున్న విధి విధానాలపై కొందరు పోలీసు అధికారులకు శిక్షణ ఇప్పించారు. వారితో రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ ఇప్పించే కార్యక్రమాలు మొదలుపెట్టనున్నారు. సిటీలో గత ఏడాది హైదరాబాద్ కాప్స్ మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టి ప్రయోగాలు ప్రారంభించారు. ప్రభుత్వ ప్రోత్సాహం, పోలీసు ఉన్నతాధికారులు సహాయంతో ఆశించిన ఫలితాలు రావడంతో ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయాలని నిర్ణయించారు. పోలీసు సేవలకు సంబంధించిన 54 అంశాలపై ప్రత్యేకంగా టీఎస్ కాప్‌యాప్‌ను రూపొందించారు. కమిషనరేట్‌స్థాయిలో దీనిని వినియోగిస్తున్నారు. యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించారు. పాఠ్యాంశం తరహాలో బోధిస్తే సిబ్బందిలో అవగాహన రాదని.. పంజాగుట్ట పోలీసును ఆదర్శంగా తీసుకుంటున్నారు. ఈ స్టేషన్‌లోని పనిచేస్తున్న సిబ్బంది అమలుచేస్తున్న తీరు, సాధిస్తున్న ఫలితాలను ప్రత్యేకంగా వివరించి, ఫలితాలు రాబట్టే ప్రయత్నాలను చేస్తున్నారు. తొలుత జిల్లాల నుంచి కొందరిని ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ తీసుకున్న సిబ్బంది వారి జిల్లాలకు వెళ్లి, అక్కడి మిగతా సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ యాప్ వినియోగం ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్.. పోలీసుశాఖలోని అన్ని విభాగాలకు కీలకంగా మారనుందన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రెండువేల టీఎస్ కాప్ యాప్ ఉన్న ట్యాబ్‌లు పనిచేస్తుండగా.. శిక్షణ పూర్తయిన పోలీసుస్టేషన్‌లకు కూడా ట్యాబ్‌లను అందజేయనున్నారు. 2018లో ఈ యాప్ ట్యాబ్‌లు రాష్ట్రవ్యాప్తంగా వినియోగంలోకి రావడంతో పంజాగుట్ట తరహాలో ఫలితాలు సాధిస్తామని డీజీపీ చెప్తున్నారు.

మహిళపై క్యాబ్ డ్రైవర్ అత్యాచారయత్నం

- బాలిక కిడ్నాప్ యత్నం కేసులోనూ నిందితుడు
- నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

మేడిపల్లి: మహిళపై అత్యాచారయత్నం చేసి మరో బాలికను కిడ్నాప్ చేసిన ఓలా క్యాబ్ డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో రాచకొండ జాయింట్ సీపీ తరుణ్‌జోషి.. ఎస్‌వోటీ అడిషనల్ డీసీపీ రఫీక్, కుషాయిగూడ సీఐ చంద్రశేఖర్‌తో కలిసి ఆదివారం మీడియాకు వివరాలను వెల్లడించారు. సికింద్రాబాద్ లాలాపేట శాంతినగర్‌కు చెందిన కంకూరి నాగమధుకిరణ్ (29) ఓలా కారు డ్రైవర్ నడుపుతుంటాడు. ఈ నెల 5వ తేదీన రాత్రి 11 గంటలకు కారులో వెళ్తుండగా కుషాయిగూడ రాధికా చౌరస్తాలో ఒంటరిగా ఓ మహిళ కనిపించగా ఆమెను సైనిక్‌పురిలో దింపుతానని ఎక్కించుకున్నాడు. ఏఎస్‌రావునగర్ హుడా పార్కు వద్ద నుంచి వెళుతుండగా ఆమె అనుమానంతో ఇటెందుకు వెళ్తున్నావని ప్రశ్నించింది. తన స్నేహితుడు వస్తాడని చెప్పి కారుడోర్ లాక్ చేసి ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. ఆమె అరవడంతో పరారయ్యాడు. ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదుచేసింది. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తుచేసి శనివారం క్యాబ్ డ్రైవర్‌ను అరెస్టుచేశారు. విచారణలో అతడు మరో కేసులో కూడా నిందితుడని తేలింది. ఇదే తరహాలో గత ఏడాది అక్టోబర్ 17న కాప్రా అశోక్‌కాలనీకి చెందిన 10 ఏండ్ల బాలిక తన తమ్ముడితో కలిసి వెళ్తుండగా ఆమెను అడ్రస్ అడుగుతున్నట్టు నటించి బైకుపై కైకూరు దర్గా వద్దకు తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక అరువడంతో పారిపోయాడు. కేసు ఛేదించిన ఏసీపీ కృష్ణమూర్తి, సీఐ చంద్రశేఖర్, ఎస్సైలు అశోక్‌కుమార్, శ్రీనులను.. జాయింట్ సీపీ అభినందించారు.

సిటీ బస్సుల్లో చిల్లర సమస్యకు చెక్!

నేటి నుంచి హైదరాబాద్, వరంగల్ సిటీ బస్సుల్లో చార్జీల హేతుబద్ధీకరణ

రూ.5, 10, 15... ధరల్లో చార్జీలు ● ఆర్డినరీ బస్సుల్లో కనిష్ఠ చార్జీ రూ.2 తగ్గింపు: ఆర్టీసీ ఎండీ రమణారావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరంగల్, హైదరాబాద్ ఆర్టీసీ సిటీ బస్సుల్లో నేటి నుంచి చిల్లర సమస్య బాధలు తీరనున్నాయి. రూ. ఒకటి, రెండు విషయంలో ప్రయాణికులు, కండక్టర్ల మధ్య గొడవలు జరుగుతుండటంతో సిటీ బస్సుల్లో చార్జీలను హేతుబద్ధీకరించాలని తెలంగాణ టీఎస్‌ఆర్టీసీ నిర్ణయించింది. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో తిరిగే ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ బస్సుల్లో సోమవారం నుంచి కొత్త చార్జీలను వసూలు చేయనున్నట్టు ఆర్టీసీ ఎండీ రమణారావు ఆదివారం తెలిపారు. హేతుబద్ధీకరణ నేపథ్యంలో సిటీ ఆర్డినరీబస్సుల్లో కనిష్ఠ చార్జీ రూ.7 నుంచి రూ.5కు తగ్గనున్నది. మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో కనిష్ఠ చార్జీ రూ.8 నుంచి 10కి, మెట్రో డీలక్స్‌లో రూ.9 నుంచి 10కి పెరగనున్నది. ఆర్డీనరి, మెట్రో ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల మూడు కేటగిరీల్లో కొన్ని స్టేజీలకు చార్జీ తగ్గుతుండగా.. కొన్నింటికి పెరుగుతున్నాయి. 40 కి.మీల పరిధిలో 20 స్టేజీలకు హేతుబద్ధీకరించిన చార్జీలను టీఎస్‌ఆర్టీసీ ప్రకటించింది. ఈ కొత్త చార్జీలు సోమవారం తొలి బస్సు (సర్వీసు) నుంచి అమల్లోకి రానున్నాయి. అధికారులు ఇటీవల విజయవాడ, విశాఖపట్నంలో అధ్యయనం చేసి చార్జీలు సవరించినట్టు టీఎస్‌ఆర్టీసీ అధికారికవర్గాలు తెలిపాయి.

మారనున్న చార్జీల వివరాలు

ఆర్డినరీ బస్సుల్లో రూ.8,9,10,11గా ఉన్న టికెట్ చార్జీలు పెద్దలకు రూ.10, పిల్లలకు రూ.5గా వసూలు చేస్తారు. రూ.13, 15, 16,17 ఉన్న చార్జీలు రూ.15గా పెద్దలకు, పిల్లలకు రూ.10 తీసుకోనున్నారు. రూ.18, 19, 20, 21, 22 కలిగిన చార్జీల కేటగిరీలో పెద్దలకు రూ.20, రూ.10 పిల్లలకు, రూ. 23, 24, రూ.25, 26, 27గా ఉన్న చార్జీల కేటగిరీలో రూ.25 పెద్దలకు, రూ.15 పిల్లలకు, రూ.28గా ఉన్న చార్జీల క్యాటగిరీలో రూ.30 పెద్దలకు, రూ.15 పిల్లలకు టికెట్ ధరగా టీఎస్‌ఆర్టీసీ నిర్ణయించింది.

మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో రూ.8,10, 12 ఉన్న టికెట్ చార్జీలు పెద్దలకు రూ.10గా, పిల్లలకు రూ.10 తీసుకుంటారు. రూ.13, 14, 16, 17 ఉన్న చార్జీలు రూ.15గా పెద్దలకు, రూ.10గా చిన్న పిల్లలకు వసూలు చేస్తారు. రూ.18, 19, 20, 21, 22 టికెట్ ధర కలిగిన కేటగిరీ చార్జీలు రూ.20 పెద్దలకు, రూ.10 పిల్లలకు వసూలు చేస్తారు. రూ.23, 24, 25,26, 27గా ఉన్న చార్జీల కేటగిరీలో పెద్దలకు రూ.25, పిల్లలకు రూ.15గా నిర్ణయించారు. రూ.29, 30, 31గా ఉన్న చార్జీల కేటగిరీలో రూ.30 పెద్దలకు, రూ.15 పిల్లలకు చార్జీలు ఉంటాయి.

మెట్రోడీలక్స్‌లో రూ.9, 11గా ఉన్న చార్జీలు పిల్లలకు పెద్దలకు ఒకేవిధంగా రూ.10 ఉండనున్నది. రూ.13, 14,15, 17గా ఉన్న టికెట్ చార్జీలు పెద్దలకు రూ.15గా, పిల్లలకు రూ.10గా నిర్ణయించారు. రూ.18, 19, 20, 21, 22గా ఉన్న టికెట్ ధరను పెద్దలకు రూ.20గా, పిల్లలకు రూ.15 వసూలు చేయనున్నారు. రూ.23, 24, 25, 26గా ఉన్న కేటగిరీలో ఇకపై పెద్దలకు రూ.25, పిల్లలకు రూ.15 వసూలు చేస్తారు. రూ.28 ఉన్న టికెట్ ధరను రూ.30గా పెద్దలకు, రూ.15గా పిల్లలకు సిటీ బస్సుల్లో టికెట్ చార్జీలుగా వసూలు చేయనున్నారు.

2020-22 నాటికి జీడీపీ సగటు వృద్ధిరేటు 7.3 శాతం

మోర్గాన్ స్టాన్లీ అంచనా



న్యూఢిల్లీ, జనవరి 14: భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ముందుకు సాగుతుందని, 2020-22 నాటికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) సగటు వృద్ధిరేటు 7.3 శాతానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ తన అధ్యయన నివేదికలో స్పష్టం చేసింది. గత కొంత కాలం నుంచి భారత్‌లో సంస్థాగత వృద్ధిరేటు బలంగానే ఉందని, అందరూ ఊహిస్తున్నట్టుగానే ఈ ఏడాది నుంచి ప్రైవేటు పెట్టుబడుల వ్యయం ఊపందుకుంటుందని, దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన, సానుకూల వృద్ధి వలయంలోకి ప్రవేశించి, 2020-22 నాటికి జీడీపీ సగటు వృద్ధిరేటు 7.3 శాతానికి చేరుకుంటుందని భావిస్తున్నట్లు పేర్కొంది. అలాగే దేశంలో కార్పొరేట్ ఆదాయ అంచనాలు, బ్యాలెన్స్ షీట్లు మెరుగుపడుతున్నాయని, ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమై పెట్టుబడుల డిమాండ్‌ను అధిగమించగలుగుతుందని అభిప్రాయపడింది. '2018లో భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో పుంజుకునేందుకు రంగం సిద్ధమైంది. 2017లో 6.4 శాతంగా ఉన్న జీడీపీ వృద్ధిరేటు 2018లో 7.5 శాతానికి, 2019లో 7.7 పెరుగుతుందని మేము అంచనా వేస్తున్నాం' అని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది.

రైతులకు లాభించకపోతే వృద్ధిరేటుకు అర్థం లేదు: జైట్లీ

న్యూఢిల్లీ, జనవరి 14: ప్రభుత్వ తొలి ప్రాధాన్యత వ్యవసాయ రంగానికేనని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. రైతులకు లాభించని జీడీపీ వృద్ధి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్న ఆయన వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. పార్లమెంట్‌లో మరో రెండు వారాల్లో కొత్త బడ్జెట్‌ను జైట్లీ ప్రవేశపెడుతున్న విషయం తెలిసిందే. ఆదివారం ఇక్కడ ఎన్‌సీడీఈఎక్స్‌పై గార్‌సీడ్ (గోరుచిక్కుడు) ఆప్షన్స్ ట్రేడింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఎంసీఎక్స్ తర్వాత కమాడిటీస్‌లో ఆప్షన్స్ ట్రేడింగ్ మొదలైంది ఎన్‌సీడీఈఎక్స్‌లోనే అవగా, తొలి వ్యవసాయోత్పత్తి ఆప్షన్స్‌గా గార్‌సీడ్ నిలిచింది. ఇక ఈ సందర్భంగా జైట్లీ మాట్లాడుతూ.. రైతులకు ఈ సదుపాయం ప్రయోజనకరమని, రాబోయే రోజుల్లో అత్యుత్తమ ధరలు పొందడానికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే రైతులు ఆనందంగా లేనప్పుడు, సంతృప్తి చెందనప్పుడు.. అధిక వృద్ధిరేటు శూన్యమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) దేశ జీడీపీ నాలుగేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 6.5 శాతంగా నమోదవుతుందని ఇటీవలే కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌వో) అంచనా వేసిన సంగతి విదితమే. తయారీ, వ్యవసాయ రంగాల నిరాశాజనక ప్రదర్శనే కారణమని సీఎస్‌వో వివరించింది. ఈ నేపథ్యంలో జైట్లీ తాజా వ్యాఖ్యలు రాబోయే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయవచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

అమెజాన్‌లో 6,500 ఉద్యోగాలు

తాత్కాలికంగా నియమించుకోనున్న ఈ-కామర్స్ దిగ్గజం

20 నుంచి 'గ్రేట్ ఇండియన్ సేల్' ప్రారంభం



న్యూఢిల్లీ, జనవరి 14: ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా త్వరలో 6,500 మందికి పైగా తాత్కాలిక ఉద్యోగులను చేర్చుకోనున్నది. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న 'గ్రేట్ ఇండియన్ సేల్' కోసం ఆ సంస్థ ఈ ఉద్యోగులను నియమించుకోనున్నది. వీరిలో 5,500 మందికి పైగా ఉద్యోగులను అమెజాన్ ఇండియా పరిధిలోని నెట్‌వర్క్ సెంటర్లు, సార్టేషన్ సెంటర్లు (వచ్చిన ఆర్డర్లను పరిశీలించి వస్తువులను పంపిణీకి సిద్ధం చేసే కేంద్రాలు), డెలివరీ స్టేషన్లలో (బట్వాడా కేంద్రాల్లో) చేర్చుకోబోతున్నట్లు అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ ఫుల్‌ఫిల్‌మెంట్) అఖిల్ సక్సేనా పీటీఐ వార్తా సంస్థకు వివరించారు. ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా అమెజాన్ గ్రేట్ ఇండియన్ సేల్‌కు వినియోగదారుల నుంచి విస్తృతమైన స్పందన లభిస్తుందని ఆశిస్తున్నామని, దీనిని దృష్టిలో ఉంచుకుని డిమాండ్‌కు అనుగుణంగా వినియోగదారుల అవసరాలను తీర్చేందుకు తమ కస్టమర్ సర్వీస్ సైట్స్‌లో తాత్కాలికంగా మరో వెయ్యి మంది ఉద్యోగులను నియమించుకోబోతున్నామని, హైదరాబాద్, బెంగళూరు సహా అన్ని మహా నగరాల్లో ఈ నియామకాలు జరుగుతాయని ఆయన చెప్పారు. ఈ నియామకాల ద్వారా తమ సంస్థకు మరింత బలం చేకూరడంతో పాటు వినియోగదారులకు వేగవంతంగా వస్తువులను బట్వాడా చేయడానికి వీలవుతుందన్నారు. ప్రస్తుతం అమెజాన్ ఇండియాకు దేశ వ్యాప్తంగా 41 ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు (వేర్‌హౌస్‌లు), 25కు పైగా సార్టేషన్ సెంటర్లు, దాదాపు 150 డెలివరీ స్టేషన్లు, మరో 350 వరకూ సర్వీస్ పార్టనర్ స్టేషన్లు ఉన్నాయి.

ర్యాంకులను మళ్లీ లెక్కించాలి!

ఈవోడీబీపై ప్రపంచ బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త పాల్ రోమర్

వాషింగ్టన్, జనవరి 14: ప్రపంచ బ్యాంకు జారీచేస్తున్న సులభతర వ్యాపార నిర్వహణ (ఈవోడీబీ) ర్యాంకులను కనీసం గడిచిన నాలుగేండ్ల నుంచైనా మరోసారి గణించి, సవరించాల్సిన అవసరం ఉందని దాని ప్రధాన ఆర్థికవేత్త పాల్ రోమర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ప్రక్రియ కూడా మొదలైందన్నారు. వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రపంచ బ్యాంకు ఈవోడీబీ ర్యాంకులపై కీలక వ్యాఖ్యలు చేసిన రోమర్.. 2014లో 34వ స్థానంలో ఉన్న చిలీకి 2017లో 57వ ర్యాంకు రావడంపట్ల వ్యక్తిగతంగా క్షమాపణలు కోరడం గమనార్హం. 2014లో భారత్‌కు 140వ స్థానం ఉండగా, 2017లో 100 ర్యాంకు దక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రోమర్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మెరుగైన ఫలితాలు వస్తే ప్రపంచ దేశాలు గర్వంగా చెప్పుకునే ఈ ర్యాంకులకు అసలు విశ్వసనీయత, ప్రామాణికతనేది ఉందా? అన్న అనుమానాలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి.

ర్యాంకులు నమ్మదగినవే: ప్రపంచ బ్యాంకు

తమ ప్రధాన ఆర్థికవేత్తే ఈవోడీబీ ర్యాంకుల విశ్వసనీయతను, ప్రామాణికతను అనుమానించేలా వ్యాఖ్యానించడంతో ప్రపంచ బ్యాంకు స్పందించింది. కేవలం ఏ ఒక్క దేశాన్నో దృష్టిలో పెట్టుకుని ర్యాంకుల గణన విధానాన్ని, సూచనలను రూపొందించలేదని స్పష్టం చేసింది. రోమర్ అన్నట్లుగా ర్యాంకులు తప్పుదోవ పట్టించేలా ఏమీ లేవని ఓ ప్రకటనలో స్పష్టం చేసిన బ్యాంకు.. అన్ని దేశాలు తమకు సమానమేనని ప్రకటించింది.



80సీ పరిమితి పెంపు?

మధ్యతరగతి, వేతన జీవులకు ఊరట.. మరింతగా అందనున్న పన్ను ప్రయోజనాలు

న్యూఢిల్లీ, జనవరి 14: మధ్యతరగతి వర్గాలు, ముఖ్యంగా వేతన జీవులకు, స్వల్ప పెట్టుబడులకు ఆసక్తి కనబరిచే సగటు మదుపరులకు రాబోయే బడ్జెట్.. వరాల జల్లును కురిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.2.50 లక్షల నుంచి కనిష్ఠంగా రూ.3 లక్షలకు, గరిష్ఠంగా 5 లక్షలకు పెంచే వీలుందని తెలుస్తుండగా, ఇప్పుడు సెక్షన్ 80సీ పరిమితిని కూడా పెంచే సంకేతాలు అగుపిస్తున్నాయి. ఇదే జరిగితే పన్ను చెల్లింపుదారులకు మరింత ప్రయోజనాలు అందడం ఖాయం. ఆదాయ పన్ను చట్టం, 1961లో సెక్షన్ 80సీ అనేది ప్రాథమికంగా ఓ పెట్టుబడి ఆధారిత పన్ను శ్లాబ్. ప్రస్తుతం సెక్షన్ 80సీలో వార్షిక స్థూల ఆదాయంలో రూ.1,50,000 వరకే పన్ను మినహాయింపు ఉన్నది. దీన్ని రూ.2 లక్షలకు పెంచుతారని అంచనా. చివరిసారిగా 2014-15 బడ్జెట్‌లో సెక్షన్ 80సీ పెట్టుబడి పరిమితిని లక్ష నుంచి లక్షన్నరకు పెంచారు.

ఎవరికి లాభం?

జీవిత బీమా, ఈక్విటీ సంబంధిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ), ఐదేండ్ల నోటిఫైడ్ ట్యాక్స్-సేవింగ్ బ్యాంక్ డిపాజిట్లు, ఐదేండ్ల కాలపరిమితి కలిగిన తపాలా శాఖ డిపాజిట్లు, సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం (ఎస్‌సీఎస్ఎస్), సుకన్య సమృద్ధి ఖాతా, ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్) తదితర వాటిల్లో పెట్టుబడులకు సెక్షన్ 80సీ పన్ను రాయితీలు వర్తిస్తాయి. అంతేగాక ట్యూషన్ ఫీజులు, గృహ రుణాల చెల్లింపులపైనా ప్రయోజనం చేకూరుతుంది. ప్రధానంగా హోమ్ లోన్‌పై ప్రిన్సిపల్ అమౌంట్ చెల్లింపుల విషయంలో అదనపు ప్రయోజనం రూ.50,000 వరకు ఉంటుంది. అందుకే చాలామంది పన్ను చెల్లింపుదారులు సెక్షన్ 80సీ పరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరుగుతుండటంతో ఈసారి బడ్జెట్‌లో ఈ డిమాండ్ నెరవేరే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఈ పెంపు అధిక వేతన ఉద్యోగులకూ లాభమే. ఇదిలావుంటే పన్ను చెల్లింపుదారుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆదాయ అంచనాల స్వచ్ఛంధ నివేదిక ప్రతిపాదనను కేంద్రం ఉపసంహరించుకునే అవకాశాలున్నాయి.

పీఎంఏవైయూ కేటాయింపులు పెంచాలి


ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) అర్బన్ పథకానికి నిధులను మూడింతలు పెంచాలని గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కోరుతున్నది. ఈ పథకం కింద పేదలకు 1.2 కోట్ల ఇండ్ల నిర్మాణాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నందున మరిన్ని నిధులు అవసరమని ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెబుతున్నది. ఇప్పటిదాకా 37.5 లక్షల ఇండ్లకే ఆమోదం లభించిన విషయాన్ని గుర్తుచేస్తున్నది.

జీఎస్టీ తగ్గించాలి

రెరా, పాత పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి నిర్ణయాలతో తీవ్రంగా ప్రభావితమైన నిర్మాణ రంగం వచ్చే బడ్జెట్‌లో జీఎస్టీని తగ్గించి, మౌలిక రంగ హోదాను కల్పించాలని డిమాండ్ చేస్తున్నది. 2016లో 1,75,822 యూనిట్లను ప్రారంభించిన రియల్టర్లు.. 2017లో 1,03,570 యూనిట్లకు పరిమితమయ్యారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ సంస్కరణల కారణంగానే కొనుగోళ్ల సామర్థ్యం దెబ్బతిన్నదంటున్న రియల్ ఎస్టేట్ వర్గాలు.. రాబోయే బడ్జెట్‌లోనైనా పరిశ్రమ బలోపేతానికి చర్యలు చేపట్టాల్సిన అవసరముందని అంటున్నాయి.

ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టాలి

ఉద్యోగ కల్పనకు బడ్జెట్‌లో మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాయి వాణిజ్య, కార్మిక సంఘాలు. అలాగే రిటైల్ మార్కెట్‌లోకి విదేశీ సంస్థలను అనుమతించడం వల్ల ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని ఆందోళన సైతం వ్యక్తం చేస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద నోట్ల రద్దు నిర్ణయం ప్రతికూలమైందని జైట్లీతో జరిగిన బడ్జెట్ సంప్రదింపుల్లో తెలిపామని, ఉద్యోగ సృష్టికి ఊతమిచ్చే ప్రకటనలు చేయాలని కోరినట్లు ఏఐటీయూసీ వెల్లడించింది. మరోవైపు బడ్జెట్‌లో డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ) రేటును 10 శాతానికి హేతుబద్ధీకరించాలని పారిశ్రామిక సమాఖ్య సీఐఐ కోరింది.



సెక్షన్ 80సీ పరిమితి పెరుగుదల - ప్రభావం

	ప్రస్తుతం	ప్రతిపాదన	అదనపు పన్ను ప్రయోజనం
సెక్షన్ 80సీ పరిమితి	రూ.1,50,000	రూ.2,00,000	-----
పన్ను రేటు - 5 శాతం	రూ.7,725	రూ.10,300	రూ.2,575
పన్ను రేటు - 20 శాతం	రూ.30,900	రూ.41,200	రూ.10,300
పన్ను రేటు - 30 శాతం	రూ.46,350	రూ.61,800	రూ.15,450

గమనిక: 3 శాతం సర్‌చార్జీ కలుపుకొని

వేజ్ కోడ్ బిల్లు

ఈ ఏడాది కార్మిక సంస్కరణలకు వేజ్ కోడ్ బిల్లుతో నాంది పలుకాలని మోదీ సర్కారు భావిస్తున్నది. ఈ క్రమంలోనే రాబోయే బడ్జెట్ సెషన్‌లో వేజ్ కోడ్ బిల్లును ఆమోదింపజేసుకోవాలని చూస్తున్నది. ఈ నెలాఖర్లో మొదలయ్యే బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంట్ సెలెక్ట్ కమిటీ బిల్లును తీసుకువస్తుందన్న ఆశాభావాన్ని కార్మిక మంత్రిత్వ శాఖ వ్యక్తం చేస్తున్నది. గతేడాది ఆగస్టులో లోక్‌సభలోకి ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఇది కమిటీ పరిశీలనకు వెళ్లింది. పేమెంట్ ఆఫ్ వేజెస్ యాక్ట్ -1936, మినిమం వేజెస్ యాక్ట్ - 1949, పేమెంట్ ఆఫ్ బోనస్ యాక్ట్ - 1965, సమాన వేతన హక్కు చట్టం - 1976లను ఒక్కటి చేయాలనే సంకల్పంతో వచ్చినదే ఈ వేజ్ కోడ్ బిల్లు.

పీఎస్‌యూల్లోకి ఎయిర్ ఇండియా ఉద్యోగులు

అవకాశాలను పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వం

పెట్టుబడుల ఉపసంహరణకు చర్యలు వేగవంతం



న్యూఢిల్లీ, జనవరి 14: ఉద్యోగ సంఘాల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా నుంచి పెట్టుబడులను ఉపసంహరించేందుకు చర్యలను వేగవంతం చేస్తున్న నరేంద్ర మోదీ సర్కారు ఆ సంస్థ ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలను తొలగించేందుకు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నది. పెట్టుబడుల ఉపసంహరణ వలన ఎయిర్ ఇండియాలో ఉద్యోగాలను కోల్పోయే సిబ్బందిని ఇతర ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో చేర్చుకునేందుకు, వారికి స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) ప్యాకేజీని ఇచ్చేందుకు గల అవకాశాలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది. భారీ రుణ భారంతో సతమతమవుతున్న ఎయిర్ ఇండియాలో 49 శాతం మేరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) పెట్టేందుకు అనుమతించిన కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను సజావుగా పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నది. రూ.50 వేల కోట్లకు పైగా అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఎయిర్ ఇండియా ప్రస్తుతం దేశంలోని పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో ముందుకు సాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ విమానయాన సంస్థను పునరుద్ధరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణకు నిశ్చయించుకుంది. ఈ నిర్ణయాన్ని సజావుగా అమలు చేయడంలో భాగంగా ఎయిర్ ఇండియా ఉద్యోగులకు ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో చేరే అవకాశాన్ని కల్పించడం, వారికి వీఆర్ఎస్ ప్యాకేజీని ప్రకటించడం వంటి అంశాల గురించి కేంద్రం ఆలోచిస్తున్నదని, అయితే ఇందుకు సంబంధించిన తుది నిర్ణయాన్ని ఇంకా తీసుకోలేదని అధికార వర్గాలు వెల్లడించాయి. ఎయిర్ ఇండియా ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడేందుకు వేర్వేరు అంశాలు పరిశీలనలో ఉన్నాయని పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్ఎన్ చౌదరి పీటీఐ వార్తా సంస్థకు తెలిపారు. ఎయిర్ ఇండియా ఉద్యోగులకు వీఆర్ఎస్ ప్యాకేజీని ఇవ్వడంతో పాటు వారికి ప్రభుత్వ రంగ సంస్థల్లో చేరే అవకాశాన్ని కల్పించాలని కూడా కేంద్రం యోచిస్తున్నదా? అన్న ప్రశ్నకు ఆయన పై సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఎయిర్ ఇండియాతో పాటు దాని అనుబంధ సంస్థల్లో కాంట్రాక్టు సిబ్బంది సహా దాదాపు 29 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

భారత్‌కు 30వ ర్యాంకు

అంతర్జాతీయ ఉత్పత్తి సూచీలో..

జపాన్‌కు అగ్రస్థానం .. ఐదో స్థానంలో చైనా

న్యూఢిల్లీ/జెనీవా, జనవరి 14: ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్) తమ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండెక్స్ (అంతర్జాతీయ ఉత్పత్తి సూచీ)లో భారత్‌కు 30వ ర్యాంకు ఇచ్చింది. దీంతో భారత్ ఈ సూచీలో చైనా (5వ ర్యాంకు) కంటే దిగువన ఉన్నప్పటికీ బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) కూటమిలోని ఇతర దేశాల కంటే ముందు నిలిచింది. అత్యుత్తమ ఉత్పత్తి వ్యవస్థలను కలిగి ఉండి భవిష్యత్తులో ప్రపంచ అవసరాలను తీర్చేందుకు సిద్ధంగా ఉన్న దేశాలతో డబ్ల్యుఈఎఫ్ తొలిసారి ఈ నివేదికను రూపొందించింది. ఈ సూచీలో జపాన్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఉత్పత్తి వ్యవస్థతో జపాన్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, ఆ తర్వాత వరుసగా దక్షిణ కొరియా, జర్మనీ, స్విట్జర్లాండ్, చైనా, చెక్ రిపబ్లిక్, అమెరికా, స్వీడన్, ఆస్ట్రియా, ఐర్లాండ్ టాప్-10లో చోటు దక్కించుకున్నాయి. బ్రిక్స్ దేశాల్లో రష్యాకు ఈ సూచీలో 35వ ర్యాంకు లభించగా, బ్రెజిల్ 41వ స్థానంలోనూ, దక్షిణాఫ్రికా 45వ స్థానంలోనూ నిలిచాయి. ప్రపంచంలోని ఆధునిక పారిశ్రామిక వ్యూహాలను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించిన డబ్ల్యుఈఎఫ్.. ఉత్పత్తి రంగంలో ముందున్న 100 దేశాలను నాలుగు గ్రూపులు (లీడింగ్, హై పొటెన్షియల్, లెగసీ, నాస్కెంట్)గా విభజించింది. బలమైన, భవిష్యత్ అవసరాలకు అత్యున్నత స్థాయిలో సిద్ధంగా ఉన్న ఉత్పత్తి వ్యవస్థలను కలిగివున్న దేశాలను లీడింగ్ గ్రూపులోనూ, ప్రస్తుతం పునాదులు బలహీనంగా ఉన్నప్పటికీ భవిష్యత్తులో సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అనువైన ఉత్పత్తి వ్యవస్థలను కలిగివున్న దేశాలను హై పొటెన్షియల్ గ్రూపులోనూ, ప్రస్తుతం పునాదులు బలంగా ఉన్నప్పటికీ భవిష్యత్తులో ఇబ్బందులకు ఆస్కారమున్న ఉత్పత్తి వ్యవస్థలను కలిగివున్న దేశాలను లెగసీ గ్రూపులోనూ, ప్రస్తుతం పునాదులు బలహీనంగా ఉండి, భవిష్యత్తు అవసరాలకు తక్కువ స్థాయిలో సన్నద్ధమైన ఉత్పత్తి వ్యవస్థలను కలిగివున్న దేశాలను నాస్కెంట్ గ్రూపులోనూ చేర్చింది. భారత్‌తో పాటు హంగరీ, మెక్సికో, ఫిలిప్పీన్స్, రష్యా, థాయిలాండ్, టర్కీ తదితర దేశాలకు లెగసీ గ్రూపులోనూ, చైనాకు లీడింగ్ గ్రూపులోనూ, బ్రెజిల్, దక్షిణాఫ్రికాలను నాస్కెంట్ గ్రూపులోనూ చోటు కల్పించింది.



ఆర్థిక గణాంకాలే దిక్సూచి

పెట్టుబడులను ప్రభావితం చేయనున్న కార్పొరేట్ ఫలితాలు

ద్రవ్యోల్బణం, ముడి చమురు ధరలూ కీలకమే

న్యూఢిల్లీ, జనవరి 14: త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, టోకు ధరల సూచీ (డబ్ల్యుపీఐ) ద్రవ్యోల్బణం గణాంకాలు, బడ్జెట్ అంచనాలు ఈ వారం స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్‌ను ప్రభావితం చేస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2017-18) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, విప్రో, హిందుస్థాన్ యునీలివర్, యెస్ బ్యాంక్, కొటక్ మహీంద్రా, అదానీ గ్రూప్ సంస్థలు తమ ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తున్నాయి. ఇక ఇదే వారం డబ్ల్యుపీఐ గణాంకాలు వెలువడనుండగా, గత శుక్రవారం విడుదలైన పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ), రిటైల్ ధరల సూచీ (సీపీఐ) ద్రవ్యోల్బణం గణాంకాలూ ఈ వారం మార్కెట్ తీరుపై ప్రభావం చూపవచ్చని అంటున్నారు. ఇన్ఫోసిస్ ఫలితాలు కూడా మదుపరుల పెట్టుబడులను ప్రభావితం చేయవచ్చన్నారు. మరోవైపు ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, గ్లోబల్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు.. భారతీయ మార్కెట్లను నిర్దేశించగలవని విశ్లేషకులు పేర్కొంటున్నారు. గత వారం సెన్సెక్స్ 438.54 పాయింట్లు, నిఫ్టీ 122.40 పాయింట్లు లాభపడిన విషయం తెలిసిందే.

రెండు ఐపీవోలు

మంగళవారం ఐటీ సంస్థ న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ఐపీవో రానుండగా, బుధవారం కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరర్ అంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఐపీవో రానున్నది. దాదాపు రూ.424 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యంగా వస్తున్న న్యూజెన్ ఐపీవో.. 18న ముగియనున్నది. షేర్ ధరల శ్రేణి రూ.240-245గా ఉంది. ఇక రూ.555 కోట్ల నిధుల సేకరణే ధ్యేయంగా వస్తున్న అంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఐపీవో.. 19న ముగుస్తుంది. దీని షేర్ల ధరల శ్రేణి రూ.855-859గా నిర్ణయించారు.

మార్కెట్ సంపద రయ్.. రయ్

టాప్-10 సంస్థల్లో తొమ్మిదింటి మార్కెట్ విలువ గత వారం రూ.66,619 కోట్లు ఎగిసింది. ఎస్‌బీఐ మినహా టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ, ఓఎన్‌జీసీ, మారుతి సంస్థల షేర్ల విలువ రూ.66,619.4 కోట్లు ఎగబాకింది. ఎస్‌బీఐ విలువ మాత్రం రూ.3,798.11 కోట్లు క్షీణించింది. టాప్-10 కంపెనీల్లో రూ.5,99,624.55 కోట్లతో రిలయన్స్ ముందుండగా, తర్వాతి స్థానంలో టీసీఎస్ ఉన్నది.

ఎఫ్‌పీఐల హుషారు

ఈ నెలలో ఇప్పటిదాకా దేశీయ మార్కెట్లలోకి విదేశీ మదుపరులు తీసుకొచ్చిన పెట్టుబడుల విలువ రూ.5,252 కోట్లుగా నమోదైంది. స్టాక్ మార్కెట్లలోకి రూ.2,172 కోట్లు రాగా, రుణ మార్కెట్లలోకి రూ.3,080 కోట్లు వచ్చాయి. కార్పొరేట్ సంస్థలు ఆకర్షణీయమైన లాభాలను అందుకుంటుండటంతో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) పెట్టుబడులకు ఆసక్తి కనబరుస్తున్నారు.

కార్పొరేట్ బాండ్ల రికార్డు

గతేడాది బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లలో కార్పొరేట్ డెట్ సెక్యూరిటీస్ లావాదేవీలు 37 శాతం పెరుగగా, రికార్డు స్థాయిలో రూ.17.72 లక్షల కోట్లుగా నమోదయ్యాయని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ తెలిపింది. 2016లో దాదాపు రూ.13 లక్షల కోట్లకే పరిమితమైయ్యాయి. అయితే బ్యాంకుల కంటే క్యాపిటల్ మార్కెట్లలోనే రాబడి ఎక్కువగా ఉండటంతో 2017లో కార్పొరేట్ బాండ్లకు విపరీతమైన ఆదరణ కనిపించినట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఎంఎఫ్‌లకు ఎస్ఐపీ కిక్కు

మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)ల్లో పెట్టుబడుల కోసం రిటైల్ మదుపరులు ఎక్కువగా సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్ఐపీ)ను ఎంచుకుంటున్నారు. దీంతో దీని ద్వారా ఎంఎఫ్‌ల్లోకి గత నెల డిసెంబర్‌లో వచ్చిన పెట్టుబడుల విలువ రూ.6,222 కోట్లుగా నమోదైంది. ఫలితంగా మొత్తం గతేడాది వచ్చిన పెట్టుబడులు రూ.59,000 కోట్లను దాటిపోగా, 2016లో వచ్చినవి సుమారు రూ.40,000 కోట్లుగానే ఉన్నాయని భారతీయ మ్యూచువల్ ఫండ్స్ సంఘం తెలియజేసింది.

పీ-నోట్లకు తగ్గిన ఆదరణ

గతేడాది నవంబర్‌లో పార్టిసిపేటరీ నోట్ల (పీ-నోట్స్) ద్వారా దేశీయ క్యాపిటల్ మార్కెట్లలోకి వచ్చిన పెట్టుబడుల విలువ రూ.1,28,639 కోట్లకు తగ్గింది. అంతకుముందు నెల రూ.1,31,006 కోట్లుగా ఉంది. భారతీయ క్యాపిటల్ మార్కెట్లలో నేరుగా పెట్టుబడులు పెట్టలేని విదేశీ సంస్థలు.. ఎఫ్‌పీఐల ద్వారా పెట్టే పెట్టుబడులకు సదరు ఎఫ్‌పీఐలు జారీ చేసేవే పీ-నోట్లు.

స్టాక్ మార్కెట్‌లో 'బుల్' జోష్

సెన్సెక్స్ దూకుడు

2007లో 51సార్లు సరికొత్త స్థాయిలను తాకిన సెన్సెక్స్.. 2017లో 62సార్లు చేరింది.

చిన్న షేర్లు అదుర్స్

2005-07లో మదుపరులకు 232 శాతం లాభాలను అందించిన చిన్న షేర్లు.. 2013 సెప్టెంబర్ నుంచి ఇప్పటిదాకా 380 శాతం ప్రతిఫలాన్నిచ్చాయి.

మదుపరుల సంపద

మదుపరుల పెట్టుబడుల జోరుతో ఆయా సంస్థల సంపద 52 శాతం ఎగబాకి 2.38 లక్షల కోట్ల డాలర్లకు చేరింది.

ఎమర్జింగ్ మార్కెట్లలో కీలకం

అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్ల విలువ రికార్డు స్థాయిలో 19.6 లక్షల కోట్ల డాలర్లకు చేరగా, ఇందులో భారత్ వాటానే దాదాపు 12 శాతం.

షేర్ల విలువ పైపైకి

2004-07 మధ్య 72 షేర్ల విలువే మూడింతలవగా, ఆగస్టు 2013-డిసెంబర్ 2017 మధ్య 851 షేర్ల విలువ మూడింతలు పెరిగింది.

రిటైల్ పెట్టుబడుల జోరు

2004-07తో పోల్చితే ప్రస్తుతం 280 నుంచి 175 శాతానికి తగ్గిన రిటైల్ మదుపరుల లాభాల స్వీకరణ.

ఎంఎఫ్‌లు ఆకర్షణీయం

2004-07తో చూస్తే సెప్టెంబర్ 2013 నుంచి మ్యూచువల్ ఫండ్స్ ఆస్తులు 150 నుంచి 376 శాతానికి ఎగిశాయి.

బిలియన్ డాలర్ క్లబ్

డిసెంబర్ 2007లో 100 కోట్ల డాలర్ల మార్కెట్ విలువ ఉన్న సంస్థలు 700లు ఉంటే, డిసెంబర్ 2017లో వాటి సంఖ్య 1,039.

ఈక్విటీ వసూళ్లు

గడిచిన దశాబ్ద కాలంలో జరిగిన ఎంఎఫ్ ఈక్విటీ వసూళ్లలో 80 శాతం.. ఒక్క 2017లోనే నమోదైయ్యాయి.

నిధుల సమీకరణ

2010లో కంటే 2017లో నిధుల సమీకరణలు దాదాపు 40 శాతం పెరిగి 220కి చేరగా, వీటి విలువ 50 శాతం వృద్ధితో రూ.1.9 లక్షల కోట్లుగా ఉన్నది.



ప్రయాణికులకు సరిపడా రైళ్లు

- సంక్రాంతి నేపథ్యంలో 50 శాతం పెరిగిన రద్దీ
- దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికులకు సరిపడా రైళ్లు ఏర్పాటుచేసినట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఇప్పటివరకు ఎన్నడూలేనంతగా ఈ సంక్రాంతి సీజన్‌కు రద్దీ పెరిగిందని, జనవరి ఒకటి నుంచి 20 వరకు ప్రయాణికుల సంఖ్య 12 లక్షలకు చేరే అవకాశమున్నదని పేర్కొన్నది. సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ స్టేషన్ల నుంచి ప్రయాణికుల తాకిడి విపరీతంగా ఉన్నదని, 50 శాతం రద్దీ పెరిగిందని దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. 10 నుంచి 13 తేదీ మధ్య నిత్యం ఈ స్టేషన్ల నుంచి 1.10 లక్షల మంది ప్రయాణించారని చెప్పారు. సంక్రాంతి పండుగ కోసం రెగ్యులర్ రైళ్లకు 195 అదనపు బోగీలు ఏర్పాటుచేయడంతోపాటు 147 స్పెషల్ రైళ్లు నడిపించామని, 1.5 లక్షల అదనపు బెర్తులు అందుబాటులో తెచ్చామన్నారు.



వీరభద్రుడికి కోరమీసాలు..

వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి జాతరకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదివారం భోగి కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. గండాలు తొలిగిపోవాలని కోరుతూ భక్తులు గండదీపం వద్ద నూనె పోశారు. కోరిన కోర్కెలు తీర్చాలని స్వామివారికి కోరమీసాలు సమర్పించారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

- భీమదేవరపల్లి(వరంగల్)

'మిషన్ భగీరథ' పనులు 90 శాతం పూర్తి

- ఆరునెలల్లో ప్రతిఇంటికీ నల్లా నీరు
- జనగామ సెగ్మెంట్‌లో 692 గ్రామాలకు బల్క్‌గా సరఫరా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నల్లాల ద్వారా ఇంటింటికీ నీరందించే మిషన్ భగీరథ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రాజెక్టును మొత్తం 26 ప్రధాన సెగ్మెంట్లుగా విభజించగా ప్రధాన పనుల్లో 90 శాతం పూర్తయ్యాయి. హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ (హెచ్‌ఎండీఏ) పైపులైన్ ద్వారా గోదావరి జలాలు (ఎల్లంపల్లి జలాశయం నుంచి) సేకరించి పంపిణీ చేసే జనగామ సెగ్మెంట్‌లో పనులన్నీ పూర్తికాగా, గ్రామాల్లో అంతర్గత పైపులైన్ పనులు కొన్నిచోట్ల మిగిలాయి. పాలేరు జలాశయం వద్ద నిర్మించిన ఇన్‌టేక్ వెల్ నుంచి మూడు రోజుల కిందటే నీటి విడుదల ట్రయల్‌రన్ నిర్వహించారు. అన్నిచోట్ల ప్రధాన పనులు పూర్తి కావస్తుండటంతో నెలాఖరు నాటికి ట్రయల్‌రన్ నిర్వహిస్తామని, అనంతరం బల్క్‌గా గ్రామాలకు నీటిని విడుదల చేస్తామని అధికారులు చెప్తున్నారు. మరో ఆరునెలల్లో ఇంటింటికీ నల్లా కనెక్షన్లను పూర్తిచేస్తామని పేర్కొంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ బీ సురేందర్‌రెడ్డి నేతృత్వంలో సీఈ విజయపాల్‌రెడ్డి, ఈఈ విజయ్‌కుమార్ తదితరులు మిషన్ భగీరథ పనులపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఖమ్మం, జనగామ జిల్లాల్లో ప్రాజెక్టును సందర్శించారు. పాలేరు సెగ్మెంట్‌లో ట్రయల్‌రన్ నిర్వహించడంతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ వరకు నీరు చేరింది. ఈ నీటిని ట్యాంకులకు చేర్చి, గ్రామాలకు పంపిణీ చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ట్రయల్‌రన్ విజయవంతమైన ప్రాంతాల్లోని గ్రామాలకు దశలవారీగా నీరందిస్తామని సురేందర్‌రెడ్డి చెప్పారు.

జనగామ సెగ్మెంట్ ప్రాజెక్టు

జనగామ సెగ్మెంట్ ప్రాజెక్టు పరిధిలో 15 మండలాలున్నాయి. వీటిలో జనగామ 11, సిద్దిపేట -3, మహబూబాబాద్-1తోపాటు జనగామ పట్టణం ఉంది. దీని పరిధిలో 692 గ్రామాలు ఉండగా, 6,31,057 జనాభా ఉంది. ప్రాజెక్టు కోసం మొత్తం 27 నిర్మాణాలు చేపట్టారు. ప్రధాన పైప్‌లైన్ నిర్మాణం 1,523.33 కిలోమీటర్ల మేర పూర్తయింది. 692 గ్రామాలకు బల్క్‌గా నీటి సరఫరా జరుగుతున్నది. మొత్తం 1,46,590 కుటుంబాలకు గాను 91,536 కుటుంబాలకు (60 శాతం) ఇంటింటికీ నల్లా కనెక్షన్ కూడా పూర్తయింది. గ్రామాల్లో 77 శాతం మేర అంతర్గత పైపులైన్ నిర్మాణాలు, 508 ట్యాంకులకుగాను 427 (80శాతం) నిర్మాణాలు పూర్తయ్యాయి.

పాలేరు (ఖమ్మం), వైరా సెగ్మెంట్ ప్రాజెక్టు

పాలేరు జలాశయంలో ఇన్‌టేక్ వెల్ పూర్తయింది. జీళ్ల చెరువు వద్ద 90 ఎంఎల్డీ సామర్థ్యంతో నీటిశుద్ధి ప్లాంటు నిర్మించారు. ఇన్‌టేక్ వెల్ నుంచి జీళ్ల చెరువు నీటిశుద్ధి ప్లాంటు వరకు ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఖమ్మం జిల్లాలో ఏడు మండలాలు కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, రఘునాథపాలెం, చింతకాని, ముదిగొండతోపాటు ఖమ్మం కార్పొరేషన్‌లోని మొత్తం 7.23 లక్షల జనాభాకు దీనివల్ల ప్రయోజనం కలుగనుంది.

స్వల్పంగా తగ్గిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న విషయం తెలిసిందే. సాధారణంగా జనవరి 10 నుంచి 20 మధ్య ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత అధికంగా ఉండాలి. కానీ, ఈ ఏడాది జనవరి 12నుంచే ఉష్ణోగ్రతలు పెరుగడంతో వేసవిని తలపిస్తున్నది. ఆదివారం అత్యల్పంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 11.2 డిగ్రీలు, వికారాబాద్‌లో 11.2, సంగారెడ్డిలో 11.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
కుమ్రంభీం ఆసిఫాబాద్	34.8	11.2
వికారాబాద్	35.0	11.2
మేడ్చల్	35.1	11.4
సంగారెడ్డి	35.0	11.7
కామారెడ్డి	34.9	12.4
రంగారెడ్డి	34.9	12.4
సిద్దిపేట	34.7	12.6
ఆదిలాబాద్	35.0	12.6
రాజన్న సిరిసిల్ల	34.9	12.8
నిజామాబాద్	34.9	12.8
మహబూబ్‌నగర్	35.1	12.9
నాగర్‌కర్నూల్	34.9	13.0
మహబూబాబాద్	35.1	13.1
జయశంకర్ భూపాలపల్లి	34.9	13.2
నిర్మల్	35.2	13.3
జగిత్యాల	35.1	13.6
భద్రాద్రి కొత్తగూడెం	35.4	13.6
మంచిర్యాల	34.9	13.6
పెద్దపల్లి	34.9	13.7
మెదక్	34.9	13.7
యాదాద్రి భువనగిరి	34.9	14.0
వరంగల్ రూరల్	34.6	14.1
వరంగల్ అర్బన్	34.6	14.2
కరీంనగర్	34.6	14.3
హైదరాబాద్	34.9	14.5
నల్లగొండ	34.9	14.9
జనగామ	34.9	15.1
జోగుళాంబ గద్వాల	35.0	16.3
వనపర్తి	35.0	16.7
ఖమ్మం	34.9	16.9
సూర్యాపేట	34.6	17.8

త్వరలో రైల్వే క్లోక్ రూములు, లాకర్ల అద్దె పెంపు

న్యూఢిల్లీ: రైల్వేస్టేషన్లలోని క్లోక్ రూములు, లాకర్లలో వస్తువులు (లగేజీ) భద్రపరిచినందుకు ప్రయాణికుల నుంచి వసూలుచేస్తున్న అద్దె మొత్తాన్ని పెంచాలని భారత రైల్వే నిర్ణయించింది. సేవలు అందించినందుకు వసూలుచేసే ఫీజులను పెంచేందుకు డివిజినల్ రైల్వే మేనేజర్స్ (డీఆర్‌ఎం)కు రైల్వేబోర్డు అధికారాలు కట్టబెట్టింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆధునిక పద్ధతుల ద్వారా సేవలు అందిస్తూ.. ఏటా ఫీజులు పెంచుకొనే వెసులుబాటు కల్పించేలా త్వరలోనే బిడ్డింగ్ వ్యవస్థను తీసుకురానున్నది.

మెప్మా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల పెంపు!

జీహెచ్‌ఎంసీలో 126 మందికి.. జీతాల పెంపుపై ఆర్థికశాఖ పరిశీలన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)లో 376 మంది, జీహెచ్‌ఎంసీలో 126 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతభత్యాలను పెంచే ఫైలు ఆర్థికశాఖ పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. మంత్రి కేటీఆర్ ఈ ఉద్యోగులకు జీతభత్యాలను పెంచుతామని గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్థికశాఖ అధికారులు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న ట్టు సమాచారం. మెప్మాలోని ఉద్యోగులకు, జీహెచ్‌ఎంసీలో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ ఆర్గనైజర్స్, వికాస్ రిసోర్స్‌పర్సన్స్‌కు జీతభత్యాలు పెంచే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదని తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్నాథం ప్రవీణ్ తెలిపారు.

ఐటీ కారిడార్‌లో చేనేత సందడి

- మంత్రి కేటీఆర్ పిలుపునకు స్పందించి చేనేత వస్త్రాలు ధరిస్తున్న టెకీలు
- త్వరలో రహేజా ఐటీ పార్క్‌లో చేనేత ప్రదర్శన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేత కార్మికులను ఆదుకునేందుకు వారంలో ఒకరోజు ప్రజలు చేనేత వస్త్రాలు ధరించాలని రాష్ట్రం ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు ఐటీ ఉద్యోగుల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. ప్రతి సోమవారం ఐటీ ఉద్యోగులు చేనేత వస్త్రాలు ధరించాలని మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఫెసిలిటిస్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ (ఎఫ్‌ఎంసీ) చేనేత వస్త్రాలపై అవగాహన పెంచడానికి చేసిన అనేక ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. హైటెక్ సిటీలోని ఎఫ్‌ఎంసీ ఆధ్వర్యంలో గతనెలలో మూడురోజులపాటు ఫోనిక్స్ ఎరినా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన చేనేత స్టాల్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. గత ఏడాది ఐటీ మంత్రి కేటీఆర్ చేసిన విజ్ఞప్తితో చేనేత వస్త్రాలను ధరించడానికి ఐటీ ఉద్యోగులు ఉత్సాహంగా ముందుకొస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ఆదివారం పీటీఐ వార్తా సంస్థతో తెలిపారు. ఐటీ కంపెనీల్లో దాదాపుగా 4.50 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారందరు ఒకరోజు చేనేత వస్త్రాలు ధరించినా చేనేత వర్గాలకు చేయూత అందించినట్టు అవుతుందని పేర్కొన్నారు. దాదాపు 20 కంపెనీలకు చెందిన ఉద్యోగులు రూ.8 లక్షల విలువైన వస్త్రాలు కొనుగోలు చేసినట్టు ఎఫ్‌ఎంసీ అధ్యక్షుడు సత్యనారాయణ చెప్పారు. ఈ నెలాఖరులో రహేజా ఐటీ పార్కులో చేనేత ప్రదర్శన, విక్రయాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఐటీ కంపెనీలు హెచ్‌ఆర్ పాలసీలో ప్రతి సోమవారం చేనేత వస్త్రాలను ధరించాలనే విధానాన్ని అమలుచేస్తే ఇంకా అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు.


'ఎంఎల్ఏ' చిత్రంలో కళ్యాణ్‌రామ్

నమస్తే తెలంగాణ చిత్రం

మంచి లక్షణాలున్న అబ్బాయి

'అతనొక మంచి లక్షణాలున్న అబ్బాయి. జీవితంలో ఓ ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకుంటాడు. దానిని చేరుకోవడానికి వినూత్న మార్గాన్ని ఎంచుకుంటాడు. అదేమిటన్నది తెలుసుకోవాలంటే మా చిత్రం చూడాల్సిందే' అంటున్నారు ఉపేంద్రమాధవ్. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఎంఎల్‌ఏ'. కల్యాణ్‌రామ్, కాజల్ అగర్వాల్ జంటగా నటిస్తున్నారు. బ్లూప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్, ఎల్ఎల్‌పీ మరియు పీపుల్ మీడియా సంస్థలు నిర్మిస్తున్నాయి. టాకీ పార్ట్ పూర్తయింది. మార్చిలో విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఆద్యంతం వినోదప్రధానంగా సాగే చిత్రమిది. కల్యాణ్‌రామ్ పాత్ర చిత్రణ వినూత్న పంథాలో సాగుతుంది. తన ఆశయాన్ని సాధించే క్రమంలో మంచి లక్షణాలున్న అబ్బాయి చేసిన ప్రయత్నాలేమిటన్నది ఆసక్తిని రేకెత్తిస్తుంది. కల్యాణ్‌రామ్ లుక్ స్టైలిష్‌గా వుంటుంది. కథానుగుణంగానే టైటిల్ పెట్టాం' అన్నారు. రవికిషన్, జయప్రకాష్ రెడ్డి, అజయ్, వెన్నెల కిషోర్, పృథ్వీ, శివాజీరాజా, ప్రభాస్‌శ్రీను, లాస్యా, మనాలిరాథోడ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచనా సహకారం: ప్రవీణ్‌వర్మ, ఆదినారాయణ, సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: ప్రసాద్ మూరెళ్ల, ఎడిటింగ్: తమ్మిరాజు, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాతలు: భరత్‌చౌదరి, ఎమ్.వి.కిరణ్‌రెడ్డి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: ఉపేంద్రమాధవ్.

'మిఠాయి' మొదలైంది!



రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి, విజయ్ దేవరకొండ

గాయత్రి గుప్తా, శ్వేతావర్మ, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'మిఠాయి'. రెడ్‌యాంట్స్ పతాకంపై ప్రశాంత్‌కుమార్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న ఈ చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో మొదలైంది. పూజా కార్యక్రమాల అనంతరం రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శిలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి హీరో విజయ్ దేవరకొండ క్లాప్‌నిచ్చారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'ఈ చిత్రానికి పనిచేస్తున్న అందరూ నేను నటించిన 'పెళ్లిచూపులు' సినిమా నుంచి పరిచయం. అందుకే ఇది నా టీమ్ సినిమా. దర్శకుడు ప్రశాంత్ నాకు మంచి స్నేహితుడు. డార్క్ కామెడీ సినిమా అనగానే అ సినిమా కోసం చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అని తెలిపారు. 'మంచి కథ కుదిరింది. డార్క్ కామెడీ నేపథ్యంలో సాగే చిత్రమిది. ఖచ్చితంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందనే నమ్మకముంది' అని రాహుల్ రామకృష్ణ తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'డార్క్ కామెడీ నేపథ్యంలో తెలుగులో చాలా తక్కువ సినిమాలు రూపొందాయి. కొత్తతరహా కథ, కథనాలతో వస్తున్న ఈ సినిమా అందరికి నచ్చే సినిమా అవుతుంది. మంచి టీమ్‌తో ఈ సినిమా చేస్తున్నాం. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది' అన్నారు. భూషణ్ కల్యాణ్, కమల్ కామరాజు, రవివర్మ, అజయ్‌ఘోష్, విజయ్ మురార్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, ఛాయాగ్రహణం: సాకేత్ సౌరభ్, ఎడిటింగ్: వీణు భూషణ్, కొరియోగ్రఫీ: అనీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: కృష్ణ ఒడపల్లి, నిర్మాత, దర్శకత్వం: ప్రశాంత్ కుమార్.


'కృష్ణార్జున యుద్ధం'లో నాని

అభినవ కృష్ణార్జునీయం

భారతంలో కృష్ణార్జునులు కురుక్షేత్ర యుద్ధాన్ని నడిపించారు. కృష్ణుడి గీతోపదేశంతో అర్జునుడు కార్యోన్ముఖుడై యుద్ధంలో విజయం సాధించాడు. ఇప్పుడు ఈ అభినవ కృష్ణార్జునులు ఏ లక్ష్యం కోసం పోరాడారు? అసలు వారి ఆశయాలు ఏమిటి? ఈ అంశాలన్నింటికి సమాధానమే 'కృష్ణార్జున యుద్ధం'' అన్నారు మేర్లపాక మురళి. ఆయన దర్శకత్వంలో నాని ద్విపాత్రాభినయం చేస్తున్న చిత్రం 'కృష్ణార్జున యుద్ధం'. అనుపమ పరమేశ్వరన్, రుక్సర్‌మీర్ కథానాయికలు. వెంకట్ బోయనపల్లి సమర్పణలో సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల రానుంది. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను హీరో నాని ట్విట్టర్ ద్వారా పంచుకుని ఓ వీడియోను పోస్ట్ చేశారు. 'అందరికి సంక్రాంతి శుభాకాంక్షలు. 'ఎంసీఏ'ను పెద్ద సక్సెస్ చేసినందుకు ధన్యవాదాలు. మనకు అన్నింటికన్నా పెద్ద పండుగ సంక్రాంతి. భోగి రోజున కృష్ణ, సంక్రాంతి రోజున అర్జున్ ఫస్ట్‌లుక్‌లను, కనుమ రోజు సినిమాలోని ఫస్ట్ సాంగ్‌ను మీరు చూడబోతున్నారు. ఇవన్నీ మీకు నచ్చుతాయని ఆశిస్తున్నాను' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: హిప్ హాప్ తమిళ, ఛాయాగ్రహణం: కార్తీక్ ఘట్టమనేని, ఆర్ట్: సాయి సురేష్.

అబద్ధాలే నిజమంటూ...


మంచు లక్ష్మి

పాత్రలపరంగా ప్రయోగాలు చేయడానికి ఎప్పుడూ ముందుంటుంది మంచు లక్ష్మి. ఆమె నటిస్తున్న తాజా చిత్రానికి 'వైఫ్ ఆఫ్ రామ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మంచు ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం ద్వారా రాజమౌళి శిష్యుడు విజయ్ యలకంటి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఆయన చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'మానవ సంబంధాలు, భావోద్వేగాల చుట్టూ నడిచే కథ ఇది. అబద్ధాలను నిజమని నమ్మే వైవిధ్యమైన పాత్రలో మంచు లక్ష్మి కనిపిస్తుంది. ఆమె పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి' అన్నారు. సామ్రాట్‌రెడ్డి, ఆదర్శ్ బాలకృష్ణ, శ్రీకాంత్ అయ్యార్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సామల భార్గవ్, సంగీతం: రఘుదీక్షిత్, మాటలు: సందీప్ గుంటా, రచన-దర్శకత్వం: విజయ్ యెలకంటి.


శ్రియ

సరికొత్త ప్రయోగం

సీనియర్ కథానాయిక శ్రియ ఓ వైవిధ్యమైన పాత్రలో కనిపించడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటివరకు ఎక్కువగా గ్లామర్ పాత్రల్లోనే మెరిసిన ఈ అమ్మడు తాజా చిత్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన అమాయకురాలైన అమ్మాయిగా కనిపించనుంది. సుజన దర్శకురాలిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ప్రముఖ ఛాయాగ్రాహకుడు జ్ఞానశేఖర్ వి.ఎస్. నిర్మించనున్నారు. సంగీతప్రధానంగా సాగే ఈ సినిమాలో శ్రియ పాత్ర చిత్రణ నవ్య పంథాలో సాగుతుందని, ఆమె కెరీర్‌లో విలక్షణ చిత్రంగా నిలిచిపోతుందని చిత్ర బృందం చెబుతున్నది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మార్చి నెలలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. కాగా ఈ సినిమాకు ఇళయరాజా సంగీతాన్నందించనున్నారు. సాయిమాధవ్ బుర్రా సంభాషణలందిస్తారు.

ఎక్కల్‌దేవి శ్రీనివాస్, గుండాల కృష్ణ, నమస్తే తెలంగాణ ప్రతినిధి


మూడంతస్తుల ఇంట్లో బోరు నుంచి నీటిని వాడుకునేందుకు మనం సాధారణంగా రెండు హెచ్‌పీల సామర్థ్యం ఉన్న మోటరును వాడుతాం. మరి అలాంటి మోటర్లు ఒకటీ, రెండూ కాదు.. 93,201 మోటర్లను వరుసగా నిలబెట్టి నీటిని తోడుతుంటే ఎలా ఉంటుంది! అదే సామర్థ్యమున్న 6,52,407 మోటర్లతో ఒకేసారి నీటిని తోడితే? ఊహించడమే కష్టం! బాహుబలి కూడా బలాదూర్ అనేలా ఉన్న ఈ మోటర్లను ఏడింటిని అమర్చి రోజుకు రెండు టీఎంసీల గోదావరి జలాలను తెలంగాణ బీడు భూముల్లోకి పారించాలనే సీఎం కేసీఆర్ సంకల్పానికి అనుగుణంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం రూపుదిద్దుకుంటున్నది. ఊహలకు కూడా అందని ఆ దృశ్యం మరికొన్ని నెలల్లోనే తెలంగాణలో ఆవిష్కారం కానున్నది. ఆసియాలోనే ప్రప్రథమంగా 139 మెగావాట్ల సామర్థ్యం ఉన్న మోటర్ల ద్వారా నీటిని లిఫ్టు చేయనున్నారు. పైగా ఈ మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోసేది 10-15 మీటర్ల ఎత్తులో కాదు.. ఏకంగా 115 మీటర్ల ఎత్తుకు తోడి పదమూడు జిల్లాల పరిధిలో 18 లక్షల ఎకరాలకుపైగా కొత్త ఆయకట్టుకు జీవం పోయనున్నారు. వచ్చే వర్షాకాలానికి గోదావరి నది నుంచి నీటిని మళ్లించాలన్న సీఎం కేసీఆర్ దృఢదీక్షకు అనుగుణంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అందరినీ ఆకర్షిస్తున్న, ఆసక్తికరంగా మారిన కాళేశ్వరం మోటర్లు, పంపుహౌజ్‌ల నిర్మాణంపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మాణంతో గోదావరిజలాలను ఒడిసిపట్టడం మొదలవుతుంది. కన్నెపల్లి వద్ద నిర్మించే పంపుహౌస్‌తో జలాల మళ్లింపునకు శ్రీకారం చుడతారు. 40 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 11 మోటర్ల ద్వారా 23 వేల క్యూసెక్కులకు పైగా గోదావరి జలాలను 49 మీటర్ల ఎత్తులోకి లిఫ్టు చేస్తారు. ఆపై అన్నారం బరాజ్‌లో పోయడం.. అక్కడి నుంచి 40 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ఎనిమిది మోటర్లతో తోడి 34 మీటర్ల ఎత్తులో ఉన్న సుందిల్లలో, తర్వాత సుందిల్ల నుంచి 40 మెగావాట్ల సామర్థ్యం ఉన్న తొమ్మిది మోటర్లతో జలాలను 40 మీటర్ల ఎత్తుకు లిఫ్టుచేసి ఎల్లంపల్లి ప్రాజెక్టులో పోస్తారు. ఎల్లంపల్లి నుంచి నీటిని మేడారం రిజర్వాయర్, ఆపై ఎస్సారెస్పీ వరద కాల్వ ద్వారా మిడ్‌మానేరులోకి తరలిస్తారు. మిడ్‌మానేరు నుంచి ఒకవైపు అప్పర్ మానేరుకు, మరోవైపు లోయర్ మానేరుకు.. ప్రధాన అలైన్‌మెంట్‌లో భాగంగా అనంతగిరి, ఇమాంబాద్ రిజర్వాయర్లకు జలాలను లిఫ్టు చేస్తారు. ఆపై ఇమాంబాద్ నుంచి 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి పోస్తారు. ఆ రిజర్వాయర్ నుంచి ఒకవైపు సింగూరు దిశగా, మరోవైపు యాదాద్రి-భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధంమల్ల రిజర్వాయర్లకు.. ఇంకోవైపు శామీర్‌పేట వైపున ఉండే కొండపోచమ్మ రిజర్వాయర్‌లోకి గోదావరిజలాలను తరలిస్తారు. ఈ క్రమంలో 13 జిల్లాల పరిధిలో 18.25 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు, 18.82 లక్షల ఎకరాలమేర ప్రాజెక్టుల ఆయకట్టును స్థిరీకరిస్తారు.

మోసేందుకు దీటుగా భారీస్థాయిలో సిమెంట్ వేదిక (ఫౌండేషన్)ను నిర్మించాల్సిందే. ఆ నిర్మాణంలో వాడే స్టీలు పరిమాణం 1200 టన్నులు. సాధారణంగా 1200 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఒక ఇంటిని నిర్మించాలంటే వాడే స్టీలు కేవలం ఐదు టన్నులు. అలాంటిది 1200 టన్నులంటే దాదాపు 420కి పైగా ఇండ్ల నిర్మాణానికి వాడే స్టీలును కేవలం ఒకేఒక్క మోటారును పట్టి ఉంచేందుకు వాడుతున్నారన్న మాట. భౌగోళికంగా తెలంగాణకు సాగునీరు అందాలంటే ఎత్తిపోతల పథకాలే శరణ్యం. దీంతో మన ఇంజినీర్లు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ.. ఎత్తిపోతల పథకాల్లో రికార్డులను నెలకొల్పుతున్నారు. దశాబ్దంన్నరగా ఆసియాలోనే అతిపెద్ద లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాలు తెలంగాణ ఇంజినీర్లవే 2000-01 ప్రాంతంలో నల్లగొండ జిల్లాలో ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ద్వారా వందమీటర్ల ఎత్తుకు నీటిని లిఫ్టు చేయడంతో ఆసియాలోనే పెద్ద లిఫ్టుఇరిగేషన్‌గా పరిగణించారు. ఆ ప్రాజెక్టులో ఒక్కోమోటరు సామర్థ్యం 18 మెగావాట్లు. అలాంటివి నాలుగు ఏర్పాటు చేశారు. తర్వాత కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో 30 మెగావాట్ల సామర్థ్యం ఉన్న మోటర్లను ఏర్పాటు చేయడంతో ఆసియాలో అతిపెద్ద లిఫ్టు ఇరిగేషన్ స్థానం కల్వకుర్తి కాతాలో పడింది. ఇప్పుడు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో 30, 120, 134 మెగావాట్ల సామర్థ్యం ఉన్న మోటర్లను బిగిస్తున్నారు. రామడుగు పంపుహౌస్‌లో అమరుస్తున్న మోటర్ల సామర్థ్యం 139 మెగావాట్లు. ఇది పూర్తయితే ఆసియాలో ఇదే అతిపెద్ద లిఫ్టు ఇరిగేషన్ మోటరుగా చరిత్రకెక్కుతుంది. ఈ రికార్డును కూడా తెలంగాణే అధిగమించనున్నది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ఏకంగా 145 మెగావాట్ల సామర్థ్యం ఉన్న మోటర్లను వినియోగించనున్నారు. అంటే మరి కొంతకాలంలో కాళేశ్వరం రికార్డును పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అధిగమించనున్నదన్న మాట.

పద్దెనిమిది వేల ఏనుగుల బలం!

- కాళేశ్వరం ప్రాజెక్టులో ఉపయోగిస్తున్న మోటరుపంపుల సామర్థ్యం అద్వితీయం
- 139 మెగావాట్ల శక్తి, సామర్థ్యాలతో ఒక్కో మోటరు
- ఒక మెగావాట్‌కు.. 341 హెచ్‌పీ సామర్థ్యం
- ఒక మోటరు శక్తి 1,86,402 హార్స్‌పవర్
- సాగునీటికి వినియోగిస్తున్నవాటిలో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా పేరు
- ఒక్కో మోటరు పంప్ బరువు 1407 టన్నులు
- రోటర్ బరువే 120 టన్నులు..
- స్టార్టర్ బరువు 260 టన్నులు



మోటర్‌కు అనుసంధానం కోసం ఏర్పాటుచేసిన 3 ఫేజ్ విద్యుత్‌లైన్లు



కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా లక్ష్మీపూర్‌లోని ప్యాకేజీ-8లో భూ గర్భంలో 140 మీటర్ల దిగువన పంప్‌హౌస్‌లో మోటర్ల బిగింపునకు సిద్ధమవుతున్న పంప్ బెడ్స్

కాళేశ్వరం.. బాహుబలి!

ఆసియాలోనే ప్రప్రథమంగా 139 మెగావాట్ల సామర్థ్యం ఉన్న మోటర్ల ద్వారా నీటిని లిఫ్టు చేయనున్నారు.



లక్ష్మీపూర్‌లోని ప్యాకేజీ-8లో భూ గర్భంలో బిగిస్తున్న మోటర్

మోటర్ల ప్రత్యేకతలు

భూగర్భంలో 140 మీటర్ల లోతున సర్జ్‌పూల్‌లో ఉండే నీటిని ఉపరితలానికి పంపింగ్ చేసేందుకు ఉపయోగిస్తున్న ఒక్కో మోటరును నడిపించడానికి 139 మెగావాట్ల విద్యుచ్ఛక్తి అవసరం. సూటిగా చెప్పాలంటే.. ఒక్క మోటరు శక్తి 1,86,402 హార్స్‌పవర్‌తో సమానం. వ్యవసాయ అవసరాలకు పొలాల్లో వాడే 5 హెచ్‌పీ మోటార్లతో పోల్చుకుం టే.. 37,280 మోటర్లు కలిస్తే ఎంతో.. 139 మెగావాట్ల విద్యుత్‌తో నడిసే ఈ ఒక్క మోటారు అంత శక్తివంతమైనది.

సాధారణంగా ఇండ్లలో సంప్‌లోని నీటిని పైన ఉండే వాటర్‌ట్యాంక్‌లోకి తోడేందుకు ఒక హెచ్‌పీ మోటరును వాడుతాం. ఈ మోటర్‌తో నీటిని తోడితే.. సుమారు అంగుళం వ్యాసార్థ్యం ఉండే పైపులో నిండుగా నీరు వస్తుంది. అదే చేనులు, పొలాల్లో వాడే వ్యవసాయ పంప్‌సెట్ (5 హెచ్‌పీ)తో అయితే సుమారు 2.5 నుంచి 3 అంగుళాల వ్యాసార్థం ఉండే పైపు నిండుగా నీళ్లు పోస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఏర్పాటుచేస్తున్న 139 మెగావాట్ల విద్యుచ్ఛక్తితో పనిచేసే మోటర్ పంపు 115 మీటర్ల ఎత్తుకు నీటిని పంప్ చేస్తుంది. అదికూడా ఏకంగా 5 మీటర్ల వ్యాసంతో ఉండే పైపులో నిండుగా నీటిని పంప్ చేస్తుంది. అదీ దాని సామర్థ్యం!

కథలు.. పురాణాల్లో అత్యంత బలశాలి గురించి చెప్పాల్సిన సందర్భాల్లో వెయ్యి ఏనుగల శక్తితో పోల్చుతారు. తాజాగా బాహుబలి సినిమా తర్వాత మహాశక్తిమంతుడిని.. బాహుబలితో పోల్చుతున్నారు. కానీ 139 మెగావాట్ల విద్యుత్ మోటరు శక్తి సామర్థ్యాలను చూస్తే.. బాహుబలి కూడా బలాదూర్! కాళేశ్వరం ప్రాజెక్టు, ప్యాకేజీ 6లో కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ వద్ద భూఉపరితలానికి 140 మీటర్ల దిగువన అమరుస్తున్న ఒక్కో మోటరుపంపు సామర్థ్యం.. 1,86,402 గుర్రాల శక్తి.. 18,640 ఏనుగుల బలంతో సమా నం. సాధారణంగా 10 గుర్రాల శక్తి.. ఒక ఏనుగు బలంతో సమానం అని వ్యవహారంలో అంటుంటారు. ఈలెక్కన పద్దెనిమిది వేల ఏనుగుల బలం ఎంతో.. ఈ మోటరుపంపు శక్తికూడా అంతే.

ఇండ్లల్లో వాడే 1 హెచ్‌పీ మోటరుకు 0.746 కిలోవాట్ల విద్యుత్ అవసరం. ఒక మెగావాట్ అం టే.. 1341 హార్స్‌పవర్. 139 మెగావాట్లు అంటే.. 1,86,402 హార్స్‌పవర్. దీన్ని పొలాల్లో వాడుకునే 5 హెచ్‌పీ మోటర్లుగా మార్చుకుంటే.. 37,280. 5 హెచ్‌పీ సామర్థ్యమున్న 37,280 మోటర్లను ఒకేసారి వాడితే ఎంత నీరు వస్తుందో.. ఈ ఒక్క మోటరుపంపుతో అంతే నీటిని పంపు చేస్తుందన్నమాట. కన్నుమూసి తెరిచేలోగా.. అంటే ఒక్క క్షణంలో మోటారు 3.5 చక్కర్లు కొడుతుంది.. ఇది నిమిషానికి 214 సార్లు (ఆర్‌పీఎం-రివల్యూషన్స్ పర్ మినిట్) తిరుగుతుంది. బరువు విషయం చెప్పాలంటే.. ఈ మోటరులో వాడే రోటర్ బరువు 120 టన్నులు.. ఈ రోటర్ బయట ఉండే స్టార్టర్ బరువు 260 టన్నులు.. ఈ రోటర్‌ను తిప్పడానికి ఉపయోగించే షాఫ్ట్ బరువు 23568 కిలోలు. ఇక పంపులో అతిముఖ్యమైన ఇంపెల్లర్ రన్నర్ (నీటిని ముం దుకు నెట్టే యంత్రం) బరువు 38436 కిలోలు. అంటే 38.4 టన్నులన్నమాట. మొత్తంగా ఈ మోటరుపంపు బరువు 1407 టన్నులు.

ఏనుగులను తలదన్నే మోటర్లు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో మోటరుపంపుల విషయానికి వస్తే.. ప్రపంచంలోనే ఇంతటి భారీ మోటరు పంపులను ఇప్పటివరకు ఎవరూ సాగునీటికోసం ఉపయోగించలేదు. ఇదొక రికార్డు. వాటిలో 139 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేసే 7 మహా మోటరుపంపులు ఉన్నాయి. ఇంతవరకు ప్రపంచంలోనే ఇంత భారీ మోటర్లను ఎక్కడా వాడలేదు. ఇది కాళేశ్వరం ప్రాజెక్టు లిఖిస్తున్న చరిత్ర. మొత్తంగా 82 మోటరుపంపులను కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం 4843.68 మెగావాట్ల విద్యుత్ అవసరం. ఈ పంప్‌హౌస్‌ల కోసమే ప్రత్యేకంగా 400 కేవీ సబ్ స్టేషన్లను నిర్మిస్తున్నారంటే, ఇక్కడి మోటరుపంపుల సామర్థ్యాలు ఎంతటివో అర్థం చేసుకోవచ్చు. కాళేశ్వరంలో భాగంగా రామడుగు పంపుహౌస్‌లో అమరుస్తున్న ఒక్కో పంపు, మోటరు బరువు అక్షరాలా 1407 టన్నులు. ఇందులో ప్రధాన భాగాలు-వాటి బరువును పరిశీలిస్తే... రూటర్-160 టన్నులు, స్టాటర్-185 టన్నులు, స్టేరింగ్-135 టన్నులు, డీటీ కోన్-15 టన్నులు, లోయర్ బ్రాకెట్-45 టన్నులు, గైడ్‌వెయిన్స్-160 టన్నులు, యాగ్జిలరీస్-500 టన్నులు, షాఫ్టులు-100 టన్నులు, ఇంపొరెల్లర్-30 టన్నులు. మరి ఇంత బరువున్న పంపు, మోటరును



లక్ష్మీపూర్‌లోని ప్యాకేజీ-8లో భూగర్భంలో 68 మీటర్ల ఎత్తు, 410 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న సర్జిపూల్



నందిమేడారం ప్యాకేజీ-6లో మోటర్లు బిగించేందుకు సిద్ధంగా ఉన్న 120 టన్నుల బరువైన రోటర్



ప్యాకేజీ-8లో మెయిన్ కంట్రోల్ యూనిట్ పనితీరును వివరిస్తున్న ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి, ఇంజినీర్ నూనె శ్రీనివాస్

నిజానికి ఇంతకంటే ఎక్కువ శక్తిసామర్థ్యాలున్న మోటర్లు మన దేశంలోనే ఉన్నాయి. కాని అవి నీటిని పంపింగ్ చేయడానికి వినియోగించడం లేదు. నీటిని ఉపయోగించుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి వాటిని వినియోగిస్తున్నారు. సుమారు 210 మెగావాట్ల సామర్థ్యం ఉన్న మోటరును బీహెచ్‌ఈఎల్ తయారుచేసింది. దీన్ని దామోదర్ వ్యాలీ ప్రాజెక్టులో జలవిద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి ఉపయోగిస్తున్నారు.

గుట్ట కింద జ(ల)న ప్రపంచం!

భూగర్భంలో కాళేశ్వరం నిర్మాణ యజ్ఞం.. మూడు షిఫ్టుల్లో 24/7 పనులు

షిఫ్టుకు 600 మంది కార్మికులు.. బయటి ప్రపంచానికి తెలియని పాతాళ లోకం

పాతాళం భూమి లోపలని పురాణాల్లో చదువడమేగానీ.. ఎవరూ చూడలేదు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం అచ్చంగా పాతాళంలోనే జరుగుతున్నది. వందలమంది కార్మికులు, ఇంజినీర్లు అలుపెరుగకుండా భూమి పొరల్లోపల శ్రమిస్తున్నారు. పైన చూస్తే మామూలు గుట్ట. కానీ గుట్ట కింద మరోలోకమే వెలిసింది. తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా తీర్చిదిద్దేందుకు వందల మంది అహరహం శ్రమిస్తున్న మరోప్రపంచం వివరాలు'నమస్తే తెలంగాణ'మీ కోసం అందిస్తున్నది

భూగర్భంలో జలయాగం

కాళేశ్వరం ప్రాజెక్టులో 16 చోట్ల భూగర్భంలో పనులు సాగుతున్నాయి. పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం నందిమేడారం దగ్గర పనులను 'నమస్తే తెలంగాణ' పరిశీలించింది. గ్రామాన్ని ఆనుకుని ఉన్న పెద్దగుట్ట అడుగున సుమారు 140 మీటర్ల లోతులో ఒక్కోషిఫ్టునకు సుమారు 600 మందికిపైగా మూడు షిఫ్టుల్లో 1800 మంది కార్మికులు రేయింబవళ్లు పనిచేస్తూనే ఉంటారు. వీరికితోడుగా దాదాపు 150 మందికిపైగా ఇంజినీర్లు నిర్మాణపనుల్లో పాలుపంచుకుంటున్నారు. కార్మికులు రాళ్లను పగులగొట్టడం, జనరేటర్లను నడిపించడం, ఐరన్ పైపులు, గడ్డర్లను వెల్డింగ్ చేస్తూ తాపీపని, సెంట్రింగ్ చేస్తూ వందలమంది..ఎలక్ట్రీషియన్లు.. వెల్డర్లు, కట్టర్లు.. సెక్యూరిటీ సిబ్బంది.. వీరికితోడుగా మైనింగ్, ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్‌ఇంజినీర్లు క్షణం తీరికలేకుండా పనిచేస్తున్నారు. సొరంగాలు, టన్నెళ్లు, సర్జ్‌పూల్ ఇలా ఏదైనా తవ్వేందుకు పొక్లెయినర్లు, జేసీబీలు, బుల్‌డోజర్లు పనిచేస్తుంటే.. తవ్వగా వచ్చిన రాళ్లు, మట్టిని ఉపరితాలనికి తరలించేందుకు డంపర్లు, లారీలు, టిప్పర్లు రయ్యిరయ్యిమని పరుగెడుతుంటాయి. నిర్మాణాలకు కావాల్సిన ముడిపదార్థాలు, సిమెంట్, సున్నం, ఇసుక, కంకర ఐరన్‌తోపాటు, యంత్రాలు, విడిభాగాలు, కార్మికుల రవాణా కోసం లారీలు, మినీబస్సులు, తిరుగుతుంటాయి.

పంప్ గాలి.. లైట్ల వెలుతురు

భూగర్భంలో పనిచేస్తున్న వీరికి గాలి, ఆక్సిజన్ పైనుంచే రావాలి. సొరంగం ప్రారంభమయ్యే చోట రెండు పెద్దఫ్యాన్లతో గాలిని పైపుల ద్వారా సొరంగం లోపలికి నిరంతరాయంగా పంప్‌చేస్తూ ఉంటాయి. దీంతో 140 మీటర్ల లోపల పనిచేసే కార్మికులకు, ఇతర సిబ్బందికి, అధికారులకు ధారాళంగా కావాల్సినంత ఆక్సిజన్ అందుతుంది. 20 మీటర్ల వ్యాసంతో భూఉపరితలం నుంచి పనులు జరుగుతున్న ప్రాంతానికి తవ్విన బిలం ఉంది. ఒకసారి మోటార్లు నీటిని పంపింగ్ చేయడం మొదలుట్టిన తరువాత ఇక సొరంగం గుండా వెళ్లడానికి వీలుండదు. దానిని మూసేస్తారు. మోటర్లు నడిపేవారు. నిర్వహణ కోసం వెళ్లే సిబ్బంది ఈ బిలం ద్వారా మాత్రమే వెళ్ళాల్సి ఉంటుంది. దీనికి లిఫ్ట్‌ను ఏర్పాటు చేస్తారు. కేబుళ్లు, వైర్లు, విద్యుత్ తీగలు బావిలాంటి బిలం నుంచే కిందకు వెళ్తాయి.

లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి, రాళ్ళు

గుట్ట కింద ఉన్న ప్రపంచ విస్తీర్ణం చాలా పెద్దదే. ముందుగా రెండు టన్నెళ్లు ఉంటాయి. ఒక్కో టన్నెల్ వ్యాసం సుమారు 10 మీటర్లు. ఒక్కొక్కటి 4.5 కి.మీ. పొడవునా రెండు టన్నెళ్లు.. అంటే మొత్తం 9 కి.మీ. పొడవైన టన్నెల్ ఉంటుంది. టన్నెల్ తవ్వగా వచ్చిన రాళ్లు, మట్టి సుమారు 10.99 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు ఉంటుందని అంచనా. అలాగే 1.12 లక్షల క్యూబిక్ మీటర్ల మేర కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. ఇలా తవ్విన టన్నెళ్లు సర్జ్‌పూల్‌తో కలిపి ఉంటాయి. సర్జ్‌పూల్ అంటే చిన్న బావేం కాదు. 375 మీటర్ల పొడవు, 67.63 మీటర్ల ఎత్తున, 25 మీటర్ల వెడల్పుతో దీనిని నిర్మిస్తున్నారు. సర్జ్‌పూల్‌తోపాటు అండర్‌గ్రౌండ్ పంప్‌హౌజ్, ట్రాన్స్‌ఫార్మర్ కావర్న్, డ్రాఫ్ట్ ట్యూబ్స్ (సర్జ్‌పూల్ నుంచి మోటారు పంప్ వరకు నీళ్లు వెళ్ళేందుకు వీలుగా వేసే పైపులు), డెలివరీ మెయిన్స్, డెలివరీ సిస్టర్న్, ఆడిట్లు.. ఇలా ఎన్నో ఉంటాయి. వీటి కొరకు జరిపిన తవ్వకాల నుంచి 22.66 లక్షల క్యూబిక్ మీటర్ల రాళ్లు, మట్టి తీస్తున్నారు. పనులన్నీ పూర్తయిన తరువాత ఇవేవీ కనపడవు. ఇవన్నీ నీటితో నిండిపోతాయి. సుమారు 70 మీటర్ల లోతున ఉండే అండర్‌గ్రౌండ్ పంప్‌హౌజ్ పై భాగం మాత్రమే కనపడుతుంది. టన్నెళ్లు, సర్జ్‌పూల్, డ్రాఫ్ట్ ట్యూబ్స్ లాంటివి ఏవీ కనపడవు. అవన్నీ నీటి లోపలి భాగంలో ఉంటాయి. ఇదీ గుట్ట కింది ప్రపంచం కథ!

వచ్చే వర్షాకాలానికే నీటి తరలింపు

రికార్డు సమయంలో కాళేశ్వరం పథకం పనులకు సంబంధించి అంతర్రాష్ట్ర, కేంద్ర అనుమతుల వంటి ప్రక్రియలను పూర్తిచేసిన తెలంగాణ ప్రభుత్వం.. రానున్న వర్షాకాలానికే గోదావరి జలాల మళ్లింపును మొదలుపెట్టాలనే లక్ష్యాన్ని ప్రకటించింది. దీనికి అనుగుణంగానే మేడారం, అన్నారం, సుందిల్ల బరాజ్‌ల పనులు జరుగుతున్నాయి. వీటి నిర్మాణం మొత్తం పూర్తికాకున్నా సాంకేతికంగా ఎలాంటి ఇబ్బంది ఉం డదు. ఈ మూడు చోట్ల పంపుహౌస్‌లను మాత్రం వచ్చే జూన్‌నాటికి సిద్ధం చేసేందుకు నీటిపారుదలశాఖ ప్రణాళిక రూపొందించింది. వీటి తర్వాత ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు వరకు పనులు పూర్తి చేయడం ముఖ్యం. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు వరుస సమీక్షలు, ఆన్‌లైన్ పర్యవేక్షణలతో ప్రభుత్వ, అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తున్నారు. వాటి ఫలితంగా ఆయా సైట్లలో జరుగుతున్న పనుల హోరు, జోరు.. కేంద్ర జలసంఘం ఇంజినీర్లను సైతం సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తింది. దేశవ్యాప్తంగా ఎన్నో సాగునీటి ప్రాజెక్టులను చూసిన సీడబ్ల్యూసీ ఇంజినీర్లు.. కాళేశ్వరం ప్రాజెక్టును చూసిన తర్వాత పనుల వేగాన్ని, తీరును కవితలతో కొనియాడారంటే కాళేశ్వరం పనులు ఏస్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఈ వర్షాకాలానికి పనులు పూర్తయ్యేందుకుగాను ఏజెన్సీలు, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు అహర్నిశలు కృషి చేస్తున్నారు. కొన్నిరోజుల కిందటే సీఎం కేసీఆర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించగా... తదుపరి మరోసారి కూడా మంత్రి హరీశ్‌రావు ఆకస్మిక తనిఖీలతో పనుల్లో ఏమాత్రం వేగం తగ్గకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 17వ తేదీన మరోసారి పనులను పరిశీలించేందుకు వెళుతున్నారు. నిన్నటివరకు నెలల లక్ష్యాలను నిర్దేశించుకోగా.. ఈ వర్కింగ్ సీజన్‌ను ఏమాత్రం వృథా చేయొద్దనే ఉద్దేశంతో మంత్రి హరీశ్‌రావు రోజుల వ్యవధి లక్ష్యాలను సైతం స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

మోటరు ఆగితే ఆయనకు నిద్రపట్టదు!

ఎత్తిపోతల పథకాల్లో మోటర్లకు సంబంధించిన అంశాలకు పెద్దదిక్కుగా కే పెంటారెడ్డి ఉన్నారు. దశాబ్దంన్నరగా ఆసియాలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాలకు తెలంగాణ వేదికగా నిలుస్తుంటే.. ప్రతిదాంట్లోనూ పెంటారెడ్డి భాగస్వామ్యం తప్పనిసరి. ఉమ్మడి రాష్ట్రంలో చిన్న, పెద్ద హైడ్రో పవర్ స్టేషన్లలోనూ ఆయన పాత్ర ఉన్నది. 1970లో ఓయూ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఎలక్ట్రికల్ విభాగంలో బీఈ పూర్తిచేసిన పెంటారెడ్డి.. 1972లో ఎలక్ట్రిసిటీ బోర్డులో ఇంజినీర్‌గా చేరారు. శ్రీశైలం, సాగర్, అప్పర్ సీలేరు, లోయర్ సీలేరు, పోచంపాడు, పెన్నహోబిలం.. ఇలా ఉమ్మడి ఏపీలోని ప్రతి హైడ్రోపవర్ స్టేషన్ నిర్మాణంలో పెంటారెడ్డి పనిచేశారు. 2002లో పదవీ విరమణ చేశారు. నల్లగొండ జిల్లాలో నిర్మించిన ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకంలో ఆయన పంపులు, మోటర్లకు సంబంధించిన అంశాలను పర్యవేక్షించారు. ఆ ప్రాజెక్టులో పంపులు, మోటర్ల బిగింపు, పర్యవేక్షణ బాధ్యత బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించిన దరిమిలా ఆ సంస్థ తరపున పెంటారెడ్డి నిర్వహణ బాధ్యతను చూసుకున్నారు. ఆపై తెలంగాణ ఉద్యమంలో విశ్రాంత ఇంజినీర్ల వేదికలో పనిచేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కృష్ణా, గోదావరి నదులపై పెద్దఎత్తున సాగునీటి ప్రాజెక్టులను కొనసాగిస్తున్న దరిమిలా.. ఎత్తిపోతల పథకాలకు సంబంధించి సుదీర్ఘ అనుభవం, అదే సమయంలో తెలంగాణ అంటే అమితమైన ప్రేమ ఉన్న పెంటారెడ్డిని సీఎం కేసీఆర్ గుర్తించి 2015, మే 15న ఎత్తిపోతల పథకాల సలహాదారుగా నియమించారు. అప్పటినుంచి నిర్విరామంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రామడుగు పంపుహౌజ్‌లో 'నమస్తే తెలంగాణ'తో ఆయన తన భావాలను పంచుకున్నారు. 'తెలంగాణ పరిధిలోని ఏ ఎత్తిపోతల పథకంలోనైనా ఉన్నపళంగా మోటరు ఆగిందని ఫోన్‌వస్తే నిద్రపట్టదు. అర్ధరాత్రి ఫోన్‌వచ్చినా తెల్లారేసరికి వచ్చేస్తా'అని చెప్పారు. వాస్తవంగా ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తే ఆయనకు లక్షల రూపాయల జీతం వస్తుంది. ఇదే విషయాన్ని ఆయన ముందు ఉంచితే... నాకు జీతం ముఖ్యం కాదు, ఒక కంపెనీలో పనిచేస్తే ఒక్క ప్రాజెక్టులోనే పనిచేయాలి. కానీ ఇప్పుడు ప్రభుత్వ సలహాదారుగా ఉన్నందున అన్ని ప్రాజెక్టుల్లో పనిచేసే అవకాశం దొరికిందని వ్యాఖ్యానించారు. 1982లో జపాన్‌కు వెళ్లి ఎత్తిపోతల పథకాల్లో వినియోగించే పంపులు, మోటర్లపై శిక్షణ తీసుకున్నానని, పలుదేశాల్లో పర్యటించి, వాటిని పరిశీలించానని తెలిపారు. అదే అనుభవం ఇప్పుడు తెలంగాణ స్వీయపాలనలో రూపుదిద్దుకుంటున్న సాగునీటి ప్రాజెక్టులకు ఉపయోగపడటం అనేది తన అదృష్టమని అన్నారు. సీఎం కేసీఆర్ స్వప్నం ఫలించి తెలంగాణ కోటి ఎకరాల మాగాణం కావాలనేది తన కోరిక అని, ఆ భగీరథయత్నంలో తాను కూడా భాగస్వామిని కావడం సంతోషంగా ఉందని పెంటారెడ్డి చెప్పారు.



పీబీఎల్ విజేత హైదరాబాద్

■ ఫైనల్లో బెంగళూరుపై గెలుపు

హైదరాబాద్: కీలక సమయంలో అద్భుతంగా పోరాడిన హైదరాబాద్ హంటర్స్.. తొలి సారి పీబీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో హంటర్స్ 4-3తో బెంగళూరు బ్లాస్టర్స్‌పై గెలిచింది. ఇరుజట్ల స్కోరు 3-3తో సమమైన దశలో హైదరాబాద్ మిక్స్‌డ్ ద్వయం బెర్నాడెత్-సాత్విక్ సాయిరాజ్ 15-11, 15-12తో కిమ్ సా రంగ్-సిక్కీ రెడ్డిపై గెలిచి తమ జట్టుకు టైటిల్‌ను అందించారు. పురుషుల డబుల్స్‌లో కిడో-సియోంగ్ (హైదరాబాద్) 9-15, 10-15తో మథియాస్-కిమ్ సా రంగ్ చేతిలో ఓడింది. కానీ పురుషుల ట్రంప్ మ్యాచ్‌లో లీ హున్ 15-7, 15-13తో శుభాంకర్ పై నెగ్గడంతో హైదరాబాద్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. కీలకమైన ట్రంప్ మ్యాచ్‌లో విక్టర్ అక్సెల్‌సన్ 15-8, 15-10తో సాయి ప్రణీత్‌ను ఓడించి బెంగళూరును 3-2 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఈ దశలో మహిళల సింగిల్స్‌లో మారిన్ (హైదరాబాద్) 15-8, 15-14తో గిల్‌మోర్‌పై గెలిచి స్కోరును 3-3తో సమం చేసింది.

కుర్రాళ్లు కుమ్మేశారు

ఆస్ట్రేలియాపై భారత్ భారీ విజయం

చెలరేగిన పృథ్వీ షా, మన్‌జ్యోత్, గిల్ ● అండర్-19 ప్రపంచకప్


పృథ్వీ షా (94)

మౌంట్ మౌగని: టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత యువ జట్టు అండర్-19 ప్రపంచకప్‌లో శుభారంభం చేసింది. ఆల్‌రౌండ్ షోతో అదురగొడుతూ.. పటిష్ఠమైన ఆస్ట్రేలియాను నిలువునా వణికించింది. దీంతో ఆదివారం జరిగిన గ్రూప్-బి డేనైట్ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 100 పరుగుల భారీ తేడాతో గెలిచి రెండు పాయింట్లు ఖాతాలో వేసుకున్నది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 328 పరుగులు చేసింది. కెప్టెన్ పృథ్వీ షా (100 బంతుల్లో 94; 8 ఫోర్లు, 2 సిక్సర్లు) వీరవిహారం చేశాడు. ఎలాంటి రిస్క్ లేకుండా భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. మన్‌జ్యోత్ కల్రా (99 బంతుల్లో 86; 12 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి తొలి వికెట్‌కు 180 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించాడు. వన్‌డౌన్‌లో శుభ్‌మన్ గిల్ (54 బంతుల్లో 63; 6 ఫోర్లు, 1 సిక్స్) సమయోచితంగా రాణించాడు. ఈ ముగ్గురు కలిసి ఆసీస్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యాన్ని చూపెట్టారు. మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ కూడా భారీ హిట్టింగ్‌కు దిగడంతో భారత్ సులువుగా 300ల స్కోరు దాటింది. ఎడ్వర్డ్స్ 4 వికెట్లు తీశాడు.

భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆస్ట్రేలియా 42.5 ఓవర్లలో 228 పరుగులకు కుప్పకూలింది. ఆరంభం నుంచే టీమ్‌ఇండియా పేసర్లు నాగర్‌కోటి (3/29), మావి (3/45) కంగారూలకు చుక్కలు చూపెట్టారు. కట్టుదిట్టమైన లైన్ అండ్ లెంగ్త్‌తో 150 కేఎంపీహెచ్ వేగంతో బంతులు వేస్తూ కట్టడి చేశారు. ఎడ్వర్డ్స్ (90 బంతుల్లో 73; 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా, హోల్ట్ (39), మిర్లో (38) ఫర్వాలేదనిపించారు. మ్యాచ్ మధ్యలో స్పిన్నర్లు కూడా పరుగులు నిరోధించడంతో ఆసీస్ కోలుకోలేకపోయింది. మంగళవారం జరిగే రెండో మ్యాచ్‌లోభారత్.. పపువా న్యూగినియాతో తలపడుతుంది.

సెమీస్‌లో భారత్

అంధుల ప్రపంచకప్

దుబాయ్: వరుస విజయాలతో హోరెత్తించిన భారత అంధుల క్రికెట్ జట్టు.. ప్రపంచకప్‌లో సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఆదివారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో నేపాల్‌పై గెలిచింది. అజ్మాన్‌లోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా నేపాల్ 37.5 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసింది. టీమ్‌ఇండియా బౌలర్లు ప్రకాశ్ 2, అజయ్, రంభీర్, ప్రేమ్, జాఫర్ తలా ఓ వికెట్ తీశారు. తర్వాత భారత్ 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. అజయ్ గారియా (20 బంతుల్లో 54; 6 ఫోర్లు), మహేందర్ (30 బంతుల్లో 40), రంభీర్ (28 బంతుల్లో 38)లు చెలరేగి ఆడారు. ఈనెల 17న జరిగే సెమీస్‌లో భారత్.. బంగ్లాదేశ్‌తో తలపడుతుంది.


రిషబ్ (116★)

32 బంతుల్లోనే శతకం

ఢిల్లీ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ సరికొత్త రికార్డు

న్యూఢిల్లీ: పొట్టి ఫార్మాట్‌లో రికార్డుల పరంపర కొనసాగుతూనే ఉంది. రోహిత్ శర్మ (35 బంతుల్లో) ప్రపంచ రికార్డును మర్చిపోకముందే.. ఢిల్లీ వికెట్ కీపర్ రిషబ్ పంత్ (38 బంతుల్లో 116 నాటౌట్; 8 ఫోర్లు, 12 సిక్సర్లు) దేశవాళీల్లో ఫాస్టెస్ట్ సెంచరీ కొట్టేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో పంత్ ఈ ఘనత అందుకున్నాడు. ఈ ఢిల్లీ ప్లేయర్ కేవలం 32 బంతుల్లోనే సెంచరీ సాధించడం విశేషం. భారత్ తరపున టీ20ల్లో ఇదే ఫాస్టెస్ట్ శతకం. ఓవరాల్‌గా పొట్టి ఫార్మాట్‌లో రెండోది. అంతకుముందు క్రిస్ గేల్ (30 బంతుల్లోనే) ఐపీఎల్ మ్యాచ్‌లో సెంచరీ బాదాడు. రిషబ్ వీరబాదుడుతో ఢిల్లీ జట్టు 10 వికెట్ల తేడాతో హిమాచల్ ప్రదేశ్‌పై గెలిచింది. ముందుగా హిమాచల్ 20 ఓవర్లలో 144/8 స్కోరు చేయగా, ఢిల్లీ 11.4 ఓవర్లలోనే 148 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. గంభీర్ (30 నాటౌట్) రాణించాడు.

హైదరాబాద్ ఓటమి

విశాఖపట్నం: సౌత్‌జోన్‌లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 16 పరుగుల తేడాతో తమిళనాడు చేతిలో ఓడింది. 194 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో హైదరాబాద్ 177 పరుగులకే కుప్పకూలింది. తన్మయ్ (59), రాయుడు (53) మినహా మిగతా వారు విఫలమయ్యారు. తాజా విజయంతో తమిళనాడు, కర్ణాటక జట్లు సూపర్ లీగ్ దశకు అర్హత సాధించాయి.

ఆనంద్ రెండో గేమ్ డ్రా

విక్ అన్ జీ (నెదర్లాండ్స్): భారత గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్.. టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీ రెండో గేమ్‌ను డ్రాగా ముగించాడు. ఆదివారం కర్జాకిన్ సెర్గి (రష్యా)తో జరిగిన ఈ గేమ్‌ను 31 ఎత్తుల వద్ద డ్రా చేసుకున్నాడు. అంతకుముందు జరిగిన తొలిరౌండ్‌లో విషీ 51 ఎత్తులతో మాక్సిమ్ మత్‌కోవ్ (రష్యా)పై గెలిచాడు. నాలుగేండ్ల తర్వాత ఈ టోర్నీలో ఆడుతున్న ఆనంద్.. రెండు రౌండ్ల అనంతరం 1.5 పాయింట్లతో కొనసాగుతున్నాడు.

పట్టు చిక్కలేదు..!

పోరాడుతున్న కోహ్లీ

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 183/5

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 335 ఆలౌట్

తొలి రోజు ఆధిపత్యాన్ని చూపెట్టిన భారత్.. రెండో రోజు చతికిలపడింది. బౌలర్ల నిరాశజనక ప్రదర్శనకు తోడు బ్యాట్స్‌మెన్ ఘోర వైఫల్యంతో రెండో టెస్టులో టీమ్‌ఇండియాకు ఇంకా పట్టు చిక్కలేదు. పిచ్ అనుకూలంగా లేకపోయినా.. సఫారీ పేసర్లు పరుగులు నిరోధించడంలో సఫలమయ్యారు. అయితే కెప్టెన్ విరాట్ ఇంకా క్రీజులో కొనసాగుతుండటం ఒక్కటే మనకు ఊరట కలిగించే అంశం. ఓవరాల్‌గా తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసిన దక్షిణాఫ్రికా ప్రస్తుతానికి ఆధిక్యంలో కొనసాగుతున్నది.


కోహ్లీ (85★)

సెంచూరియన్: సఫారీ గడ్డపై భారత బ్యాట్స్‌మెన్ మరోసారి చతికిలపడ్డారు. కెప్టెన్ విరాట్ కోహ్లీ (130 బంతుల్లో 85 బ్యాటింగ్; 8 ఫోర్లు) ఒంటరి పోరాటం మినహా.. మిగతావారు తక్కువ స్కోర్లకే వెనుదిరగడంతో.. రెండో టెస్టులో టీమ్‌ఇండియా ఎదురీదుతున్నది. ఆదివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 61 ఓవర్లలో 5 వికెట్లకు 183 పరుగులు చేసింది. కోహ్లీతో పాటు హార్దిక్ పాండ్యా (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 113.5 ఓవర్లలో 335 పరుగులకు ఆలౌటైంది. డుప్లెసిస్ (63) అర్ధసెంచరీతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ప్రస్తుతం విరాట్‌సేన ఇంకా 152 పరుగులతో వెనుకబడి ఉంది.

విరాట్ ఒక్కడే..

లంచ్‌కు కొద్ది ముందు బ్యాటింగ్‌కు దిగిన భారత్‌ను సఫారీ పేసర్లు బాగా ఇబ్బంది పెట్టారు. అనుభవజ్ఞుడు మురళీ విజయ్ (46) ఆత్మస్థైర్యంతో ఆడినా.. లోకేశ్ రాహుల్ (10) ఫిలాండర్ బంతులను ఎదుర్కొలేకపోయాడు. దీంతో 10వ ఓవర్‌లోనే మోర్కెల్ దెబ్బకు రాహుల్ పెవిలియన్ బాట పట్టాడు. తర్వాతి బంతికే పుజార (0) లేని పరుగు కోసం ప్రయత్నించి వెనుదిరిగాడు. ఫలితంగా 2 బంతుల్లో రెండు వికెట్లు పడటంతో టీమ్‌ఇండియా 28/2 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దశలో విరాట్ సాధికారికంగా ఆడాడు. రెండోఎండ్‌లో విజయ్ కూడా మెరుగ్గా స్పందించడంతో ఇన్నింగ్స్ స్కోరు 100 పరుగులకు చేరింది. ఇక ఫర్వాలేదనుకుంటున్న దశలో ఇన్నింగ్స్ 37వ ఓవర్‌లో స్పిన్నర్ మహారాజ్.. విజయ్‌ను బోల్తా కొట్టించడంతో మూడో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. రోహిత్ (10) మరోసారి నిరాశపర్చాడు. దూసుకొచ్చే బంతులను డిఫెన్స్ చేసే క్రమంలో వికెట్ల ముందు దొరికిపోయాడు. బ్యాట్స్‌మన్ రివ్యూకు వెళ్లినా ఫలితం అనుకూలంగా రాలేదు. విరాట్‌తో నాలుగో వికెట్‌కు 25 పరుగులు జోడించి వెనుదిరిగాడు. పార్థివ్ పటేల్ (19) అండతో కోహ్లీ ఇన్నింగ్స్‌ను నడిపించే ప్రయత్నం చేసినా పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. ఓవరాల్‌గా 164 పరుగుల వద్ద భారత్ ఐదో వికెట్ చేజార్చుకుంది.

ఇషాంత్ డబుల్

269/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన డుప్లెసిస్ (63), కేశవ్ మహారాజ్ (18) నిలకడగా ఆడే ప్రయత్నం చేశారు. 99వ ఓవర్‌లో షమీ.. మహారాజ్‌ను ఔట్ చేసి ఏడో వికెట్‌కు 31 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు.టెస్టుల్లో షమీకి ఇది వందో వికెట్. 104 ఓవర్ (అశ్విన్) వరుస బంతుల్లో రబడ (11) ఇచ్చిన రెండు క్యాచ్‌లను కోహ్లీ, పాండ్యా వదిలేశారు. ఈ క్రమంలో డుప్లెసిస్ 17వ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, రబడతో కలిసి ఎనిమిదో వికెట్‌కు 42 పరుగులు జోడించాడు. ఈ దశలో ఇషాంత్ తన వరుస ఓవర్లలో రబడ, డుప్లెసిస్‌లను ఔట్ చేశాడు. ఆ వెంటనే మోర్కెల్ (6) వెనుదిరగడంతో సఫారీ ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఓవరాల్‌గా ప్రొటీస్ జట్టు 89 పరుగులకు చివరి 7 వికెట్లు చేజార్చుకుంది.

స్కోరు బోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 335 ఆలౌట్.

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) డికాక్ (బి) మహారాజ్ 46, రాహుల్ (సి అండ్ బి) మోర్కెల్ 10, పుజార రనౌట్ 0, కోహ్లీ బ్యాటింగ్ 85, రోహిత్ ఎల్బీ (బి) రబడ 10, పార్థివ్ (సి) డికాక్ (బి) నిజ్డి 19, పాండ్యా బ్యాటింగ్ 11, **ఎక్స్‌ట్రాలు:** 2, **మొత్తం:** 61 ఓవర్లలో 183/5. **వికెట్లపతనం:** 1-28, 2-28, 3-107, 4-132, 5-164. **బౌలింగ్:** మహారాజ్ 16-1-53-1, మోర్కెల్ 15-3-47-1, ఫిలాండర్ 9-3-23-0, రబడ 12-0-33-1, నిజ్డి 9-2-26-1.

రప్ఫాడించిన రాయ్

ఆసీస్‌పై ఇంగ్లండ్ గెలుపు


రాయ్ (180)

మెల్‌బోర్న్: యాషెస్ సిరీస్ చేజార్చుకున్న ఇంగ్లండ్.. వన్డేల్లో మాత్రం తొందరగానే గాడిలో పడింది. జాసన్ రాయ్ (151 బంతుల్లో 180; 16 ఫోర్లు, 5 సిక్సర్లు) దుమ్మురేపడంతో.. ఆదివారం జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై గెలిచింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో పర్యాటక జట్టు 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ముందుగా ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 8 వికెట్లకు 304 పరుగులు చేసింది. ఆరోన్ ఫించ్ (119 బంతుల్లో 107; 10 ఫోర్లు, 3 సిక్సర్లు), స్టొయినిస్ (60), మిచెల్ మార్ష్ (50) రాణించారు. ఫించ్, మార్ష్ నాలుగో వికెట్‌కు 118 పరుగులు జత చేశారు. చివర్లో స్టొయినిస్, పైనీ (27) ఆరో వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యాని నెలకొల్పారు. ప్లంకెట్ 3 వికెట్లు తీశాడు. తర్వాత ఇంగ్లండ్ 48.5 ఓవర్లలో 5 వికెట్లకు 308 పరుగులు చేసింది. రాయ్‌కు తోడుగా రూట్ (91 నాటౌట్) చెలరేగాడు. ఈ ఇద్దరు మూడో వికెట్‌కు 221 పరుగులు జోడించారు. ఆస్ట్రేలియా గడ్డపై అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన విదేశీ బ్యాట్స్‌మన్‌గా రాయ్ రికార్డులకెక్కాడు.

'ఆస్ట్రేలియన్'కు యుకీ అర్హత

ఉ. గం 5.30 నుంచి సోనీ సిక్స్‌లో


భాంబ్రీ

మెల్‌బోర్న్: భారత టెన్నిస్ స్టార్ యుకీ భాంబ్రీ.. మూడో ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు అర్హత సాధించాడు. ఆదివారం జరిగిన క్వాలిఫయింగ్ మూడో రౌండ్‌లో భాంబ్రీ 1-6, 6-3, 6-3తో పీటర్ పొలాన్స్కీ (కెనడా)పై నెగ్గాడు. గంటా 55 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత కుర్రాడు తొలిసెట్‌ను చేజార్చుకున్నా కీలక సమయంలో పుంజుకున్నాడు. మరో మ్యాచ్‌లో రామ్‌కుమార్ 4-6, 6-4, 4-6తో వాసెక్ పొస్పిసిల్ (కెనడా) చేతిలో ఓడి టోర్నీకి దూరమయ్యాడు. మరోవైపు సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ అయిన ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రా మ్యాచ్‌లు నేటి నుంచి మొదలుకానున్నాయి. స్పెయిన్ బుల్ నాదల్, స్విస్ స్టార్ ఫెదరర్, సెర్బియన్ జొకోవిచ్‌తో పాటు మహిళల సింగిల్స్‌లో టాప్ స్టార్లందరూ బరిలోకి దిగుతున్నారు. తొలిరౌండ్‌లో యుకీ.. మార్కస్ బగ్దాటిస్‌తో తలపడనున్నాడు.

ఫైనల్లో తెలంగాణ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్: ఆల్‌రౌండ్ షోతో అదురగొట్టిన తెలంగాణ బాలుర జట్టు.. జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 సూపర్ సెవెన్ క్రికెట్ టోర్నీలో ఫైనల్‌కు చేరింది. ఆదివారం జరిగిన సెమీస్‌లో తెలంగాణ జట్టు 5 వికెట్ల తేడాతో చత్తీస్‌గఢ్‌పై గెలిచింది. ముందుగా చత్తీస్‌గఢ్ 8 ఓవర్లలో 6 వికెట్లకు 76 పరుగులు చేసింది. పార్థ్ (20) మెరుగ్గా ఆడాడు. అనంతరం తెలంగాణ 8 ఓవర్లలో వికెట్ నష్టానికి 77 పరుగులు చేసింది. గణేశ్ (39) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. రెండో సెమీస్‌లో జమ్ముకాశ్మీర్ 30 పరుగుల తేడాతో పంజాబ్‌ను ఓడించింది. మూడోస్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో చత్తీస్‌గఢ్ 57 పరుగుల తేడాతో పంజాబ్‌పై నెగ్గింది. బాలికల విభాగం సెమీస్‌లో యూపీ జట్టు 6 వికెట్ల తేడాతో చత్తీస్‌గఢ్‌పై గెలువగా, రెండో మ్యాచ్‌లో డీఏవీ జట్టు 59 పరుగుల తేడాతో ఢిల్లీని ఓడించింది.



ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లోని నాగోబా ఆలయం

ఆదివాసీల సంస్కృతికి ప్రతీక నాగోబా

- ఈనెల 16 అర్ధరాత్రి జాతర ప్రారంభం
- గోదావరి జలాలతో కెస్లాపూర్ చేరుకున్న మెస్రం వంశీయులు

ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో నాగోబా జాతర ఈనెల 16న అర్ధరాత్రి ప్రారంభం కానుంది. మెస్రం వంశీయులు జన్నారం మండలం హస్తినమడుగు నుంచి పవిత్ర గోదావరి జలాలను తీసుకొని కాలినడకన కెస్లాపూర్‌కు చేరుకున్నారు. ఆదివాసీల ఐక్యత, సంస్కృతికి చిరునామాగా నిలిచే ఈ జాతరలో ప్రతి ఘట్టం ప్రత్యేకను సంతరించుకుంటుంది. ఏటా జరిగే ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఇందులో ప్రజాదర్బార్ ఘట్టం కీలకమైంది. మంత్రులు, కలెక్టర్, వివిధ శాఖల అధికారులు హాజరై గిరిజనుల సమస్యలకు పరిష్కారం చూపడం ఇక్కడి ప్రత్యేకత. 1946లో మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ సూచనతో నిజాంకాలం నుంచి ప్రభుత్వం అధికారికంగా ఇక్కడ దర్బార్ నిర్వహిస్తున్నది. జాతర నిర్వహణలో భాగంగా మెస్రం వంశీయులు గోదావరి జలాలతో శుక్రవారం కెస్లాపూర్‌కు చేరుకొని మర్రిచెట్ల వద్ద బసచేశారు.

జాతరలో ప్రత్యేకతలు..

పుష్యమాసం ప్రారంభంలో నెలవంక కనిపించిన రెండోరోజు మెస్రం వంశీయులు నాగోబాకు తొలిపూజ చేస్తారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగుకు దాదాపు 80 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి గోదావరి వద్ద హస్తినమడుగు దగ్గర పంచలింగాలకు పూజ చేసి కలశంతో పవిత్ర జలాలను తీసుకొస్తారు. గోదావరి జలాలను ఆలయ సమీపంలో మర్రిచెట్టుపై భద్రపరిచి అక్కడే బసచేస్తారు. పుష్య అమావాస్యకు ముందు రోజు 81 కుటుంబాల మెస్రం వంశస్థులు ఒకే చోట తూం (పితృ కర్మ) పూజలు చేస్తారు. పుష్య అమావాస్య గడియ మొదలుకాగానే మెస్రం వంశస్థులు తాము తీసుకొచ్చిన పవిత్ర గోదావరి జలాలతో నాగోబాను అభిషేకించడంతో జాతర ప్రారంభమవుతుంది.

ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రవెల్లి: నాగోబా జాతర ముందస్తు పూజల్లో భాగంగా కలెక్టర్ కుటుంబసమేతంగా శనివారం రాత్రి అక్కడికి చేరుకొని మెస్రం వంశీయులు నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం ఎంపీ నగేశ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

మేడారంలో 'హరిత' హోటల్

రూ.5.80 కోట్లతో నిర్మాణం

రెస్టారెంట్‌తోపాటు కాటేజీలు

జాతరలోపు ప్రారంభానికి సన్నాహాలు



మేడారంలో నిర్మిస్తున్న హరిత హోటల్

జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వం జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో హరిత హోటల్‌ను నిర్మిస్తున్నది. ఇందులో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణకు రూ.2 కోట్లతో భవనం, పర్యాటకులు విడిది చేసేందుకు రూ.3 కోట్లతో 10 కాటేజీలను సిద్ధం చేస్తున్నది. వీటితోపాటు హరిత హోటల్ వద్ద రూ.80లక్షలతో ఓపెన్ ఎయిర్ థియేటర్, లగ్జరీ టెంట్ ప్లాట్‌ఫామ్స్ కూడా నిర్మిస్తున్నది. మేడారంలో ఈ నెల 31నుంచి ఫిబ్రవరి 3వరకు సమ్మక్క సారలమ్మ మహాజాతర జరుగనున్నందున ఈలోపు హోటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్ వంటి మహానగరంలో సంపన్నులు విడిది చేసే స్టార్ హోటళ్లను తలపించేలా ఈ భవనాన్ని సిద్ధం చేస్తున్నారు. రిసెప్షన్ కౌంటర్‌తోపాటు ఫర్నిచర్ ఇందులో సమకూర్చుతున్నారు. ఇక హైక్లాస్ వాతావరణంతో పది కాటేజీలు నిర్మిస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్, కాటేజీల మధ్య ఓపెన్ ఎయిర్ థియేటర్, లగ్జరీ టెంట్ ప్లాట్‌ఫామ్స్ నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహించే భవనం, ఐదు కాటేజీల పనులు పూర్తయినట్టు గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ విభాగం ఏటూరునాగారం ఈఈ కోటిరెడ్డి వెల్లడించారు. ఈనెల 25వరకు అందుబాటులో కి తీసుకొస్తామన్నారు. బార్ అండ్ రెస్టారెంట్ భవనం, కాటేజీలు, ఓపెన్ ఎయిర్ థియేటర్, లగ్జరీ టెంట్ ప్లాట్‌ఫామ్స్ నిర్మించిన తర్వాత పర్యాటక శాఖకు స్వాధీనం చేయనున్నట్టు తెలిపారు. ఆ తర్వాత పర్యాటక అభివృద్ధి సంస్థ మేడారంలో ఈ హరితహోటల్ నిర్వహించనున్నది. కాటేజీల అద్దెను ఖరారు చేయనుంది. అద్దె, కాటేజీలు ఖాళీ ఉన్నాయా లేదా అనే సమాచారం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పర్యాటకులకు అందుబాటులోకి తేనుంది.



పోటెత్తిన భక్తులు

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: సమ్మక్కసారలమ్మ మహాజాతర సమీపిస్తుండటంతో ఆదివారం మేడారంలో భక్తులు పోటెత్తారు. రెండున్నర లక్షలకు పైగా భక్తులు సమ్మక్కసారలమ్మను దర్శించుకుని ముందస్తు మొక్కులు తీర్చుకున్నట్టు అధికారులు తెలిపారు. జాతర సమయంలో రద్దీ ఎక్కువగా ఉంటుందనే ఆలోచనతో భక్తులు ముందుగానే మేడారం వచ్చి వెళ్తున్నారు. సెలవు రోజులు కావడంతో లక్షలాదిగా మేడారం చేరుతున్నారు. ఎక్కువగా ప్రైవేటు వాహనాల్లో వస్తున్నారు. ఆదివారం మేడారం పరిసరాలు భక్తులతో నిండిపోయాయి.



బోధన్ మండలం పెంటాకుర్దులో నిజాంసాగర్ డీ-28 కెనాల్‌లో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

ఎకరా కూడా ఎండనియ్యం

చివరి ఆయకట్టు వరకూ నీరందిస్తాం: మంత్రి పోచారం

కోటగిరి/శక్కర్‌నగర్: నిజాంసాగర్, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద 2.10లక్షల ఎకరాల సాగుకు నీరందించేందుకు చర్యలు చేపట్టామని, చివరి ఆయకట్టు వరకు నీరిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఒక్క ఎకరా కూడా ఎండనియ్యమని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని పెంటాకుర్దు, సాలూరాక్యాంప్, కోటగిరి మండలంలోని కల్లూర్, పోతంగల్ చెక్‌పోస్టు, కోటగిరి మిర్జాపూర్‌క్యాంప్ వద్ద నిజాంసాగర్ కాల్వలను ఆదివారం ఆయన పరిశీలించారు. చివరి భూములకు నీరందలేదని రైతులు ఫిర్యాదు చేయడంతో కాల్వలు పరిశీలించి, స్థానిక సబ్ కలెక్టర్ అనురాగ్ జయంతి, అధికారులతో చర్చించి నీటిసరఫరాకు చర్యలు చేపట్టామన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా అప్పాజిపల్లి నర్సన్న గుట్టపై మాట్లాడుతున్న మంత్రి లక్ష్మారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

ఆధ్యాత్మిక రాష్ట్రంగా తెలంగాణ

ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత: మంత్రి లక్ష్మారెడ్డి

తిమ్మాజిపేట/జడ్చర్ల, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఆధ్యాత్మికంగా ముందుకు సాగుతున్నదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం అప్పాజిపల్లి నర్సన్న గుట్టపై లక్ష్మీనరసింహ్మ స్వామి కల్యాణంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆలయాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్ నిధులు భారీగా మంజూరు చేస్తున్నారన్నారు. యాదాద్రి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వల్లే ఎంజీకేఎల్‌ఐ పూర్తయిందన్నారు. అనంతరం మంత్రి లక్ష్మారెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం బూర్గుపల్లి, ఆలూరు గ్రామాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బాలానగర్ మండలం తిర్మలగిరిలో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పనులకు శంకుస్థాపన చేశారు. బూర్గుపల్లి శివారులో కర్వెన రిజర్వాయర్ పనులను మంత్రి పరిశీలించారు.



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పెండల్‌వాడలో గిరిజన కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి జోగు రామన్న

భూమిలేని గిరిజనులకు భూపంపిణీ

అటవీశాఖ మంత్రి జోగు రామన్న

జైనథ్: భూమిలేని గిరిజనులకు మూడెకరాల చొప్పున సాగు భూమిని ఇచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని అటవీశాఖ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పెండల్‌వాడలో రూ.5 లక్షల నిధులతో గిరిజన కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు.



నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో ఎమ్మెల్సీ కశిరెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు, గిరిజనులు

గులాబీ పార్టీలో భారీగా చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి వలసలు జోరందుకున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌నాయక్‌తోపాటు దాదాపు 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, గిరిజనులు ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో ఆదివారం టీఆర్‌ఎస్‌లో చేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మల్లెలమడుగు నుంచి 50 కుటుంబాల వారు, చింతిర్యాల ఎస్సీ కాలనీ నుంచి 98 కుటుంబాలకు చెందిన 213 మంది పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో, హైదరాబాద్‌లోని గోల్నాక డివిజన్ జిందాతిలస్మాత్ నగర్‌కు చెందిన ముస్లిం మైనార్టీలు పెద్ద సంఖ్యలో టీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ ఇంచార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.



మల్లన్న ఆలయంలో డిప్యూటీ సీఎం కడియం.. ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి, అరూరి రమేశ్, ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు, టీఆర్‌ఎస్ నేత తక్కళ్లపల్లి

మల్లన్నను దర్శించుకున్న డిప్యూటీ సీఎం కడియం

ఐనవోలు(వరంగల్): ఐనవోలు బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఆదివారం డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి కుటుంబ సమేతంగా మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, దాస్యం వినయ్‌భాస్కర్, తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, మేయర్ నన్నపునేని నరేందర్, వికలాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, భరత్‌కుమార్‌రెడ్డి, నాగుర్ల వెంకన్న, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు సమర్పించుకున్నారు.

వీరభద్రస్వామి సన్నిధిలో మంత్రి ఈటల

భీమదేవరపల్లి(వరంగల్): వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ దంపతులు, ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ మార్పాటి మహేందర్‌రెడ్డి, ఈవో దేవరాజు హరిప్రకాశ్‌రావు స్వామివారి జ్ఞాపికను ప్రదానం చేశారు. జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన వృక్షప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ఈటల, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ప్రారంభించారు. వృక్షప్రసాదం పంపిణీని ఇతర ఆలయాలు ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి ఈటల సూచించారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య దంపతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో వృక్షప్రసాదం స్వీకరిస్తున్న మంత్రి ఈటల



కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు

కమనీయం గోదాదేవి కల్యాణం

వేంకటేశ్వరాలయాన్ని అద్భుతక్షేత్రంగా తీర్చిదిద్దుతా: మంత్రి జగదీశ్‌రెడ్డి

కుడకుడరోడ్డు: సూర్యాపేటలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, గోదాదేవి సమేత శ్రీనివాస కల్యాణాన్ని ఆదివారం ఉదయం కమనీయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి జగదీశ్‌రెడ్డి కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలన్నీ నూతన వైభవాన్ని సంతరించుకుంటున్నాయన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎన్నో ఏండ్ల చరిత్ర గల వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అద్భుతక్షేత్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. శ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి సూచనలతో ఈ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

కుడకుడరోడ్డు(సూర్యాపేట): యువత అన్ని రంగాల్లో ముందుండాలని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 34 వార్డులో ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువకులకు క్రీడాసామగ్రిని పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళికా ప్రకాశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ వై వెంకటేశ్వర్లు, బడుగుల లింగయ్యయాదవ్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం

ఆటోను లారీ ఢీకొట్టడంతో నలుగురు

మరో రెండు ప్రమాదాల్లో ఒక్కొక్కరు



తంగెళ్ల తండా సమీపంలో ఆటోపైకి దూసుకొచ్చిన లారీ

టేకులపల్లి/ముల్కలపల్లి/బూర్గంపహాడ్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం చెందారు. ఇందులో టేకులపల్లి మండలంలో ఆటోను లారీ ఢీకొనడంతో నలుగురు ప్రాణాలు వదిలారు. వివరాలు ఇలా.. టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీ తంగెళ్లతండా సమీపంలో ఆగి ఉన్న ఆటోను లారీ ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మృతిచెందారు. కారేపల్లి మండలం పంతుల్యా నాయక్ తండాకు చెందిన జర్పుల వంశీ ఆటోలో అదే తండాకు చెందిన మాళోత్ మోతీలాల్(35) కుటుంబంతో కలిసి పాల్వంచలోని పెద్దమ్మతల్లి గుడికి వెళ్లారు. కార్యక్రమం ముగించుకుని ఆటోలో తిరిగి వస్తుండగా ఇల్లెందు క్రాస్‌రోడ్ వద్ద మరో ముగ్గురు ప్రయాణికులు ఆటోలో ఎక్కారు. తంగెళ్లతండా వద్ద డ్రైవర్ వంశీ ఆటోను రహదారి పక్కన నిలిపాడు. అదే సమయంలో ఇల్లెందు నుంచి అతివేగంగా వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టడంతో మోతీలాల్(35), రమేశ్(32), ఇల్లెందు జేకే కాలనీకి చెందిన ఎండీ రీమా(23)తో పాటుగా మరొకరు అక్కడిక్కడే మృతిచెందారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నది. సంఘటన స్థలాన్ని ఎస్పీ అంబర్‌కిశోర్‌ఝా పరిశీలించారు. మృతదేహాలను ఇల్లెందు సర్కార్ దవాఖానకు తరలించారు. టేకులపల్లి సీఐ దోమల రమేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ముల్కలపల్లికి చెందిన సోమాచారి(36) రోడ్డుపక్కన నిలబడి ఉండగా ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. బూర్గంపహాడ్‌కు చెందిన తాపీ మేస్త్రీ కుమ్మరపల్లి నర్సింహారావు(33) బైక్‌పై వస్తుండగా నాగినేనిప్రోలు రెడ్డిపాలెం వద్ద కొత్తగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.



కాగజ్‌నగర్‌లోని పేపర్ మిల్లును పరిశీలిస్తున్న జేకే పేపర్ మిల్లు ప్రతినిధులు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప(ఫైల్)

ఎస్పీఎం పునరుద్ధరణ వైపు అడుగులు

- ఇటీవల సందర్శించిన జేకే పేపర్ మిల్లు ప్రతినిధులు
- 17, 18 తేదీల్లో రానున్న వెస్ట్‌కోస్టు పేపర్ మిల్లు యాజమాన్యం

కాగజ్‌నగర్, నమస్తే తెలంగాణ: కాగజ్‌నగర్ పట్టణంలో గత మూడున్నరేండ్లుగా మూత పడిన సిర్పూర్ పేపర్ మిల్లు పునరుద్ధరణ ప్రక్రియలో వేగం పుంజుకున్నది. ఈ మిల్లును తీసుకునేందుకు పలు కంపెనీలు ఆసక్తి కనబరుస్తుండటంతో కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతవారం జేకే పేపర్ మిల్లు ప్రతినిధులు మిల్లును సందర్శించి యంత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కర్ణాటకలోని దండెల్లి పేపర్ మిల్లు (వెస్ట్ కోస్ట్ పేపర్ మిల్లు) ప్రతినిధులు ఈనెల 17, 18వ తేదీల్లో మిల్లును సందర్శించనున్నారు. 500 టన్నుల కాగితం ఉత్పత్తి చేసే యంత్రాలను వెస్ట్ కోస్ట్ పేపర్ మిల్లు యజమాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో వారు ఈ మిల్లును తీసుకుని ఆ యంత్రాన్ని సిర్పూర్ పేపర్ మిల్లులో నెలకొల్పాలని యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు వారు కూడా మిల్లును తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు. మిల్లును తీసుకునేందుకు తొమ్మిది కంపెనీలు తమ సీల్డ్ కవర్లను ఐఆర్‌పీ(ఇంటీరియం రిజల్యుషన్ ప్రొఫెషనల్స్)కు అందజేయగా జేకే, వెస్ట్ కోస్ట్ పేపర్ మిల్లు యాజమాన్యాలు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నట్టు సమాచారం. ఐఆర్‌పీ సదరు సీల్డ్ కవర్లను ఫిబ్రవరి చివరి వారంలో తెరువనున్న నేపథ్యంలో ఆ లోగా మిగితా కంపెనీల ప్రతినిధులు సైతం సిర్పూర్ పేపర్ మిల్లును సందర్శించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తున్నది.

యువకుడిపై చిరుత దాడి



చిరుత దాడిలో గాయపడిన సంతోష్

ఖానాపూర్/పెంబి: పంటకు కాపలాకు వెళ్లిన యువకుడిపై ఆదివారం చిరుత దాడిచేసి గాయపరిచింది. వివరాలు ఇలా.. నిర్మల్ జిల్లా పెంబి మండలం అక్టోనిమడ ఆదివాసీ గూడానికి చెందిన ఆత్రం సంతోష్(20), మరో ఇద్దరు గ్రామస్థులతో కలిసి శివారులోని తన చేనుకు శనివారం రాత్రి కాపలా కోసం వెళ్లాడు. ఆదివారం ఉదయం వాగు దాటి ఇంటికి వచ్చే క్రమంలో అడవిలో నుంచి వచ్చిన ఓ చిరుత అకస్మాత్తుగా సంతోష్‌పై దాడిచేసి గాయపరిచింది. సంతోష్ కాళ్లకు, చేతులకు, పొట్ట భాగంలో గాయాలయ్యాయి. అతడి పెంపుడు కుక్కలు చిరుతపై ఎదురు దాడికి దిగడంతో పారిపోయి వాగు ఒడ్డున ఓ చెట్టుపైకి చేరింది. గాయపడ్డ సంతోష్‌ను నిర్మల్ దవాఖానకు తరలించారు.

తస్కరించిన పులి చర్మం స్వాధీనం

కాసిపేట రూరల్: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో గత నెల 18న చోరీ అయిన పులి చర్మాన్ని మంచిర్యాల జిల్లా కాసిపేటలో పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. సస్పెండైన బీట్ ఆఫీసర్ బిజ్జారి రవీందర్ భార్య సౌందర్య, బావమరిది దుర్గం వెంకటస్వామిలే సూత్రధారులని తేలడంతో వారిపై కేసు నమోదు చేశారు. కాసిపేట, బెజ్జూర్ ఎస్సైలు సతీశ్, శివప్రసాద్ కథనం ప్రకారం.. 2016లో మహారాష్ట్రలో పులిని వేటాడి చంపి చర్మాన్ని తరలిస్తుండగా బెజ్జూర్ అటవీ అధికారులు పట్టుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు అప్పటి ఎఫ్‌ఎస్‌వో వేణుగోపాల్, బీట్ ఆఫీసర్ బిజ్జారి రవీందర్(కాసిపేట వాసి)కు అప్పగించడంతో తమ గదిలో భద్రపరిచారు. గత డిసెంబర్ 18న చర్మం కనిపించకపోవడాన్ని గుర్తించిన అధికారులు ఈనెల 6న బెజ్జూర్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ క్రమంలో బీట్ ఆఫీసర్ రవీందర్‌ను సస్పెండ్ చేశారు. అతడి పాత్రపై అనుమానంతో విచారణ జరిపారు. అతని బావమరిదిని అదుపులోకి తీసుకొని విచారించడంతో విషయం బయటపడింది. రవీందర్‌కు తెలియకుండా బెజ్జూర్ నుంచి చర్మాన్ని మాయం చేసి వారు కాసిపేటకు తరలించి, అదే గ్రామానికి చెందిన దుర్గం సుమన్, దుర్గం పవన్ సహాయంతో సోమగూడెం, కాసిపేటలో చర్మాన్ని దాచి ఉంచారు. జన్నారంలో అమ్మేందుకు బేరం కుదుర్చుకొని గోమాస రాయలింగు అనే వ్యక్తి తన ఇంటిపై పులి చర్మంతో పాటు కాళ్లు, బ్యాగులో దాచి ఉంచారు. సమాచారం తెలుసుకొని పోలీసులు పులి చర్మాన్ని, కాళ్లు, గోర్లను స్వాధీనం చేసుకున్నారు. చర్మాన్ని అపహరించిన వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పులిచర్మం అపహరణలో సస్పెండైన బీట్ ఆఫీసర్ పాత్రతోపాటు పూర్తి దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.


LOT
LOT IS SMART
SMART IS LOT
సంక్రాంతి శుభాకాంక్షలు
సంక్రాంతి సంబరాలు
LOT 150 STORES
మన జగిత్యాల లో నూతనముగా ప్రారంభించబడిన షోరూమ్
Yawar Road, Jagitial. Ph : 7995112555
iPhone 6 (32GB)
Gold Color Available
HOT DEAL
Rs. 1000/- CASH BACK*
motorola
hellomotohub
say hello to the world of motorola
Buy MOTO E4
Worth of ₹3299/- Mixer FREE
5%
Paytm CASH BACK
*on selected brands
HDFC BANK
We understand your world
Credit / Debit Cards
Special Gift On
honor
Holly 3+
3GB + 32GB
Assured Gift On
oppo All Models
vivo All Models
Buy Lava X41 Plus
Worth of ₹3999/- Wet Grinder FREE
Buy Gionee A1 Lite
Worth of ₹3999/- Wet Grinder FREE
Buy Nokia 5 / 3
Worth of ₹3299/- Mixer FREE
Buy LG Stylus 3
Worth of ₹2399/- JioFi FREE
Buy Micromax X706
Worth of ₹899/- Bag FREE
mi All Models Stock Available
Assured Gift On Every Mobile
ఫైనాన్స్ సదుపాయం కలదు.
BAJAJ FINSERV EMI
HOME CREDIT
CAPITAL FIRST
HDFC BANK We understand your world
HDB FINANCIAL SERVICES
Buy Panasonic A3 Pro
Worth of ₹1999/- GIFT FREE
Buy 1 Get 1
SMART JODI Offer
Only @ ₹3999
Karbonn A45
Buy 1 Get 2
COMBO Offer
Only @ ₹1999
*Conditions Apply
www.lotmobiles.com | Helpline: 74393 23456
Follow us on


మా డీలర్లకు మరియు వినియోగదారులకు
సంక్రాంతి శుభాకాంక్షలు
VIJAYALAKSHMI DALL MILL
DEER BRAND
విజయలక్ష్మి డీర్
మినపగుండ్లు
28 సంవత్సరాల నుండి
అదే రుచి... అదే నాణ్యత
Quality you can trust
Since 1989
SORTEX QUALITY
Orid Rounds
Net Wt. 1kg
Call: 9985 668886, 9985 668887
AVAILABLE
IN 1 KG & 50 KG PACKETS

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
సోమవారం 15 జనవరి 2018
WWW.NTNEWS.COM

వారసత్వానికి వన్నె తెచ్చిన

లక్ష్మీవేణు



దేశంలోని పారిశ్రామికవేత్తలు తమ వారసులుగా కుమారులనే కాకుండా, కూతుళ్లను కూడా పరిచయం చేస్తున్నారు. తల్లిదండ్రుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న యువ పారిశ్రామికవేత్తలు తమదైన స్టైల్లో ఆయా పరిశ్రమలను, సంస్థలను లాభాల బాటలో పయనింపజేస్తున్నారు. పలువురు మహిళలు చిన్నతనంలోనే ఫ్యామిలీ బిజినెస్‌లో ఇన్‌వాల్వ్ అవుతూ తమకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అలాంటి వారిలో డాక్టర్ లక్ష్మీవేణు ఒకరు. దేశంలోని ప్రముఖ వాహన ఉత్పత్తుల సంస్థ టీవీఎస్ మోటార్స్ చైర్మన్ వేణు శ్రీనివాస్ కుమార్తె డైరెక్టర్‌గా ప్రవేశించి పలు విభాగాలను స్వయంగా నిర్వహిస్తున్నారు. అతి తక్కువ సమయంలోనే టీవీఎస్ సంస్థను అభివృద్ధి పథంలో నడిపించడంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న లక్ష్మీవేణు ఈ వారం సక్సెస్ మంత్ర.

దేశంలోనే ప్రముఖ కార్పొరేట్ సంస్థ టీవీఎస్ మోటార్స్. ఈ సంస్థ చైర్మన్ వేణు శ్రీనివాసన్ కుమార్తె లక్ష్మీవేణు. అంతేకాదు ఇన్ఫోసిస్ కంపెనీ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి కుమారుడు రోహన్‌మూర్తి భార్య ఈమె. లక్ష్మి టీవీఎస్ మోటార్స్, సుందరం క్లేటస్ బోర్డులలో సభ్యురాలిగా ఉన్నారు. అదే సందర్భంలో అకాడమిక్స్, కార్పొరేట్ ప్రపంచంలోనూ ప్రవేశం ఉన్న బ్రిలియంట్. ఆమె తన అన్నలతో కలిసి టీవీఎస్ కంపెనీ వ్యాపారాన్ని అభివృద్ధి చేస్తున్నారు. టీవీఎస్ సంస్థను అభివృద్ధి చేయడంలో కీలక బాధ్యతలు మోస్తున్నారు. ప్రస్తుతం ప్రొడక్ట్ డిజైన్, సేల్స్, మార్కెటింగ్, బిజినెస్ స్ట్రాటజీస్, కార్పొరేట్ అఫైర్స్ లాంటి అంశాలను పర్యవేక్షిస్తున్నారు.

వ్యక్తిగతం, చదువు

డాక్టర్ లక్ష్మీవేణు 1983లో జన్మించారు. వేణు శ్రీనివాసన్, మల్లికాశ్రీనివాసన్‌ల ఒక్కగానొక్క కూతురు. ప్రముఖ పారిశ్రామికవేత్త తిరుకురుంగుడి వేంగరం టీవీ సుందరం అయ్యంగార్ మనవరాలు. తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని సిష్యా పాఠశాలలో తన ప్రాథమిక విద్యను పూర్తి చేసిన ఆమె అమెరికాలోని యేల్ యూనివర్సిటీలో చేరి ఎకానమిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీని పూర్తి చేశారు. ఆ తర్వాత బ్రిటన్‌లోని కోవెంట్రీలో వార్విక్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో డాక్టరేట్ సాధించారు.

పారిశ్రామిక రంగ ప్రవేశం

డాక్టర్ వేణు 2003 లో ఆటో పరిశ్రమలోకి ప్రవేశించారు. ఆమె TVS మోటార్స్‌లో మేనేజ్‌మెంట్ శిక్షణ తీసుకున్నారు. వ్యాపారంలో ఇన్, అవుట్‌లను తెలుసుకోవడం కోసం ఆమె బెంగుళూరులోని సంస్థ ప్రధాన కార్యాలయం, హోసూర్‌లోని ఉత్పాదక విభాగాల కేంద్రం మధ్య తరచుగా పర్యటనలు చేశారు. పని విషయంలో ఆమెకున్న అంకిత భావం ఆమెను కార్పొరేట్ రంగంలో తక్కువ సమయంలోనే పైకి తీసుకు వచ్చింది. 2010లో ఆమె సుందరం-క్లేటన్ లిమిటెడ్‌లో పూర్తికాల డైరెక్టర్ స్థాయికి చేరుకున్నారు. ఒక సంవత్సరం తర్వాత ఆమె ప్రపంచ వ్యాపారాభివృద్ధి, వ్యూహం విభాగానికి వైస్ ప్రెసిడెంట్‌గా నియమిలయ్యారు. 2014లో ఆమె జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, TVS మోటార్ కంపెనీ లిమిటెడ్‌కు నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కూడా నియమితులయ్యారు. డాక్టర్ లక్ష్మీవేణు ప్రస్తుతం భారతదేశంలో ఆటోమొబైల్ రంగంలో ఉన్న ముగ్గురు మహిళలలో ఒకరిగా గుర్తింపు పొందారు. అందులో ఒకరు తన తల్లి మల్లికా శ్రీనివాసన్ కావడం విశేషం. కేవలం 30 సంవత్సరాల వయస్సులో వ్యాపార బాధ్యతలను తీసుకోవడం అంత సాధారణ విషయమేం కాదు.

తల్లిదండ్రులే స్ఫూర్తి...

చెన్నై వ్యాపార శ్రేణిలో భాగమైన 'లక్ష్మీవేణు' మూడు 'ఎం'లతో అనుబంధాన్ని కలిగి ఉన్నారు. అవి మద్రాస్ క్లబ్, మెరీనా బీచ్; మ్యూజిక్ అకాడమీ. అదే సమయంలో ఆమె చెన్నై సంప్రదాయ విలువలకు కుటుంబం, విద్య, సంస్కృతికి ప్రాధాన్యాన్నిస్తూనే సింప్లీసిటీని కలిగి ఉంటారు. లక్ష్మి వేణు వ్యాపారవేత్తగా ఎదగడంలో వారి తల్లిదండ్రుల నుంచి ప్రేరణ పొందారు. పారిశ్రామిక రంగంలో పురుషుల కంటే మహిళలు భిన్న సవాళ్లను ఎదుర్కొంటున్నట్లు ఆమె తల్లి నేర్పారు. మరొక వైపు, స్త్రీలు తమ చుట్టూ ఉన్న సమూహాలలో విభిన్న దృక్కోణాలను తీసుకురాగలుగుతారని కూడా చెప్పేవారు. నాణ్యత, ఉద్యోగుల విశ్వాసం, ఉద్యోగుల, పంపిణీదారులతో నమ్మదగిన సంబంధాలను కొనసాగించాలని తండ్రి బోధించారు.

స్వతంత్రంగా ఎదిగి..

డా. లక్ష్మీవేణు తన తల్లిదండ్రులకు కార్బన్ కాఫీగా ఉండాలని అనుకోలేదు. ఆమె తల్లిదండ్రులు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన కాలంతో పోలిస్తే ప్రస్తుతం ఉన్న ప్రపంచం వేరని ఆమె నమ్మారు. నేటి కార్పొరేట్ వాతావరణంలో మార్పు రావడంతో పాటు ఆవిష్కరణ, స్వీకరణ రంగంలో క్లిష్టమైన పరిస్థితులు ఉన్నాయని ఆమె గుర్తించారు. అందువలన, ఆమె ప్రస్తుత పోకడలను గమనిస్తూ, త్వరగా స్పందించగలగాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఒక నాయకుడు తన అంతర్గత సామర్థ్య చర్యలను అభివృద్ధి చేయగలగాలి. ఇది దీర్ఘకాల వృద్ధి, మనుగడ కోసం చాలా ముఖ్యమైనవి.. అని ఆమె విశ్వసించారు. ప్రస్తుతం టీవీఎస్ మోటార్స్ భారతదేశంలో మూడో అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీ సంస్థ. లక్ష్మీవేణు తన అదర్శ వ్యాపార సూత్రాలతో టీవీఎస్ సంస్థను ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంచడానికి ప్రయత్నిస్తున్నారు.

వారసత్వాన్ని కొనసాగిస్తూ

లక్ష్మీవేణు ఆటో వ్యాపారంలో స్థిరపడిన కుటుంబంలో సభ్యురాలు. ఆమె ముత్తాత టీ.వీ. సుందరం అయ్యంగార్ తన పేరుతో ఒక బస్ కంపెనీని స్థాపించారు. అది ప్రస్తుత టీవీఎస్ సంస్థకు మాతృసంస్థ. ఆమె తండ్రి వేణు శ్రీనివాసన్ టీవీఎస్ గ్యారెజీలో మెకానిక్‌గా కెరీర్ ప్రారంభించారు. 1979 నాటికి సుందరం క్లేటన్ లిమిటెడ్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎదిగారు. 2002 నాటికి టీవీఎస్ మోటర్ కంపెనీకి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆమె తల్లి మల్లికా శ్రీనివాసన్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ట్రాక్టర్ల ఉత్పత్తి పరిశ్రమ అయిన 'టెఫ్'కు చైర్‌పర్సన్. ఆ సంస్థ 75 దేశాలలో తన వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నది. లక్ష్మి సోదరుడు సుదర్శన్ వేణు 2014లో టీవీఎస్‌కు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్. అలాగే వారి కజిన్స్ అరుంధతి, ఆరతికృష్ణలు కూడా పారిశ్రామిక రంగంలో అడుగుపెట్టి సుందరం ఫాస్టనర్స్‌లో అడిషనల్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా 2005, 2006లో పనిచేశారు.



సౌర గమనాన్ని అనుసరించే పండుగ

హిందూ పండుగల్లో ఏ ఒక్క పండుగ కూడా ప్రతీ సంవత్సరం ఒకే తేదీన రాదు. అవి తిథిని బట్టి మారుతూ ఉంటాయి. కాస్త ముందుగానో, ఆలస్యంగానో వస్తుంటాయి. కానీ మకరసంక్రాంతి మాత్రం ఏటా ఒకే తేదీన (ఆంగ్ల తేదీ ప్రకారం కూడా) రావడం వెనుక ఉన్న రహస్యం ఏమిటో తెలుసా?

సంక్రాంతి అంటే సంక్రమణమని అర్థం. రాశుల ఆధారంగా సూర్యుడు క్రమంగా పూర్వరాశి నుంచి ఉత్తర రాశిలోకి ప్రవేశించడమే సంక్రాంతి. అందుకే సంవత్సరానికి పన్నెండు సంక్రాంతులు ఉంటాయి. వాటిలో పుష్యమాసం, హేమంత ఋతువులో సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే మకర సంక్రాంతికే అధిక ప్రాధాన్యత. ఆంగ్ల కాలమానం ప్రకారం చూసినా జనవరి 15న సూర్యుడు ఉత్తరాయణ పథంలోకి అడుగుపెడుతాడని స్పష్టమవుతున్నది. అందుకే అన్ని పండుగల్లో సౌర గమనాన్ని అనుసరించి వచ్చే ప్రత్యేక పండుగగా సంక్రాంతికి గుర్తింపు ఉన్నది. క్యాలెండర్ కూడా సౌరగమనాన్నే అనుసరిస్తుంది కాబట్టి, ఏటా జనవరి 15వ తేదీనే మకర సంక్రాంతి వస్తుంది. ఇక మిగిలిన పండుగలన్నీ చాంద్రమానాన్ని అనుసరించి వస్తాయి. అందుకే ఏటికేడు అవి వచ్చే తేదీలు, రోజులు మారుతుంటాయి. ఇక ఆధ్యాత్మికంగానూ మకర సంక్రాంతికి శుభప్రదమైన రోజుగా పేరున్నది. అందుకే స్వచ్ఛంద మరణం కలిగిన భీష్ముడు సంక్రాంతి పర్వదినం వరకు ఆగి ఉత్తరాయణంలో తన పంచప్రాణాలూ వదులుకోవడం ప్రారంభించాడట. మాఘ శుద్ధ ఏకాదశి నాడు ఐదో ప్రాణాన్ని వదిలి తనువు చాలించాడట. ఈ రోజు నుంచి స్వర్గ ద్వారాలు తెరిచి ఉంటాయని పురణాలు చెబుతున్నాయి.


8.
నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 15 జనవరి 2018

జేఈఈ మెయిన్ ఎడిట్ అవకాశం

జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే పరీక్ష జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ దరఖాస్తు చేసుకొన్నవారికి 'ఎడిట్' అవకాశాన్ని సీబీఎస్ఈ కల్పించింది. మెయిన్‌కు దరఖాస్తు చేసుకొన్న ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా తమ దరఖాస్తులను పరిశీలించుకోవాలని సీబీఎస్ఈ ప్రకటించింది. జేఈఈ మెయిన్‌కు దరఖాస్తు చేసుకొన్నవారు దరఖాస్తులో ఏవైనా తప్పులు, అసంపూర్తిగా నింపినా, పొరపాట్లు ఉన్నా జనవరి 22లోగా సవరించుకోవాలని సీబీఎస్ఈ ప్రకటించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్నవారు ఆఫ్‌లైన్‌లోకి మాత్రమే మారడానికి అవకాశం లేదు. జనవరి 22 తర్వాత ఎటువంటి సవరణలకు అవకాశం ఉండదు. పూర్తి సమాచారం కోసం https://jeemain.nic.in చూడవచ్చు.

తగ్గిన దరఖాస్తులు

- జేఈఈ మెయిన్ దరఖాస్తుల్లో ఈసారి తగ్గినట్లు సీబీఎస్ఈ వెల్లడించింది. జేఈఈ మెయిన్ 2018కి సుమారుగా 11.48 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకొన్నట్లు సమాచారం. గతేడాదితో పోలిస్తే దరఖాస్తుదారుల సంఖ్య తగ్గింది. గత నాలుగేండ్లలో దరఖాస్తు చేసుకొనే విద్యార్థుల సంఖ్య 15.3 శాతం తగ్గింది. ఈసారి మహారాష్ట్ర నుంచి దరఖాస్తు చేసుకొన్నవారి సంఖ్య పెరిగింది.
- జేఈఈ మెయిన్‌కు 2017లో 11.99 లక్షలు, 2016లో 12.07 లక్షలు, 2015లో 13.04 లక్షలు, 2014లో 13.56 లక్షలు, 2013లో 12.82 లక్షల మంది దరఖాస్తు చేసుకొన్నారు.



విశ్లేషణ

దీ్వపం... చుట్టూ నీరు.. మధ్యలో భూమి. ప్రకృతి రమణీయ దృశ్యాలు.. పర్యాటకులకు స్వర్గధామాలు.. అత్యంత అభివృద్ధి చెందినవి కొన్ని, నాగరిక ఆనవాళ్లను దరిచేరనీయకుండా తమ అస్థిత్వాన్ని కాపాడుకుంటున్నవి మరికొన్ని.. ఒకే భూభాగంతో ఉన్నవి కొన్నికాగా, కొన్ని దీవుల సముదాయంగా ఉండి దేశాలుగా.. ఖండాలుగా పిలువబడుతున్నవి ఇంకొన్ని.. చిన్న భూభాగాలే అయినప్పటికీ అభివృద్ధిలో దూసుకుపోతూ... యూరప్ వంటి ఖండాలను శాసిస్తున్నాయి.. ప్రపంచంలోని కొన్ని ద్వీపదేశాలు, వాటి రాజధానులు, జనాభా తదితర వివరాలు నిపుణ పాఠకుల కోసం..

..✍ సత్యం



ద్వీపదేశాలు-విశేషాలు

పలావు

- ఇది పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలోని ఒక ద్వీప దేశం. ఇది సుమారు 500 దీవులను కలిగి ఉంది.
- ఇందులో అత్యధిక జనాభా కలిగిన ద్వీపం కొరోర్.
- ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, ఫెడరేటెడ్ స్టేట్స్ ఆఫ్ మైక్రోనేషియాలతో సముద్ర సరిహద్దులను కలిగి ఉంది.
- దీని రాజధాని జెరుల్ముద్.

గుర్తింపు పొందిన ప్రాంతీయ భాషలు: జపనీస్, సోన్సోరోలిస్, టోబియన్

- **కరెన్సీ:** యూఎస్ డాలర్.

కిరిబతి

- ఇది సెంట్రల్ పసిఫిక్‌లో గణతంత్ర ద్వీప రాజ్యం.
- దీని రాజధాని దక్షిణ తారావా (ఇది అత్యధిక జనాభా నివసిస్తున్న ప్రాంతం).
- **కరెన్సీ:** ఆస్ట్రేలియన్ డాలర్, కిరిబతి డాలర్.

సింగపూర్

- ఇది 704 చ.కి.మీ. (272 చ.మై) విస్తీర్ణంతో దక్షిణాసియాలోని చిన్న దేశం.
- **మతం:** జనాభాలో 51 శాతం ప్రజలు బౌద్ధమతం, థాయిజం అవలంబిస్తున్నారు. 15 శాతం క్రిస్టియన్లు, 14 శాతం ముస్లింలు, 15 శాతం ఏ మతం అవలబించనివారు కాగా, మిగతా వారంతా సిక్కు, హిందూ, బహాయి మతస్తులు.
- **భాషలు:** జాతీయ భాష మలయ్. అధికార భాషలు మలయ్, మాండరిన్, ఇంగ్లిష్, తమిళం.
- **జాతీయ గీతం:** మజులా సింగపుర

పపువా న్యూగినియా

- ఇది నైరుతి పసిఫిక్‌లోని ద్వీపదేశం.
- **రాజధాని:** పోర్ట్ మోర్స్బి
- ఇక్కడి ప్రజలు 850కి పైగా భాషలు మాట్లాడుతారు.
- **విస్తీర్ణం:** 4,62,840 చ.కి.మీ.
- **జనాభా:** 80,83,700
- **కరెన్సీ:** పపువా న్యూగినియా కినా (పీజీకే)

మార్షల్ ఐలాండ్స్

- ఇది పసిఫిక్ మహాసముద్రంలో భూమధ్యరేఖ సమీపంలో ఉన్న దేశం.
- దీని రాజధాని మజురో (Majuro)
- అధికార భాషలు: మార్షలీస్, ఇంగ్లిష్
- 53,066 జనాభా ఉన్నారు.
- దీని కరెన్సీ యూఎస్ డాలర్.

ఇండోనేషియా

- ఇండియా, పసిఫిక్ మహాసముద్రాల మధ్య ఉన్నది.
- ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీప దేశం.
- దీని రాజధాని జకార్త.
- మాట్లాడే భాషలు ఇండోనేషియన్, జపనీస్, సుందనీస్.
- 237.42 మిలియన్లు (2010 సెన్సస్ ప్రకారం), 26,11,15,456 (2016 అంచనా ప్రకారం) జనాభా ఉన్నది.
- ఈ దేశ కరెన్సీ ఇండోనేషియా రూపియా.

ఫిలిప్పీన్స్

- పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో సుమారు 7,641 ద్వీపాలను కలిగి ఉన్నది.
- దీని రాజధాని మనీలా. అతిపెద్ద నగరం క్వెజోన్.
- అధికార భాషలు ఫిలిపినో, ఇంగ్లిష్
- 2015 సెన్సస్ ప్రకారం 10,09,81,437 జనాభా ఉంది.
- ఈ దేశ కరెన్సీని ప్రాంతీయంగా పిసో, అంతర్జాతీయంగా పెసో అంటారు.

టోంగా

- ఇది దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో 169 ద్వీపాలను కలిగి ఉన్నది.
- దీని రాజధాని నుకువలోఫా (Nuku'alofa)
- అధికార భాషలు టోంగన్, ఇంగ్లిష్
- 2011 సెన్సస్ ప్రకారం 1,03,036 జనాభా ఉన్నది.
- **కరెన్సీ:** పాంగా (Pa'anga)

వనువటు

- ఇది పసిఫిక్ మహాసముద్రంలో న్యూగినియాకు తూర్పున, సోలమన్ దీవులకు ఆగ్నేయాన, ఫిజీకి పశ్చిమాన ఉన్నది.
- దీని రాజధాని పోర్ట్ విలా (Port Vila)
- బిస్లామా (Bislama), ఫ్రెంచ్, ఇంగ్లిష్ అధికార భాషలు.
- 2016 గణాంకాల ప్రకారం 2,72,459 జనాభా ఉంది.
- దీని కరెన్సీ వనువటు వటు (Vanuatu vatu).

ఐస్‌లాండ్

- ఇది నార్త్ అట్లాంటిక్ మహాసముద్రంలోని ద్వీప దేశం.
- 3,32,529 జనాభా ఉంది.
- 1,03,000 చ.కి.మీ. విస్తరించి ఉంది.
- దీని రాజధాని రెక్జావిక్ (Reykjavik)
- దీని కరెన్సీ ఐస్‌ల్యాండ్ క్రోనా
- ఐస్‌ల్యాండిక్ ఈ దేశ భాష.

న్యూజిలాండ్

- ఇది పసిఫిక్ మహాసముద్రంలో నైరుతి మూలన ఉన్నది.
- దీని రాజధాని వెల్లింగ్టన్.
- ఈ ద్వీపదేశంలోని పెద్ద నగరం ఆక్లాండ్.
- అధికార భాషలు ఇంగ్లిష్, మయోరి, న్యూజిలాండ్ సైన్ లాంగ్వేజ్.
- 42,80,000 జనాభా ఉంది.
- ఈ దేశ కరెన్సీ న్యూజిలాండ్ డాలర్.

ఫిజీ

- ఇది దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో వనువటుకు తూర్పున, టోంగాకు పశ్చిమాన ఉన్నది.
- ఈ దేశం అసలు పేరు రిపబ్లిక్ ఆఫ్ ఫిజీ ఐలాండ్స్.
- సువా దీని రాజధాని. అతిపెద్ద నగరం కూడా ఇదే.



- ఇంగ్లిష్, బా ఫిజియన్ అధికార భాషలు.
- జనాభా 9,44,720
- కరెన్సీ ఫిజియన్ డాలర్

సమోవా

- ఇది దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఉన్నది.
- దీని రాజధాని, అతిపెద్ద నగరం అపియా (Apia)
- సమోవా, ఇంగ్లిష్ అధికార భాషలు.
- దీని జనాభా 1,79,000
- దీని కరెన్సీ టాల (Tala)

మాల్టా

- ఇది మధ్యధరా సముద్రంలో ఉన్నది.
- దీని రాజధాని వాలెట్టా. అతిపెద్ద నగరం బిర్కిర్కర (Birkirkara)
- మాల్టీస్, మాల్టీస్ సైన్ లాంగ్వేజ్ అధికార భాషలు.
- 2014 అంచనా ప్రకారం 4,45,426, 2011 సెన్సస్ ప్రకారం 4,16,055 జనాభా ఉన్నది.
- ఈ దేశ కరెన్సీ యూరో.

యునైటెడ్ కింగ్‌డమ్

- అట్లాంటిక్ మహాసముద్రం, ఉత్తర సముద్రం, ఇంగ్లిష్, ఐరిష్ సముద్రంతో ఆవరించి ఉన్న ద్వీప దేశం ఇది.
- దీనిలో ఇంగ్లండ్, వేల్స్, స్కాట్లాండ్, ఉత్తర ఐర్లాండ్ దేశాలు ఉన్నాయి.
- దీని రాజధాని, అతిపెద్ద నగరం లండన్.
- అధికార భాష ఇంగ్లిష్.
- 2016 అంచనా ప్రకారం 6,56,48,100, 2011 సెన్సస్ ప్రకారం 6,31,81,775 జనాభా ఉన్నది.
- కరెన్సీ పౌండ్ స్టెర్లింగ్

సైప్రస్

- రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్‌గా పిలిచే ఈ దేశం మధ్యధరా సముద్రంలో ఉన్నది.
- మధ్యధరా సముద్రంలోని జనసాంద్రత అధికంగా కలిగిన ద్వీపదేశాల్లో ఇది మూడో స్థానంలో ఉంది.
- దీని రాజధాని, అతిపెద్ద నగరం నికోషియా (Nicosia)
- గ్రీక్, టర్కిష్ అధికార భాషలు.
- 2016 అంచనా ప్రకారం 11,70,125, 2011 సెన్సస్ ప్రకారం 8,38,897 జనాభా ఉన్నది.
- ఈ దేశ కరెన్సీ యూరో

బ్రూనై

- దీనిని స్టేట్ ఆఫ్ బ్రూనై దారుస్సలామ్ లేదా నేషన్ ఆఫ్ దారుస్సలామ్, ది అబోడ్ ఆఫ్ పీస్‌గా పిలుస్తారు.
- ఇది మలేషియా, దక్షిణ చైనా సముద్రం (పసిఫిక్ మహాసముద్రంలోని కొంతభాగం)లో చైనాకు అభిముఖంగా ఉన్న దేశం.
- దీని రాజధాని బందర్ సెరి బెగవాన్.
- మలాయ్, ఇంగ్లిష్ అధికార భాషలు.
- 2015 అంచనా ప్రకారం 4,17,200 జనాభా ఉంది.
- కరెన్సీ బ్రూనై డాలర్

బహ్రెయిన్

- కింగ్‌డమ్ ఆఫ్ బహ్రెయిన్ అని పిలిచే ఇది మిడిల్ ఈస్ట్‌లోని పర్షియన్ గల్ఫ్ పశ్చిమతీరంలో ఉంది.
- దీని రాజధాని మనామా.
- అధికార భాష అరబిక్.
- 2016 అంచనా ప్రకారం 14,25,171, 2010 సెన్సస్ ప్రకారం 12,34,571 జనాభా ఉంది.
- కరెన్సీ బహ్రెయిన్ దినార్.

ఐర్లాండ్

- రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్‌గా పిలిచే ఇది అట్లాంటిక్ మహాసముద్రం చుట్టూ, సెల్టిక్ సముద్రం దక్షిణాన, ఆగ్నేయ దిశగా సెయింట్ జార్జ్ చానల్, తూర్పున ఐరిష్ సముద్రంతో ఉంటుంది.
- దీని రాజధాని డబ్లిన్
- జాతీయ భాష ఐరిష్. అధికార భాషలు ఐరిష్, ఇంగ్లిష్.
- 2016 సెన్సస్ ప్రకారం 47,61,865 జనాభా ఉంది.
- దీని కరెన్సీ యూరో.

ఆస్ట్రేలియా

- ఇది భూగోళం దక్షిణ భాగంలో, పసిఫిక్, హిందూ మహాసముద్రాల మధ్య ఉన్నది.
- ఇది ప్రపంచంలో ఆరో అతిపెద్ద దేశం.
- దీని రాజధాని కాన్‌బెర్రా. అతిపెద్ద నగరం సిడ్నీ.
- జాతీయ భాష ఇంగ్లిష్.
- 2018 అంచనా ప్రకారం 2,47,74,800, 2016 సెన్సస్ ప్రకారం 2,34,01,892 జనాభా ఉన్నది.
- కరెన్సీ ఆస్ట్రేలియన్ డాలర్.

న్యూ క్యాలిడోనియా

- ఇది దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో చాలా ద్వీపాలను కలిగి ఉన్న దేశం.
- దీని రాజధాని నౌమియా (Noumea).
- అధికార భాష ఫ్రెంచ్.
- 2014 సెన్సస్ ప్రకారం 2,68,767 జనాభా ఉన్నది.
- దీని కరెన్సీ సీఎఫ్‌పీ ఫ్రాంక్ (CFP franc)

ఉత్తర ఐర్లాండ్

- ఇది యునైటెడ్ కింగ్‌డమ్‌లో భాగం.
- దీని రాజధాని బెల్‌ఫ్రాస్ట్.
- అధికార భాష ఇంగ్లిష్. స్థానిక భాషలు ఐరిష్, ఉస్టెర్ స్కాట్స్.
- 2017 అంచనా ప్రకారం 18,76,695, 2011 సెన్సస్ ప్రకారం 18,10,863 జనాభా ఉన్నది.
- దీని కరెన్సీ పౌండ్ స్టెర్లింగ్.

గువామ్

- ఇది పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలోని, యూఎస్ స్టేట్స్ అన్ ఇన్‌కార్పొరేటెడ్ (Unincorporated), వ్యవస్థీకృత భూభాగం.
- దీని రాజధాని హగట్నా (Hagatna).
- ఇంగ్లిష్, చమొరో దీని అధికార భాషలు.
- 2016 అంచనా ప్రకారం 1,62,742, 2010 సెన్సస్ ప్రకారం 1,59,358 జనాభా ఉంది.
- దీని కరెన్సీ యూఎస్ డాలర్.



నౌరూ

- ఇది సెంట్రల్ పసిఫిక్‌లోని ద్వీప దేశం.
- **రాజధాని:** ఎరెన్ డిస్ట్రిక్ట్
- **జనాభా:** 13,049
- **కరెన్సీ:** ఆస్ట్రేలియన్ డాలర్
- **అధికార భాషలు:** ఇంగ్లిష్, నౌరుయన్

సాలమన్ ఐలాండ్స్

- ఇది పసిఫిక్ మహాసముద్రంలో పపువా న్యూగినియాకు తూర్పున, వనువటుకు వాయవ్య ప్రాంతంలో 900కి పైగా చిన్న ద్వీపాలను కలిగి ఉన్న దేశం.
- దీని రాజధాని, అతిపెద్ద నగరం హోనియారా (Honiara)
- 5,99,419 జనాభా ఉంది.
- అధికార భాష ఇంగ్లిష్
- సోలోమన్ ఐలాండ్స్ డాలర్ దీని కరెన్సీ.

తువాలు

- ఇది పసిఫిక్ మహాసముద్రంలో హవాయి, మధ్య ఆస్ట్రేలియాలకు తూర్పు ఈశాన్యం, నౌరు, కిరిబతిలకు పశ్చిమాన ఉన్నది.
- దీని రాజధాని ఫునఫుటి (Funafuti)
- తువాలుయన్, ఇంగ్లిష్ దీని అధికార భాషలు
- దీని జనాభా 10,640
- దీని కరెన్సీ తువాలుయన్ డాలర్

మొదటి ఉద్యోగమా..?

సమాజంలోని అత్యధిక మంది ఏదో ఒక సమయంలో ఉద్యోగం చేయడం సహజం.. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత ఏదో ఒక ఉద్యోగంలో చేరేవారే ఎక్కువ. అలాంటి సందర్భంలో మొదటిసారి ఉద్యోగంలో చేరుతున్నవారు కొత్త పని ప్రదేశానికి అలవాటుపడటం, కొత్తవారితో కలిసిపోవడంలాంటి విషయాల్లో ఎలా వ్యవహరించాలి అనే సూచనలు మీకోసం...

..✍ బాలు జాజాల

సమయ వేళలు

- మొదట్లోనే ఆలస్యంగా ఆఫీసుకు వెళ్లడమనేది నెగెటివ్ ప్రభావం చూపిస్తుంది. సీనియర్లు, తోటి ఉద్యోగులు సమయ వేళలను గమనిస్తుంటారు. కాబట్టి సమయ వేళలు పాటించడమనేది కీలకం. కంపెనీ కూడా సమయ వేళలు పాటించే ఉద్యోగులపై సానుకూల దృక్పథంతో ఉంటుంది. త్వరగా ఆఫీసుకు రావడం దినచర్యలో భాగం చేసుకోవాలి.





సహనం, సంయమనం

- కొంతమంది మొదట్లోనే అద్భుతాలు చేయాలని ఉవ్విళ్లూరుతుంటారు. కంపెనీ సిస్టమ్‌నే మార్చేయాలని కలలుకంటుంటారు. అదంతా కొద్దిరోజుల్లోనే సాధ్యం కాదు. మొదట కంపెనీ లక్ష్యాలకనుగుణంగా పనిచేసుకుంటూ ఉద్యోగ నిర్వహణలో మీదైన పాత్ర పోషించాలి. కాబట్టి ప్రారంభంలోనే అద్భుతాలు ఆశించకుండా సహనం, సంయమనంతో బాధ్యతలు నిర్వర్తిస్తుండాలి.

గడువు లోపల

- పనిలో మీదైన ముద్ర వేయాలన్నా.. అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలనుకున్నా.. డెడ్‌లైన్ మిస్ కావొద్దు. అప్పజెప్పిన టాస్క్‌ను గడువులోగా పూర్తిచేసే సామర్థ్యం, నేర్పు కలిగి ఉండాలి. యాజమాన్యం ఒకటికి రెండుసార్లు అడగక ముందే జాగ్రత్త పడాలి. టాస్క్‌ను ప్రొఫెషనల్‌గా భావించి డెడ్‌లైన్ మిస్‌కాకుండా జాగ్రత్త పడాలి.





సందేహాలు, ప్రశ్నలు

- ఉద్యోగ నిర్వహణలో కీలకమైనవి ఇవి. కొత్తగా జాబ్ కెరీర్‌ను కొనసాగించేవారికి వివిధ అంశాలపై సందేహాలు, ప్రశ్నలు తలెత్తుతాయి. సీనియర్లు ఏమనుకుంటారోనని, బాస్ నొచ్చుకుంటారేమోనని.. అడగకుండా ఉండటం సరైంది కాదు. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకోవాలి. ఇతరులను ప్రశ్నలనడిగే క్రమంలో ప్రాధాన్యం ఉన్న అంశాలను చర్చిస్తూ ఉండాలి.

ఆలోచనలను పంచుకోండి

- ఐడియాలను పంచుకోవడానికి సీనియర్లే కానక్కర్లేదు. ఫ్రెషర్ అయినా.. సరే తమ ఆలోచనలను కంపెనీ యాజమాన్యంతో తెలుపవచ్చు. కంపెనీ లక్ష్యాలకనుగుణంగా మీ ఐడియాలు ఉంటే.. తప్పనిసరిగా తెలియజేయవచ్చు. ఒక్కోసారి మీ ఐడియాలను స్వీకరించకపోవచ్చు కూడా! అలాంటప్పుడు నిరుత్సాహపడకుండా ఎందుకు స్వీకరించలేదో? సానుకూలంగా ఆలోచించాలి. మీ ఐడియాలు కంపెనీకి లాభం చేకూర్చేలా ఉంటే కచ్చితంగా ప్రోత్సహం ఇస్తుంది.





ఆత్మవిశ్వాసం

- ఫస్ట్ జాబ్ అంటేనే తెలియని ఆందోళన ఉంటుంది. ఏదైనా టాస్క్‌ను స్వీకరించినప్పుడు ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో మొదలు పెట్టాలి. సీనియర్ల సలహాలు, సూచనలు పాటిస్తూ పనిచేయడం వల్ల కూడా నైపుణ్యం అలవడుతుంది. చిన్న టాస్క్‌లైనా నిర్లక్ష్యానికి తావివ్వకుండా మనసు పెట్టి పనిచేయడం ముఖ్యం.

పనికి ప్రాధాన్యం

- ప్రతి ఒక్కరికి పర్సనల్ స్పేస్ ఉంటుంది. వ్యక్తిగత అభిరుచులు, అలవాట్లు ఉంటాయి. ఇతరుల అభిరుచులు నచ్చకపోయినా వర్క్‌లో భాగంగా ఇతరులతో మాట్లాడుతుండాలి. వ్యక్తిగత విమర్శలు చేయకుండా పనికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. అనవసర విషయాలు చర్చించకుండా ఉన్నట్లయితే, తోటి ఉద్యోగులు, సీనియర్లు మీతో కలిసి పోవడానికి ఆసక్తి చూపుతారు.





ప్రారంభంలో ఎక్కువ వద్దు

- ఉద్యోగ ప్రారంభంలోనే ఎక్కువ బాధ్యతలు స్వీకరించడమనేది కరెక్ట్ కాదు. ఉదాహరణకు కంపెనీ మీ టాస్క్‌ను ఐదు రోజుల్లో ముగించాలని సూచిస్తే పగలు, రాత్రి కష్టపడి ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేయడం సరైంది కాదు. ఒకేసారి ఎక్కువగా పనిచేయడం వల్ల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అత్యుత్సాహం కనబర్చకుండా గడువులోపే పనిపూర్తయ్యేలా వ్యవహరించండి.

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 15 జనవరి 2018

'సెక్యూరిటీస్ మార్కెట్' ప్రోగ్రామ్స్



డిగ్రీ చదివి పెట్టుబడులు, వాటికి అనుబంధ రంగాలను కెరీర్‌గా ఎంచుకోవాలనుకునేవారి కోసం 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్' (ఎన్ఐఎస్ఎం) పలు కోర్సులను అందిస్తుంది. రాయగఢ్‌లోని ఈ సంస్థ పీజీ డిప్లొమాల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో వాటి వివరాలు..

కోర్సుల వివరాలు:

- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ సెక్యూరిటీస్ (సెక్యూరిటీస్ మార్కెట్స్)
- ఇది రెండేండ్ల ఫుల్‌టైం కోర్సు
- **చివరితేదీ:** మార్చి 31

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ సెక్యూరిటీస్ మార్కెట్స్

- ఇది ఏడాది ఫుల్‌టైం ప్రోగ్రామ్
- దరఖాస్తు దాఖలుకు చివరితేదీ: మే 7

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డాటా సైన్స్

- ఇది తొమ్మిది నెలల పార్ట్‌టైం ప్రోగ్రామ్
- **చివరితేదీ:** జూన్ 24

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ క్వాంటిటేటివ్ ఫైనాన్స్

- ఏడాది ఫుల్‌టైం ప్రోగ్రామ్
- దరఖాస్తు దాఖలుకు చివరితేదీ: జూన్ 1

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఫైనాన్షియల్ ఇంజినీరింగ్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్

- ఇది ఏడాది పార్ట్‌టైం ప్రోగ్రామ్.
- **చివరితేదీ:** జూన్ 30
- **అర్హతలు:** పై కోర్సులన్నింటికి ఏదైనా డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

విశ్లేషణ

జీవనచిత్ర కళలు

ప్రతి మనిషికి ఒక కల ఉంటుంది. అలాగే ప్రతి పనిలోనూ ఒక కళ ఉంటుంది. మనిషి సాంఘిక జీవనంలో కళ అనేది లేకపోతే సమాజం ఎడారిని తలపిస్తుంది. అనేక రకాల కళలకు భారతదేశం పెట్టింది పేరు. మరి మన పొరుగున ఉన్న దేశాల్లో ఎలాంటి కళలు ఉన్నాయి? ఈ ప్రశ్న ప్రతి వ్యక్తిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తుంది. అందుకే ఆసియాలోని కొన్నిదేశాల్లో జాతీయ నృత్యాల సమాచారం నిపుణ పాఠకులకోసం

... సాయికిరణ్ వేముల

ఇండోనేషియా



- ఇండోనేషియాలో 3000లకు పైగా నృత్యాలు ఉన్నాయి. 700ల తెగలు ఉండగా, ఆయా తెగలకు సొంతంగా జానపద నృత్యాలు ఉన్నాయి. ప్రముఖ సమన్ డ్యాన్స్‌ను ప్రపంచ సాంస్కృతిక నృత్యంగా యునెస్కో ప్రకటించింది. బరాంగ్ (Barong), కెకాక్ (Kecak), లెగాంగ్ (Legong), సంగ్‌యాంగ్ (Sanghyang), జొగెడ్ (Joged), టపెంగ్ (Topeng), ఓలేగ్ (Oleg), పెండెట్ (Pendet), గంబుహ్ (Gambuh), బారిస్, కాన్‌డాంగ్ (Condong), సెంద్రావాసిహ్ (Cendrawasih), కెబ్యార్‌డుడుక్ (Kebyar duduk), పన్యెమ్‌బ్రమ (Panyembrama), జంగర్ తదితర నృత్యాలు ప్రసిద్ధి చెందినవి.

నేపాల్

- నేపాలీ సంప్రదాయాలు, సంస్కృతి, జీవన విధానంలో నృత్యాలు ప్రత్యేక స్థానాన్ని పొందాయి. శాస్త్రీయ, జానపద నృత్యాలు రెండూ విశిష్ట స్థానాన్ని పొందాయి. గాటు నృత్య (Ghatu Nritya), ద్యుడా నాచ్ (Deuda Naach), చాందిని నాచ్, దండి నాచ్, ధన్ నాచ్, సొరథి నృత్య (Sorathi), మరుని నృత్య (Maruni Nritya), హనుమాన్ నృత్య, దేవి నృత్య, గౌన నృత్య (Gauna Nritya), చ్యాబ్రగ్ నృత్య (Chyabrug Nritya), హోప్చ నృత్య (Hopcha Nritya), కౌర నృత్య, ముందుమ్ నాచ్ (Mundhum Naach), ఖ్యాలీ నాచ్ (Khyali Naach), చొకర నృత్య (Chhokara Nritya), పంచ బుద్ధ నృత్య, చరిత్ర నృత్య, భైరబ్ నృత్య తదితర శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రసిద్ధి చెందినవి.

శ్రీలంక

- శ్రీలంకలో ప్రధానంగా మూడు రకాలైన శాస్త్రీయ నృత్యరీతులు ఉన్నాయి. అవి... కంద్యన్ (Kandyan)/ ఉదరత నాటుమ్ (Uda Rata Natum), పహతరత నాటుమ్ (Pahatha Rata Natum), సబరగమువ డ్యాన్స్ (Sabaragamuwa) లేదా సబరగమువ నాటుమ్ (Sabaragamuwa Natum). ఇవే కాకుండా వెస్ (Ves), నాయ్యండి (Naiyandi), ఉడెక్కి (Uddekki), పంతెరు (Pantheru), వన నృత్యాలు ఉన్నాయి.
- **జానపద నృత్యాలు:** లీకెలి (Leekeli), కలగెడి (Kalagedi), రబన్ (Raban), పోల్‌కటు.

థాయిలాండ్



- జాతీయ నృత్యం థాయి డ్యాన్స్. థాయిలాండ్ కళల్లో ప్రముఖ స్థానం ఈ నృత్యానికి ఉన్నది.
- **టర్కీ:** ప్రముఖ నృత్యాలు జైబెక్ (Zeybek), హలే (Halay), సిఫ్టెటెలి (Ciftetelli), సిక్ కర్సీలామా (Kasik Karsilama), బార్, హొర (Hora), లెజింక (Lezginka). మధ్య, పశ్చిమ టర్కీ ప్రాంతాల్లో ప్రముఖంగా ప్రదర్శించే జానపద నృత్యం జైబెక్. ప్రాంతాలను బట్టి ఈ నృత్య శైలి మారుతూ ఉంటుంది. ప్రాంతీయ గ్రామీణ జానపద నృత్యం హాలే.

రష్యా

- జానపద నృత్యాలు రష్యా సంస్కృతిలో ఇప్పటికీ కీలక భూమిక పోషిస్తున్నాయి. సంప్రదాయ జానపద నృత్యాల ద్వారా వివిధ జాతులు తమ అస్థిత్వాన్ని ప్రదర్శిస్తుంటాయి. గ్రూప్ డ్యాన్స్, కోరోవ్డ్ (Khorovod), ప్లైఅస్కా (Plyaska), పెరిప్లేస్, క్వాడ్రిల్లెస్ (Quadrilles), బెరిన్య (Barynya), కామరిన్స్‌కాయ
- (Kamarinskaya), కాజచోక్ (Kazachok), చెచొట్క, ట్రోయ్కి, బేర్ డ్యాన్స్ తదితర నృత్యాలు ప్రసిద్ధి చెందాయి.

కొరియా



- జాతీయ నృత్యాలు బుచెఎచుమ్ (Buchaechum), పుంగ్‌ముల్ (Pungmul). బుచెఎచుమ్ కొరియా సంప్రదాయ నృత్యం. దీన్ని మహిళలు మాత్రమే ఉత్సవాల్లో ప్రదర్శిస్తుంటారు. నృత్యకారిణులు గులాబీ రంగు వేసిన ఫ్యాన్లతో ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. గ్రామీణ సంప్రదాయ నృత్యం పుంగ్‌ముల్. ఈ నృత్యాన్ని ఎక్కువగా వ్యవసాయ పనుల సమయంలో ప్రదర్శిస్తుంటారు.

మలేషియా

- మలేషియా జాతీయ నృత్యం జపిన్ (Zapin). జొజెట్ అనేది సంప్రదాయ నృత్యం. ఇది పోర్చుగీసు నృత్యమైన బ్రన్యో (Branyo) వల్ల ప్రభావితమై పలు మార్పులకు లోనైంది. మలక్క దీవిలో అందరికీ చకున్‌చక్ (Chakunchak) గా సుప్రసిద్ధం. ఈ నృత్యాన్ని పండుగలు, పెండ్లిళ్ల సందర్భంగా ఎక్కువగా ప్రదర్శిస్తుంటారు.
- **ప్రసిద్ధి చెందిన నృత్యాలు:** ఎండాంగ్ (Endang), డికిర్ బరట్ (Dikir barat), జికీ, కుడ లంపింగ్, మక్ ఇనాగ్ (Mak inang), గజట్ (Ngajat), పొంగల్య, సుమజౌ (Sumazau), ఉలెక్ మయాంగ్ (Ulek mayang), బ్రన్యో.

సింగపూర్

- చైనీస్ నృత్యాలన్నీ సింగపూర్‌లో ప్రసిద్ధి గాంచాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా లయన్ డ్యాన్స్‌ను ప్రదర్శిస్తుంటారు. భారతీయ శాస్త్రీయ నృత్యాలైన భరతనాట్యం, కథక్‌లను కూడా ప్రముఖంగా సింగపూర్‌లో ప్రదర్శిస్తుంటారు.

బంగ్లాదేశ్

- ఒకప్పుడు భారతదేశంలో అంతర్భాగమైన బంగ్లాదేశ్ సంస్కృతిపై బెంగాల్ ప్రభావం ఎక్కువగా ఉన్నది. ఇక్కడి ముఖ్యమైన నృత్యాలు బౌల్ (Baul), కథక్, మణిపురి, బిజు (Bizhu), మర్మ, నెమలి, పాము నృత్యాలు ప్రఖ్యాతి గాంచాయి.

మయన్మార్

- మయన్మార్‌లో నాటకసంబంధమైన, జానపద, గ్రామీణ నృత్యాలు ప్రముఖమైనవి. జాతీయ నృత్యం బర్మీస్ (Burmese). ప్రసిద్ధి చెందిన నృత్యాలు బగన్, భైలు (Bilu), కిన్నెర (Kinnara), మౌంట్ పొపస్ గార్డియన్ స్పిరిట్స్, నాట్ (Nat), ఆయిల్ ల్యాంప్, రామాయణ, యూ మిన్ గ్యావ్ (U Min Gyaw), యూ ష్వి యో (U Shwe Yoe), Zat Pwe duet, Zawgyi.

అర్మేనియా

- అర్మేనియా జాతీయ నృత్యాలు షలకో (Shalakho), కొచారి (Kochari), లెజ్‌జిక (Lezginka). అజేరి తెగకు చెందిన కాకసస్ వారి ప్రసిద్ధ నృత్యం షలకో. ఈ నృత్యం జానపదాలు ఆయా ప్రాంతాలను బట్టి మారుతుంటాయి. కొచారి అర్మేనియా మరో జానపద నృత్యం. ఆర్మేనియన్లు, అసిరియన్లు, అజర్‌బైజానియన్లు, కుర్దులు, పొంటిక్ గ్రీకులు ఈ నృత్యాన్ని ప్రముఖంగా ప్రదర్శిస్తుంటారు.



ఆఫ్ఘనిస్థాన్

- నూతన సంవత్సరం, వివాహాలు, ఇతర ఉత్సవాలు, యుద్ధ సమయాల్లో పఠాన్లు అట్టన్ నృత్యాన్ని ప్రదర్శిస్తుంటారు. ఈ నృత్యం పఠాన్ల సంస్కృతిలో భాగం. ఆఫ్ఘనిస్థాన్ జాతీయ నృత్యం అట్టన్. మరో ప్రముఖ నృత్యం ఖట్టాక్. యుద్ధానికి వెళ్లే ముందు ఖట్టాక్ నృత్యాన్ని ప్రదర్శిస్తుంటారు.

కంబోడియా

- కంబోడియా జాతీయ నృత్యం రోమ్‌వంగ్. జానపద నృత్యమైన రోమ్‌వంగ్ కంబోడియాతోపాటు లావోస్, థాయిలాండ్ దేశాలలో చాలా ప్రసిద్ధి చెందినది. ఈ నృత్యాన్ని ఇప్పటికీ సంప్రదాయ ఉత్సవాలైన ఖైమర్, లావోలతోపాటు థాయి ఉత్సవాల్లో ప్రముఖంగా ప్రదర్శిస్తుంటారు.
- **సైప్రస్:** జాతీయ నృత్యాలు టర్కిష్ సైప్రియాట్ జానపద (Turkish Cypriot folk), సౌస్ట (Sousta), టట్సియ (Tatsia). ఉత్తర సైప్రస్ ప్రాంతాల్లో అంతర్జాతీయ ఉత్సవాల్లో ఏడాదంతా జానపద బృందాలు టర్కిష్ సైప్రియాట్ నృత్యాన్ని ప్రదర్శిస్తుంటాయి. ఇక్కడి జానపద నృత్యాలు సైప్రస్ జీవనశైలిని ప్రతిబింబిస్తాయి.

జపాన్



- వర్షాలు కురిసినప్పుడు, పంటల సాగు, చేపలు పట్టే సమయాల్లో చేసే జానపద నృత్యాలకు నెలవు జపాన్. ఇక్కడి సంప్రదాయ నృత్యాలకు సుదీర్ఘ చరిత్ర ఉన్నది. పెద్ద సంఖ్యలో సంప్రదాయ నృత్యాలు గల జపాన్‌లో ముఖ్యంగా ఒడోరి (Odori), అసోబి (Asobi), మయ్ (Mai), కబుకి (Kabuki), నోహ్ మయ్ (Noh mai), బొన్ ఒడోరి (Bon Odori), నిహాన్ బుయో (Nihon Buyo).

టీఆర్‌టీ ప్రత్యేకం

వీళ్లకో పేజీ ఉంది..

మానవజాతి ఆవిర్భావం నుంచి విజ్ఞానశాస్త్ర అధ్యయనం జరుగుతూనే ఉంది. అరిస్టాటిల్ మొదలు ఎంతో మంది స్వదేశీ, విదేశీ శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలతో మానవాళి శ్రేయస్సుకు తోడ్పడ్డారు. టీఆర్‌టీ బయాలజీ సిలబస్‌లో శాస్త్రవేత్తలకు సంబంధించిన టాపిక్ కూడా ఉన్నందున.. కొందరు ప్రముఖ విదేశీ శాస్త్రవేత్తలు, వారి ఆవిష్కరణలకు సంబంధించిన సమాచారం నిపుణ పాఠకుల కోసం...


... తోట నాగరాజు

లూయీ పాశ్చర్



- పాశ్చర్ ఫ్రెంచి రసాయన శాస్త్రవేత్త. 1822 డిసెంబర్ 27న ఫ్రాన్స్‌లో జన్మించారు. 1948లో డాక్టరేట్ పూర్తిచేసి స్ట్రాస్‌బర్గ్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. మైక్రోబయాలజీలో విశేష సేవలు అందించారు.
- ద్రాక్ష సారాయి చెడిపోవడానికి సూక్ష్మజీవులు కారణమని కనుగొన్నారు. వేడి చేయడంవల్ల బ్యాక్టీరియా నశించి, సారాయి చెడిపోకుండా ఉంటుందని నిరూపించారు. పాలు, తదితర పదార్థాలను చెడిపోకుండా నిలువచేయడానికి పాశ్చర్ ఈ పద్ధతిని ఉపయోగించారు. దీన్నే 'పాశ్చరైజేషన్' అంటారు. పాల కేంద్రాల్లో పాలను నిలువచేయడానికి ఇప్పటికీ ఈ పద్ధతినే పాటిస్తున్నారు.
- పట్టుపురుగుల గుడ్లను సూక్ష్మజీవులు పాడుచేస్తున్నాయని గుర్తించిన పాశ్చర్.. వాటిని నిర్మూలించే పద్ధతిని కనిపెట్టారు. గొర్రెలకు సోకే 'ఆంథ్రాక్స్' వ్యాధికి టీకాను వృద్ధిచేశారు. ఇప్పటికీ 'రేబిస్' వ్యాధిని నయంచేయడానికి పాశ్చర్ చికిత్సావిధానాన్ని ఉపయోగిస్తున్నారు.
- అంగారక పదార్థాలు ధ్రువిత కాంతిని ఏవిధంగా విచలనం చెందిస్తాయో అధ్యయనం చేసి 'స్టీరియో కెమిస్ట్రీ' అనే కొత్త రసాయనశాస్త్రాన్ని రూపొందించారు. తన పరిశోధనలతో మానవాళికి వెలకట్టలేని సేవచేసిన పాశ్చర్ 1895 సెప్టెంబర్ 28న మరణించారు.

చార్లెస్ డార్విన్




- డార్విన్ పరిణామ సిద్ధాంత రూపకర్త. 1809, ఫిబ్రవరి 12న ఇంగ్లండ్‌లో జన్మించారు. కేంబ్రిడ్జిలో థియాలజీ కోర్సు పూర్తిచేశారు. చదువులో అంతగా రాణించని డార్విన్.. ప్రకృతిని పరిశీలించడంపై ఎక్కువ ఆసక్తి చూపేవారు.
- ప్రకృతి ప్రేమికుడిగా బీగిల్ అనే ఓడమీద 1831 నుంచి 1836 వరకు అనేక దేశాలు ప్రయాణించారు. ఆ సమయంలో ఎన్నో రకాల మొక్కలు, కీటకాలు, జంతువులు, రాళ్లు, శిలాజాలను సేకరించారు.
- జీవజాతుల ఉత్పత్తి గురించి తెలుసుకోవడానికి అవసరమైన సామగ్రి పెద్దమొత్తంలో గ్యాలపోగస్ దీవుల్లోని ప్రకృతి నుంచి లభ్యమైంది. వీటిని పరిశీలించిన డార్విన్ జీవకోటిలో కాలక్రమంగా మార్పులు వస్తుంటాయనే విషయాన్ని సిద్ధాంతీకరించారు. వాటిని తెలుసుకునేందుకు అనేక పరిశోధనలు చేశారు.
- ఆహారం కోసం జీవుల మధ్య సంఘర్షణ జరుగుతుందని, ఈ సంఘర్షణలో ఉపయోగపడే వైవిధ్యాలున్న జీవులే మిగులుతాయని, మిగతావి నశిస్తాయని పేర్కొంటూ 'యోగ్యతముల సార్థక జీవనం' గురించి తెలిపారు. ఈయన 1882, ఏప్రిల్ 19న తన 74వ ఏట మరణించారు. ఈయన పేరు 'ప్రకృతిమాత ముద్దుబిడ్డ'గా జీవశాస్త్ర చరిత్రలో నిలిచిపోయింది.

విలియం హార్వే




- హార్వే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వైద్యశాస్త్రవేత్త. 1578 ఏప్రిల్ 1న ఇంగ్లండ్‌లో జన్మించారు. 1597లో కేంబ్రిడ్జి యూనివర్సిటీలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేశారు. అనంతరం ఇటలీలోని పడువా మెడికల్ కాలేజీలో వైద్యవిద్య అభ్యసించారు. 1602లో ఇంగ్లండ్‌కు వెళ్లి లండన్‌లో వైద్యుడిగా స్థిరపడ్డారు.
- హార్వే జంతువుల హృదయం, రక్తప్రసరణ వ్యవస్థల మీద అనేక పరిశోధనలు చేశారు. చేపలు, కప్పలు, కోళ్ల పిండాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ వాటి రక్తప్రసరణ గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. హృదయ సంకోచం వల్ల రక్తం ధమనుల ద్వారా రక్తనాళాలకు చేరుతుందని తెలుసుకున్నారు. నాడి కొట్టుకోవడం అంటే గుండె కొట్టుకోవడమే అని రుజువు చేశారు.
- మానవుని గుండెలో నాలుగు గదులు ఉంటాయని, ధమనుల ద్వారా గుండెలోని రక్తం శరీరభాగాలకు సరఫరా అవుతుందని, వాటి నుంచి సిరల ద్వారా రక్తం గుండెకు చేరుతుందని కనిపెట్టారు. మనిషి గుండె నిమిషానికి ఎన్నిసార్లు కొట్టుకుంటుందో, ఎంత రక్తాన్ని పంప్ చేస్తుందో చెప్పగలిగారు. జీవశాస్త్ర పరిశీలనలో శాస్త్రీయపద్ధతిని ప్రవేశపెట్టిన మొదటి శాస్త్రవేత్త హార్వే. ఈయన 1657 జూన్ 3న తన 79వ ఏట మరణించారు.

అరిస్టాటిల్




- గ్రీకు శాస్త్రవేత్త. క్రీ.పూ. 384లో జన్మించారు. మొదట వైద్యశాస్త్రాన్ని అభ్యసించి క్రీ.పూ. 367లో ప్లేటో వద్ద తత్వశాస్త్రం అభ్యసించేందుకు ఏథెన్స్ నగరానికి వెళ్లాడు. క్రీ.పూ. 347లో ప్లేటో మరణానంతరం ఏథెన్స్‌ను వీడి కొంతకాలం ప్రయాణంలోనూ, ఏసియామైనర్ ద్వీపాల్లోనూ జీవశాస్త్ర అధ్యయనం చేశారు.
- విజ్ఞానశాస్త్ర రంగంలో అరిస్టాటిల్ స్పృశించని అంశం లేదు. ఖగోళ, భౌతిక, జంతు, వృక్ష, తర్క, తత్వ, నీతి, రాజనీతి, కావ్య, మనస్తత్వ శాస్త్రాలు అన్నింటిని అవపోసనపట్టి అనేక గ్రంథాలు రాశారు.
- జీవశాస్త్ర పరిశోధనల్లో చేసిన కృషికి గుర్తింపుగా అరిస్టాటిల్‌ను 'జీవశాస్త్ర పితామహుడు'గా వ్యవహరిస్తారు. జీవులను ఒక క్రమపద్ధతిలో వర్గీకరించే విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం అది సరైన పద్ధతి కానప్పటికీ.. ఆయన అనంతరం 2000 ఏండ్లపాటు ఆ పద్ధతే ఆచరణలో ఉన్నది.
- కోళ్లు, ఇతర జంతువుల పిండాభివృద్ధిని అరిస్టాటిల్ వర్ణించారు. ఈ వర్ణనే ఆధునికంగా ఉద్భవించిన పిండోత్పత్తి శాస్త్రానికి నాంది పలికింది. భూమి ఆవిర్భావం, పర్వతాలు రూపొందే విధానం గురించి కూడా ఆయన వివరించారు. అరిస్టాటిల్ క్రీ.పూ. 322లో మరణించారు.

రాబర్ట్ హుక్



- ఈయన 1635, జూలై 18న లండన్‌లో జన్మించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఉన్నతవిద్యను అభ్యసించారు. 1662లో రాయల్ సొసైటీ ఆఫ్ లండన్‌లో ప్రయోగాలు నిర్వహించే క్యూరేటర్‌గా, ఆ తర్వాత లండన్‌లోని గ్రెసామ్ కాలేజీలో జ్యామెట్రీ ప్రొఫెసర్‌గా పనిచేశారు.
- రాబర్ట్ హుక్ ఖగోళ, రసాయన, భూగర్భ శాస్త్రాలతోపాటు మరెన్నో శాస్త్రాల్లో ఆసక్తి చూపేవారు. హేగెన్స్, లీవెన్‌హుక్, బాయిల్, న్యూటన్ లాంటి ఎంతోమంది శాస్త్రవేత్తలతో కలిసి పనిచేశారు. సంయుక్త సూక్ష్మదర్శినిని కనిపెట్టి దాని సాయంతో కీటకాలు, స్పంజికలు, పక్షుల ఈకలను పరిశీలించారు. ఆ వివరాలను తన 'మైక్రోగ్రాఫియా' అనే గ్రంథంలో పొందుపర్చారు.
- ఐరిస్ డయాఫ్రమ్, రెస్పిరేటర్ ప్రొటోటైప్ గడియారాల్లో బ్యాలన్స్ స్ప్రింగ్, భారమితి, అనిమోమీటర్, హైగ్రోమీటర్ మొదలైన సాధనాలను ఈయన కనుగొన్నారు. స్థితిస్థాపకతను వివరిస్తూ 'హుక్ సూత్రం' ప్రతిపాదించారు. బెండు కణజాలంలోని కణ కుడ్యాలను పరిశీలించి అందులో కనిపించే పెట్టెల లాంటి నిర్మాణాలకు 'కణాలు' అని పేరు పెట్టారు.
- రాబర్ట్ హుక్ శిలాజాలపై కూడా విస్తృత పరిశోధనలు చేశారు. భూకంపాల గురించి అనేక పరిశోధనా వ్యాసాలు రాశారు. జీవిత చరమాంకంలో పదేండ్లపాటు అనారోగ్య సమస్యలతో బాధపడిన హుక్.. 1703, మార్చి 3న మరణించారు.

అలెగ్జాండర్ ఫ్లెమింగ్



- మానవాళికి ఎంతో ఉపయోగకరమైన 'పెన్సిలిన్' ఔషధాన్ని కనిపెట్టారు. ఫ్లెమింగ్ 1881, ఆగస్టు 6న స్కాట్లాండ్‌లో జన్మించారు. లండన్ యూనివర్సిటీలో వైద్యవిద్య అభ్యసించారు.
- వైద్యవృత్తిలో ఉండగా ఫ్లెమింగ్ రక్తంలో బ్యాక్టీరియాను ఎదుర్కొనే శక్తిని గురించి తెలుసుకోవాలనే ఆసక్తితో పరిశోధనలు ప్రారంభించారు. 1921లో కణజాలాల్లో, స్రావాల్లో బ్యాక్టీరియోలైటిక్ పదార్థాన్ని గమనించి 'లైసోసోమ్'గా పేరుపెట్టారు.
- ఈయన 1928లో ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌పై పరిశోధన చేస్తుండగా స్టాఫిలోకోకస్‌లను పెంచుతున్న ప్లేట్‌లో పెనిసీలియం అనే శిలీంధ్రం పెరగడం చూశారు. అది తన చుట్టూ బ్యాక్టీరియా లేకుండా చేసుకోవడం గమనించారు. పెనిసీలియం శిలీంధ్రం నుంచి వచ్చిన ఔషధానికి 'పెన్సిలిన్' అని పేరు పెట్టారు.
- ఫ్లెమింగ్.. లైసోసోమ్, పెన్సిలిన్‌ను వివరించడంతోపాటు బ్యాక్టీరియాలజీ, ఇమ్యునాలజీ, కీమోథెరపీపై పలు పరిశోధనాపత్రాలను తయారుచేశారు. ఫ్లెమింగ్ పెన్సిలిన్ గురించి రాసిన పరిశోధనాపత్రాల ఆధారంగా హవెర్స్, చెయిన్ అనే శాస్త్రవేత్తలు జంతువులపై పెన్సిలిన్‌ను ప్రయోగించి చూశారు. అనంతరం మానవులపై ప్రయోగించి పెన్సిలిన్ శక్తిని తెలుసుకున్నారు. జీవితమంతా సూక్ష్మజీవులపై పరిశోధనలతోనే గడిపిన ఫ్లెమింగ్ 1955, మార్చి 11న మరణించారు.

ఆంటోని వాన్ లీవెన్‌హుక్



- ఈయన డచ్చి శాస్త్రవేత్త. 1632 అక్టోబర్ 24న హాలెండ్‌లో జన్మించారు.
- 1674-75లో తొలిసారి సరళ సూక్ష్మదర్శినిని ఆవిష్కరించారు. దీనిద్వారా ఎర్ర రక్తకణాలు, ప్రోటోజోవన్లు, బ్యాక్టీరియాను కనుగొన్నారు. ప్రస్తుతం మనం చూసే మైక్రోస్కోప్‌ల కంటే ఆయన కనిపెట్టిన మైక్రోస్కోప్ భిన్నంగా ఉండేది.
- దాదాపు 200 రకాల మైక్రోస్కోపులను తయారుచేశారు. ఈ మైక్రోస్కోపులతో ఆయన ప్రకృతి సిద్ధంగా లభించే నీటిని, ఇతర జీవపదార్థాలను పరిశీలించారు. జలాల్లో, రక్తంలో, దంతాల పాచిలో, పేగులోని ద్రవాల్లో, మల విసర్జితాల్లో ఉండే వివిధ రకాల సూక్ష్మజీవులను కనుగొన్నారు.
- మైక్రోస్కోప్ వాడకాన్ని నిర్దేశించిన మొదటి శాస్త్రజ్ఞుడు లీవెన్‌హుక్. బ్యాక్టీరియాలను వర్ణించిన తొలి శాస్త్రవేత్తగా కూడా ఆయన గుర్తింపు పొందారు. అందుకే ఆయనను 'ఫాదర్ ఆఫ్ మైక్రోస్కోప్', 'ఫాదర్ ఆఫ్ బ్యాక్టీరియాలజీ'గా పేర్కొంటారు. ఆయన 1723 ఆగస్టు 26న తన 90వ ఏట మరణించారు.

సూపర్ 'ప్రత్యూష్'

దేశంలో అతివేగవంతమైన మొదటి మల్టి- పెటాఫ్లాప్స్ (పీఎఫ్) సూపర్ కంప్యూటర్ 'ప్రత్యూష్'ను పుణెలోని ఐఐటీఎంలో ప్రారంభించారు. ప్రత్యూష్ అంటే సూర్యుడు అని అర్థం. ఈ కంప్యూటర్ ద్వారా దేశంలోని వాతావరణ విషయాలను, తుఫాన్లు, వాయుగుండాలను ముందుగానే తెలుసుకోవచ్చు. ముఖ్యంగా రుతుపవనాలను, వాతావరణంలో చోటుచేసుకొనే అనూహ్య వాతావరణ మార్పులను, తుఫాన్లు, సునామీ, భూకంపాలను, గాలి నాణ్యతను, కాంతి, సముద్ర పరిస్థితులను, వరదలు, కరువు తదితరాలను గతం కంటే వేగంగా, కచ్చితత్వంతో తెలుసుకోవచ్చు.

ప్రత్యూష్ ప్రత్యేకతలు

- వాతావరణ పరిశోధనలకు వినియోగించే కంప్యూటింగ్ సామర్థ్యాన్ని పెటాఫ్లాప్స్ (పీఎఫ్ - ఫ్లోటింగ్ పాయింట్ ఆపరేషన్స్ పర్ సెకండ్)లో కొలుస్తారు. ప్రస్తుతం దేశంలో 1.0 పీఎఫ్ సామర్థ్యం మాత్రమే ఉంది.
- ప్రత్యూష్ అనే సూపర్‌కంప్యూటర్‌ను మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్‌సైన్సెస్ పరిధిలో ఏర్పాటుచేశారు. దీని సామర్థ్యం 6.8 పీఎఫ్. ఒకటి పుణెలో, రెండోది ప్రత్యూష్‌తో పుణెలోని ఐఐటీఎం సామర్థ్యం 4.0 పీఎఫ్, నోయిడాలోని ఎన్‌సీఎంఆర్‌డబ్ల్యూఎఫ్‌లో 2.8 పీఎఫ్ సామర్థ్యం ఉంటుంది.
- పెరిగిన సామర్థ్యంతో దేశంలో వాతావరణ పరిశోధనల్లో ఉన్న కంప్యూటర్ సామర్థ్యం 6.8 పీఎఫ్‌కు చేరనుంది.
- ప్రపంచంలో మనకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న దేశాల్లో యూకే, జపాన్, యూఎస్ ఉన్నాయి. దీంతో భారత్ నాల్గో స్థానానికి చేరుకున్నది. ఇప్పటివరకు 7వ స్థానంలో ఉండేది.

ప్రత్యేకతలు:

- 8,600 కంప్యూటర్లకు ఉన్నంత స్టోరేజీ సామర్థ్యం, 25,000 పర్సనల్ కంప్యూటర్లకు ఎంత ర్యామ్ అవసరమో అంత ర్యామ్ ప్రత్యూష్ సూపర్ కంప్యూటర్‌లో ఉంది.
- దీనిలో అత్యాధునిక 'ఇంటెల్ గ్జెనాన్' ప్రాసెసర్లను ఇందులో వినియోగించారు. ప్రత్యూష్‌పై కేంద్రం రూ. 450 కోట్లు వెచ్చించింది.
- ఈ సూపర్ కంప్యూటర్‌తో దేశంలోని వాతావరణ పరిస్థితుల అంచనాలో పెనుమార్పులు రానున్నాయి. సూర్యకాంతి, వేడి, వాతావరణంలో తేమశాతం, సముద్రాల్లో మార్పులు, రుతుపవనాలు తదితర అంశాలను వేగంగా కచ్చితంగా తెలుసుకొనే అవకాశం ఏర్పడనున్నది.

సుడోకు

డైలీ సుడోకు 100 సమాధానం

7	4	8	9	5	3	1	2	6
3	6	2	1	8	4	9	5	7
9	5	1	6	7	2	8	3	4
8	9	5	3	1	7	6	4	2
2	7	4	8	6	9	3	1	5
6	1	3	2	4	5	7	8	9
4	2	9	7	3	8	5	6	1
1	8	7	5	2	6	4	9	3
5	3	6	4	9	1	2	7	8

డైలీ సుడోకు -101

	6			9				
9		1		4				
		2	6	5	1			7
		8	3				9	
	7						2	
	2				9	3		
2			1	3	4	8		
				2		6		1
				6			3	

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

Dwaraka


SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
సంక్రాంతి
శుభాకాంక్షలు
MCA
మిడిల్ క్లాస్ అబ్బాయ్
MASS
CLASS
ALL CENTRES
BLOCKBUSTER


అన్నపూర్ణ వారి సంక్రాంతి బొబ్బట్టు
"రంగుల రాట్నం" బంపర్‌హిట్టు
రంగుల రాట్నం


UV creations
JAN
26
RELEASE
భాగమతి
VAMSI-PRAMOD
ASHOK
THAMAN S
MADHIE
HAPPY SANKRANTHI


BLUE PLANET
T G VISHWA PRASAD
PRESENTS
people MEDIA FACTORY
RELEASING
THIS MARCH
సంక్రాంతి
శుభాకాంక్షలు
MLA
మంచి లక్షణాలున్న అబ్బాయి
KIRAN REDDY
BHARATH CHOWDARY
UPENDRA MADHAV
VIVEK KUCHIBHOTLA
MANI SHARMA
PRASAD MURELLA
TAMMIRAJU
KIRAN KUMAR
PRAVEEN VARMA


UV creations
PRESENTS
studio green
K.E.GNANAVELRAJA'S
PRODUCTION
సంక్రాంతి
శుభాకాంక్షలు
SUPER
HIT
SURIYA'S
గ్యాంగ్